www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 26-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 238 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి రా.12:02 తదుపరి సప్తమి, నక్షత్రం: శ్రవణం రా.1:33 తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: తె.5:42 మొదలు, దుర్ముహూర్తం: ఉ.11:40-మ.12:24, అమృతఘడియలు: మ.2:27-4:10, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:30, సూర్యాస్తమయం: 5:34 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



మద్యం దుకాణాల సంఖ్య ఇలాగే పెరిగితే
రాష్ట్రానికి కొత్త పేరు పెట్టాల్సి వస్తుంది: హైకోర్టు 14



మెగా హైదరాబాద్

జీహెచ్ఎంసీలో 20 మునిసిపాలిటీలు, 7 కార్పొరేషన్ల విలీనం

విస్తరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
ఇకపై ఓఆర్ఆర్ వరకు జీహెచ్ఎంసీ పరిధి
2 కోట్ల జనాభాతో మినీ తెలంగాణగా అవతరణ
2,735 చదరపు కి.మీ.తో దేశంలోనే అతిపెద్ద నగరం
ఓఆర్ఆర్ దాకా ఒకే రకమైన పట్టణ ప్రణాళిక
అధ్యయనానికి జీహెచ్ఎంసీ కౌన్సిల్ ఆమోదం
గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. 1-2 నెలల్లో డివిజన్ల పునర్విభజన, కార్పొరేషన్ల విభజన పూర్తి.. అధికార వర్గాల వెల్లడి

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) విస్తరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జీహెచ్ఎంసీకి ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్)ను సరిహద్దుగా నిర్ణయించింది. దీంతో హైదరాబాద్ మహానగరం దేశంలోనే అతిపెద్ద నగరంగా అవతరించనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో హైదరాబాద్ శివారులో ఉన్న 20 మునిసిపాలిటీలు, 7 కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అందుకోసం జీహెచ్ఎంసీ, తెలంగాణ మునిసిపాలిటీ చట్టాలను సవరించడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని సమావేశం అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మీడియా సమావేశంలో తెలిపారు. విలీన ప్రక్రియలో అన్ని వర్గాలను పరిగణనలోకి తీసుకుంటామని

మిగతా 13వ పేజీలో...

3 కార్పొరేషన్లుగా మహానగరం

విలీనం నేపథ్యంలో జీహెచ్ఎంసీ విభజనకు ప్రభుత్వం యోచన
పాలనా సౌలభ్యం కోసమే..
ఫిబ్రవరి వరకు జీహెచ్ఎంసీ పాలక వర్గం గడువు 13
విభజనపై మార్చిలో ప్రకటన!

బీఆర్ఎస్ భూ మార్పిడిపై విచారణ

గత ప్రభుత్వ నిర్ణయాలన్నీ బయటపెడతాం
మంత్రివర్గ ఉపసంఘం సభ్యుల ప్రకటన 13

ప్రభుత్వ పథకాలకు ఓ డిస్కమ్!

కొత్త డిస్కమ్ ఏర్పాటుకు మంత్రివర్గం నిర్ణయం.. 28,90,686 కనెక్షన్లతో విద్యుత్ పంపిణీ సంస్థ
వ్యవసాయ పంపుసెట్లు, ఎత్తిపోతల పథకాలు, నీటిపారుదల ప్రాజెక్టుల కనెక్షన్లన్నీ దీని పరిధిలోకే
రామగుండంలో 800 మెగావాట్ల ప్లాంటుకు అనుమతి.. విద్యుత్ స్టోరేజీ ప్లాంట్లు 13
1500 మెగావాట్ల సామర్థ్యంతో 2 ప్లాంట్లకు ప్రణాళిక.. 'బూ' విధానంలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్

60% సీట్లు బీసీలకే ఇద్దాం!

పంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీలకు ప్రాధాన్యం
హైకోర్టు తీర్పు వచ్చాకే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు
మంత్రివర్గ సమావేశంలో చర్చ

మోగిన నగారా

పంచాయతీ ఎన్నికల ప్రక్రియ షురూ

షెడ్యూల్ ప్రకటించిన ఎస్ఈసీ.. అమల్లోకి కోడ్.. రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ
12,728 సర్పంచ్, 1,12,242 వార్డు సభ్యుల స్థానాలకు మూడు విడతలుగా ఎన్నికలు
వచ్చే నెల 11, 14, 17 తేదీల్లో పోలింగ్.. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట దాకా..
2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ.. ఇద్దరికన్నా ఎక్కువ మంది పిల్లలున్నా పోటీకి అర్హులే
రాష్ట్రంలో గ్రామీణ ఓటర్లు 1,66,55,186 మంది.. మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువ



ఎన్నికల షెడ్యూల్‌పై మీడియాతో మాట్లాడుతున్న ఎస్ఈసీ కమిషనర్ రాణి కుముదిని. చిత్రంలో ఉన్నతాధికారులు

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికల నగారా మోగింది. గురువారం (నవంబరు 27) ప్రారంభమయ్యే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ప్రక్రియ.. డిసెంబర్ 17 నాటికి పూర్తికానుంది. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మంగళవారం షెడ్యూల్ విడుదల చేశారు. ఎస్ఈసీ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ సృజన, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 12,728 సర్పంచ్ స్థానాలకు, 1,12,242 వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం 3 విడతల్లో ఎన్నికలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత.. అదేరోజు ఓట్ల లెక్కింపు జరిపి, ఫలితాలను ప్రకటించనున్నట్లు తెలిపారు. డిసెంబరు 11, 14, 17 తేదీల్లో పోలింగ్ ఉంటుందని.. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. అదే సమయంలో ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియను సంబంధిత విభాగాలు పూర్తి చేస్తాయని చెప్పారు. ప్రభుత్వం జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్ ఆధారంగా.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేసినట్లు ఎస్ఈసీ వెల్లడించారు. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో.. తక్షణమే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని స్పష్టంచేశారు. ఈసీఐ అందజేసిన ఓటరు జాబితాను ఆధారంగా చేసుకొని తుదిఓటరు జాబితాను గ్రామపంచాయతీ, వార్డుల వారిగా ఇప్పటికే సిద్ధం చేసినట్టు రాణి కుముదిని వివరించారు. విడతలవారీగా చేపట్టే ఈ ఎన్నికలకు సంబంధించి.. నోటిఫికేషన్ జారీచేసే రోజు నుంచే ఆ విడత ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ



మిగతా 14వ పేజీలో...

భవిష్యత్తుకు బ్రాండింగ్

పెట్టుబడులను ఆకర్షించేలా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు ప్రచారం ఉండాలి
రాష్ట్ర గతం, వర్తమానం, భవిష్యత్‌లను ప్రతిబింబించాలి
ప్రముఖుల సేవలను వినియోగించుకోవాలి: సీఎం
ఈ నెల 30 వరకు వివిధ అంశాలపై ప్రత్యేక సమీక్షలు 12



తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుపై ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్



ధ్వజారోహణలో ప్రధాని మోదీ, భాగవత్, యోగి 2

మానుతున్న శతాబ్దాల గాయాలు

నేడు ప్రపంచమంతా రామభక్తిలో మునిగింది

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా ఆత్మన్యూనత పోలేదు
మన జాతీయ చిహ్నాల రూపకల్పలోనూ దాని ప్రభావం
వచ్చే పదేళ్లలో ఆ భావజాలం నుంచి బయటపడదాం
అయోధ్యలో మోదీ.. రామ మందిరంపై ధ్వజారోహణం
కరసేవకుల ఆత్మలు నేడు శాంతించాయి: భాగవత్



ఆ సైన్యాధికారి తొలగింపు సబబే!

పూజలో పాల్గొనేందుకు నిరాకరించిన క్రైస్తవ సైన్యాధికారి డిస్మిస్‌పై సుప్రీంకోర్టు 2
తోటి సైనికుల భావోద్వేగాలను గౌరవించడంలో విఫలమయ్యారు
మన సైన్యం సెక్యులరిజానికి ప్రతీక
ధర్మాసనం వ్యాఖ్యలు

మాల వేసుకోవాలంటే సెలవు తీసుకోండి

జుట్టు పెంచుకొని, యూనిఫాం, బూట్లు లేకుండా విధులకు వచ్చేందుకు అనుమతి లేదు
దీక్షల విషయంలో సిబ్బందికి పోలీసు శాఖ ఉత్తర్వులు

సంతోష్‌నగర్, హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాల సహా ఇతర ఆధ్యాత్మిక దీక్షలు తీసుకునే పోలీసులు విధుల నుంచి సెలవు తీసుకోవాలని తెలంగాణ పోలీసు శాఖ తమ సిబ్బందికి సూచించింది. జుట్టు, గడ్డం పెంచుకొని, యూనిఫామ్‌కు బదులు సాధారణ దుస్తులు ధరించి, కాళ్లకు బూట్లు లేకుండా

మిగతా 14వ పేజీలో...



జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో 'వందేమాతరం' వివాదం

బీజేపీ, ఎంఐఎం సభ్యుల వాగ్వాదం
వందేమాతర గీతం ఆలపిస్తుండగా ఎంఐఎం సభ్యులు నిలబడలేదని బీజేపీ ఆరోపణ 14
తమని అవమానించారన్న మజ్లిస్
కుర్చీలు ఎక్కి ఇరువర్గాల పోటాపోటీ నినాదాలు

సూపర్ వుడ్.. ఉక్కును మించిన చెక్క

అల్యూమినియం కన్నా తేలిక.. అమెరికా శాస్త్రజ్ఞుల ఆవిష్కరణ
సాధారణ చెక్కలోనే రసాయనిక మార్పులతో అభివృద్ధి
నిర్మాణ, రక్షణ, వాహన తయారీ రంగాల్లో వినియోగం

న్యూయార్క్, నవంబరు 25: ఉక్కు అంటేనే శక్తికి, గట్టిదనానికి ప్రతీక! అలాంటి ఉక్కు కన్నా శక్తిమంతమైన.. అల్యూమినియం కన్నా తేలికైన, పర్యావరణహితమైన చెక్క ఆధారిత ఉత్పత్తిని అమెరికాలోని మేరీల్యాండ్ వర్సిటీ శాస్త్రజ్ఞులు అభివృద్ధి చేశారు. ప్రకృతి సిద్ధమైన

మిగతా 2వ పేజీలో...



కుటుంబసభ్యులే కాలయములు

- గతేడాది ప్రపంచవ్యాప్తంగా కుటుంబ సభ్యుల చేతిలో 50వేల మందికి పైగా మహిళల మృతి
- సగటున ప్రతీ 10నిమిషాలకొక హత్య

న్యూఢిల్లీ, నవంబరు 25: ప్రపంచవ్యాప్తంగా రోజుకు సగటున 137 మంది(ప్రతీ 10నిమిషాలకు ఒకరు) మహిళలు తమ జీవిత భాగస్వాములు, కుటుంబసభ్యుల చేతుల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. గతేడాది 50వేల మందికి పైగా మహిళలను వారి కుటుంబసభ్యులే చంపేశారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ఒకటి ఈ దారుణ విషయాన్ని వెల్లడించింది. 117దేశాల్లో హత్యా ఘటనలను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించారు. ఆ దేశం.. ఈ దేశం.. అని తేడా లేకుండా ప్రపంచంలో ప్రతీ చోటా మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఐరాస ఆందోళన వ్యక్తం చేసింది. ఆఫ్రికా ఖండంలో ఈ తరహా హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని, గతేడాది ఒక్క ఆఫ్రికాలోనే దాదాపు 22వేల మంది మహిళలు తమ కుటుంబసభ్యుల చేతుల్లో హత్యకు గురయ్యారని వివరించింది. ఇక, ఈ నివేదిక ప్రకారం.. మహిళల మొత్తం హత్యల్లో కుటుంబసభ్యుల చేతుల్లో చనిపోతున్న ఘటనలు 60% ఉన్నాయి. అదే సమయంలో కుటుంబసభ్యుల చేతుల్లో చనిపోతున్న పురుషుల సంఖ్య 11శాతంగా ఉంది.

మైనారిటీ విద్యాసంస్థల్లో అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా

- రాష్ట్రాలకు కేంద్ర అధికారుల సూచన

న్యూఢిల్లీ, నవంబరు 25 : మైనారిటీ విద్యా సంస్థల్లో ఏమైనా అనుమానాస్పద కార్యకలాపాలు సాగుతున్నాయా, ఆర్థిక అవకతవకలు ఉన్నాయా.. అని గుర్తించే బాధ్యతను రాష్ట్రాలకు అప్పగించారు. హరియాణాలోని అల్ ఫలా విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు వైద్యులకు ఉగ్ర ముఠాతో సంబంధాలు ఉన్నాయని తేలడం, ఢిల్లీ పేలుడు ఘటనతో వారికి సంబంధం ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సోమవారం ఢిల్లీలో జరిగిన ఒక ఉన్నత స్థాయి సమావేశంలో ఈమేరకు రాష్ట్రాలకు తెలియజేశారు. ఈ నిర్ణయం మేరకు.. రాష్ట్రాలు మైనారిటీ విద్యాసంస్థల్లో అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినప్పుడు కేంద్ర సంస్థలకు ఆ సమాచారం అందజేయాలి. అలాగే ఆయా సంస్థల్లో పనిచేస్తున్నవారిలో ఎవరికైనా అనుమానాస్పద గతం ఉండడం, అటువంటి కార్యకలాపాల్లో పాల్గొన్నా తెలియజేయాలి.

అరుణాచల్ మాదే..భారత మహిళను వేధించలే

- చైనా పునరుద్ఘాటన.. ఖండించిన భారత్

బీజింగ్/న్యూఢిల్లీ, నవంబరు 25: భారతీయ మహిళను షాంఘై విమానాశ్రయంలో తాము నిర్బంధించడం గానీ, వేధించడం గానీ చేయలేదని చైనా తెలిపింది. భారత వీసా చెల్లదంటూ హాస్యాస్పద కారణాలతో అరుణాచల్ ప్రదేశ్ మహిళను చైనా అధికారులు నిర్బంధించడంపై భారత్ మంగళవారం తీవ్ర నిరసన తెలియజేసింది. అరుణాచల్ తమ భూభాగమని తేల్చిచెప్పడంతో చైనా విదేశాంగ ప్రతినిధి మావో నింగ్ స్పందించారు. అరుణాచల్ తమ భూభాగమని.. దాని పేరు జాంగ్నాన్ అని, భారత్ చట్టవిరుద్ధంగా పెట్టుకున్న 'అరుణాచల్ ప్రదేశ్'ను తామెప్పుడూ గుర్తించలేదని స్పష్టంచేశారు. యూకేలో ఉంటున్న అరుణాచల్ మహిళ పేమా వాంగ్‌జోమ్ థాంగ్‌డాక్‌ను ఈ నెల 21న షాంఘై ఎయిర్‌పోర్టులో చైనా అధికారులు 18 గంటలు అదుపులోకి తీసుకున్నారు. అరుణాచల్ తమ భూభాగమంటూ ఆమె పాస్‌పోర్టుపై అభ్యంతరం తెలిపారు. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ నిరసన తెలిపింది.

అమెరికా కలలకు మరో దారి ఈబీ-1ఏ వీసా

న్యూఢిల్లీ, నవంబరు 25: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న కఠిన వలస విధానాలతో పాటు హెచ్-1బీ వీసా ఫీజును భారీగా పెంచేయడంతో అగ్రరాజ్యానికి వెళ్లేందుకు భారతీయులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. హెచ్-1బీ వీసాలపై ఆంక్షల నేపథ్యంలో ఎక్కువ మంది ఈబీ-1ఏ వీసా వైపు మొగ్గుచూపుతున్నారని నిపుణులు చెబుతున్నారు. యూఎస్ ఇమిగ్రేషన్ సేవల సంస్థ బౌండ్‌లెస్ ఇమిగ్రేషన్ గణాంకాల ప్రకారం... 2025 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఈబీ-1ఏ వీసా కోసం 7,338 దరఖాస్తులు అందాయి. అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే ఇది 56శాతం ఎక్కువ. వీరిలో అత్యధికులు భారతీయ దరఖాస్తుదారులేనని అంచనా వేస్తున్నారు. సైన్స్, కళలు, విద్య, వ్యాపారం తదితర రంగాల్లో అసాధారణ సామర్థ్యాలను ప్రదర్శించినవారు ఈబీ-1ఏ వీసాలకు అర్హులు. వీరు శాశ్వతంగా అమెరికాలో నివసించవచ్చు. అయితే నిర్దేశించిన పది ప్రమాణాల్లో కనీసం మూడైనా కలిగి ఉండాలి.

చైనా అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన ముగ్గురు వ్యోమగాములు

బీజింగ్, నవంబరు 25: చైనా అంతరిక్ష కేంద్రం తియాంగాంగ్ స్పేస్ స్టేషన్‌లో ముగ్గురు వ్యోమగాములు చిక్కుబడిపోయారు. వీరిని అక్కడి నుంచి తిరిగి తీసుకురావడానికి ఎమర్జెన్సీ అంతరిక్ష నౌకను చైనా మంగళవారం పంపింది. షెన్‌జో అంతరిక్ష నౌక ద్వారా ఈనెల మొదట్లో చైనా అంతరిక్ష కేంద్రం నుంచి వ్యోమగాముల బృందం భూమికి రావాల్సి ఉంది. అయితే వారు వెళ్లిన షెన్‌జో 20 నౌక అద్దానికి అంతరిక్షంలో మిగిలిపోయిన ఉపగ్రహ శకలాలు తగిలాయి. దాని వల్ల ఆ అద్దం పాడై తిరుగు ప్రయాణానికి వీలులేకుండా పోయింది. తర్వాత తమ స్థానాన్ని భర్తీ చేయడానికి షెన్‌జో 21 అంతరిక్ష నౌకలో వచ్చిన ముగ్గురు వ్యోమగాముల బృందాన్ని అంతరిక్ష కేంద్రంలోనే వదిలి షెన్‌జో 20 మిషన్ బృందం భూమికి చేరింది. పాడైపోయిన తమ నౌకను అంతరిక్షంలోనే వదిలివేసి షెన్‌జో 21 నౌకలో వారు తిరిగి వచ్చారు. అయితే అక్కడ చిక్కుకుపోయిన షెన్‌జో 21 బృందాన్ని తిరిగి భూమికి తీసుకురావడం కోసం షెన్‌జో 22 అంతరిక్ష నౌకను ఖాళీగా చైనా పంపింది.

8వ ఖండం 'జీలాండియా' జాడ దొరికింది

న్యూఢిల్లీ, నవంబరు 25: మనకు ఖండాలు ఏడు అన్న విషయం తెలుసు. కానీ ఎనిమిదో ఖండం 'జీలాండియా' జాడ ఇప్పుడు దొరికింది. ఉపగ్రహాల గ్రావిటీ మ్యాపింగ్, సముద్రలోతుల్ని లెక్కించే బాతిమెట్రీ విధానంతో శాస్త్రవేత్తలు దీనిని కనుగొన్నారు. అది భారతదేశం కంటే పెద్ద భూభాగం. పసిఫిక్ మహాసముద్రంలో ఆస్ట్రేలియాకు తూర్పు వైపున 94% మునిగిపోయి ఉంది. ఇది 49 లక్షల చదరపు కిలోమీటర్ల మేర వ్యాపించి ఉంది. మన మ్యాపుల్లో కనిపించకుండా పోయిన ఈ ఖండానికి సంబంధించి 2017లో భూగర్భ శాస్త్రవేత్తలకు కొన్ని ఆధారాలు లభించాయి. ఇతర ఖండాల్లో 30-45 కిలోమీటర్ల మందంతో ఉండే క్రస్ట్.. జీలాండియాకు 20 కి.మీ మాత్రమే ఉండటం వల్ల ఇది మునిగిపోయి ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

పిప్పళ్లతో పెద్దపేగు క్యాన్సర్ అంతం!

- ఎన్ఐటీ రూర్కెల పరిశోధకుల అధ్యయనం



న్యూఢిల్లీ, నవంబరు 25: పిప్పళ్లు లేదా తోక మిరియాలు.. దేశంలోని చాలామంది వంటిళ్లలో కనిపించే ఓ మసాలా దినుసు. ఈ పిప్పళ్లకు ప్రాణాంతకమైన పెద్ద పేగు క్యాన్సర్(కొలన్ క్యాన్సర్)ను అంతం చేసే శక్తి ఉందని పరిశోధకులు గుర్తించారు. పిప్పళ్లలో సహజసిద్ధంగా ఉండే పిప్లార్టైన్(పైపర్‌లాంగమీన్) అనే పదార్థం పెద్ద పేగు క్యాన్సర్ కణాలను సమర్థంగా చంపేస్తుందని కనుగొన్నారు. ఈ పిప్లార్టైన్ క్యాన్సర్ రోగులకు ఓ వరం లాంటి ఔషధమని రూర్కెలలోని ఎన్ఐటీ పరిశోధకులు చెబుతున్నారు. బిహార్ సెంట్రల్ యూనివర్సిటీ, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినాకు చెందిన బృందాలతో కలిసి ఎన్ఐటీ రూర్కెల పరిశోధకులు చేసిన అధ్యయనంలో పిప్పళ్లలోని క్యాన్సర్ సంహారక శక్తి వెల్లడైంది. పెద్ద పేగు క్యాన్సర్ బారిన పడిన రోగులకు ప్రస్తుతం కీమోథెరపీ ద్వారా చికిత్స అందిస్తున్నారు. ప్రత్యామ్నాయ వైద్య విధానాలపై పరిశోధనలు చేస్తున్న క్రమంలో పిప్పళ్లలోని పిప్లార్టైన్‌ను పెద్ద పేగు క్యాన్సర్ కణాలపై పరీక్షించిన ఎన్ఐటీ రూర్కెల పరిశోధకులు అద్భుతమైన ఫలితాన్ని కనుగొన్నారు. ఈ అధ్యయనానికి సంబంధించిన వివరాలు బయోఫ్యాక్టర్స్ అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

మానుతున్న శతాబ్దాల గాయాలు



రామాలయ ప్రాంగణంలో భారీ సంఖ్యలో భక్తులు, ఆలయ శిఖరంపై కాషాయ ధ్వజం

నేడు ప్రపంచమంతా రామభక్తిలో మునిగింది

- అయోధ్యలో రామ మందిరంపై ధ్వజారోహణం సందర్భంగా ప్రధాని మోదీ

అయోధ్య, నవంబరు 25: అయోధ్యలో రామమందిరం నిర్మాణంతో భారత ఆత్మకు శతాబ్దాలుగా అయిన గాయాలు మానుతున్నాయని, బాధ ఉపశమిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. నేడు భారత్‌తో పాటు మొత్తం ప్రపంచమే శ్రీరాముడి భక్తిలో మునిగిపోయిందని తెలిపారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం పూర్తయిన సందర్భంగా మంగళవారం ధ్వజారోహణం నిర్వహించారు. ఉత్సవ శోభ సంతరించుకున్న అయోధ్యా నగరంలో వేలమంది భక్తుల 'జైశ్రీరామ్' నినాదాల మధ్య ప్రధాని మోదీ కాషాయ జెండాను ఆలయ శిఖరంపై రిమోట్ ద్వారా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. '500 ఏళ్ల ఆకాంక్ష ఎట్టకేలకు నెరవేరింది. ఈ ధ్వజారోహణ కార్యక్రమం ఎంతో ప్రత్యేకమైన దైవకార్యం. ఆలయంపై రెపరెపలాడుతున్న ఈ కాషాయ జెండా ఎప్పటికైనా అబద్ధాలపై నిజమే విజయం సాధించి తీరుతుందని నిరూపిస్తోంది' అని పేర్కొన్నారు. అయోధ్య రామాలయ నిర్మాణం కోసం పోరాటం చేసిన చేసినవారితోపాటు ఆలయ నిర్మాణానికి సహకరించిన వారికి, రామ భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. 'త్రేతాయుగం నాటి అయోధ్య మానవతకు నైతిక మార్గంగా ఉండేది. 21వ శతాబ్దపు అయోధ్య నూతన అభివృద్ధి విధానానికి చిహ్నంగా మారింది' అని తెలిపారు.

ఆత్మన్యూనత నుంచి బయటపడదాం

ప్రజాస్వామ్యానికి భారతదేశమే తల్లి అని ప్రధాని మోదీ తెలిపారు. తమిళనాడులో వెయ్యేళ్లనాటి శాసనంలో ప్రజాస్వామ్య వ్యవస్థ గురించి వివరించారు. "మన డీఎన్ఏలోనే ప్రజాస్వామ్యం ఉంది. ఈ ప్రజాస్వామ్య వ్యవస్థను వేరే దేశం నుంచి తెచ్చుకున్నామని వలసవాద భావజాలం వల్ల నేడు మనం భ్రమపడుతున్నాం. భారతీయ ఘనతను తలకిందులు చేసే విత్తనాలను 190 ఏళ్ల క్రితం మెకాలే చల్లాడు. మన జాతీయ చిహ్నాల రూపకల్పనలో కూడా ఈ భావాలు ప్రభావం చూపాయి. మనం స్వాతంత్ర్యమైతే సాధించాం కానీ, ఆత్మన్యూనత నుంచి స్వాతంత్ర్యం పొందలేదు. ఈ రకమైన ఆలోచనా విధానం నుంచి బయటపడేందుకు వచ్చే పదేళ్ల కాలాన్ని కేటాయించాలి. అందులో భాగంగానే ఇటీవల మన నౌకాదళం పతాకాన్ని కొత్తగా రూపొందించాం. అది కేవలం డిజైన్ మార్పు మాత్రమే కాదు. మన ఆలోచనల్లో మార్పు" అన్నారు



కాషాయ ధ్వజానికి మోదీ ప్రత్యేక పూజలు

ప్రధాని భావోద్వేగం

అయోధ్యలో రామ మందిరం పునర్‌నిర్మించాలన్న శతాబ్దాల నాటి కల నెరవేరటంతో కోట్లాది మంది హిందువులు పులకించిపోతున్నారు. మంగళవారం ఆలయంపై స్వయంగా ధ్వజారోహణం చేసిన ప్రధాని మోదీ కూడా తన్మయత్వానికి లోనయ్యారు. ఆలయంపై ధ్వజం రెపరెపలాడగానే దానికి రెండు చేతులు జోడించి దండంపెట్టారు. ఆ సమయంలో మోదీ చేతులు వణికాయి. ఆ దృశ్యం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ధ్వజారోహణ కార్యక్రమానికి ప్రముఖులతోపాటు పలువురు సామాన్యులను కూడా అతిథులుగా ఆహ్వానించారు. అతిథుల్లో సోన్‌భద్రకు చెందిన ఆదివాసీలు, రామమందిరం-బాబ్రీ మసీదు కేసులో ప్రతివాది అయిన హషీమ్ అన్సారీ కుమారుడైన ఇక్బాల్ కూడా ఉన్నారు. ధ్వజారోహణం సందర్భంగా అయోధ్య నగరం ఉత్సవ శోభను సంతరించుకుంది. ఎటుచూసినా జైశ్రీరామ్ నినాదాలు మారుమోగాయి. నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

అమరుల ఆత్మలు శాంతించాయి

అయోధ్య రామాలయ నిర్మాణం కోసం త్యాగాలు చేసినవారి ఆత్మలు ఆలయ ధ్వజారోహణంతో శాంతించాయని ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ అన్నారు. ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 'ఈరోజు మనకు ఎంతో గొప్ప రోజు. సుదీర్ఘ కాలంగా ఉన్న మన కల నెరవేరిన రోజు. మన త్యాగాలన్నీ ఫలించిన రోజు. అశోక్‌సింఘాల్ (విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు)కు నిజమైన శాంతి లభించిన రోజు. ఎంతోమంది రామమందిరం కోసం త్యాగాలు చేశారు' అని పేర్కొన్నారు. అయోధ్య రామాలయంపై ధ్వజారోహణ కార్యక్రమం దేశంలో నూతన శకానికి నాంది అని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు.

పాంచజన్య మెమోరియల్ ప్రారంభం

మహాభారత సంగ్రామం జరిగిన హరియాణాలోని కురుక్షేత్రలో నిర్మించిన పాంచజన్య మెమోరియల్‌ను మోదీ మంగళవారం ప్రారంభించారు. శ్రీకృష్ణుడి శంఖమైన పాంచజన్యానికి గుర్తుగా దీనిని అదే ఆకారంలో నిర్మించారు. పాంచజన్య విగ్రహం 5.5 టన్నుల బరువు ఉంది. స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా నిర్మించిన అనుభవ్ కేంద్రాన్ని కూడా మోదీ సందర్శించారు. అక్కడే సిక్కు గురువు గురు తేగ్ బహదూర్ 350వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ధ్వజం ప్రత్యేకతలు

కాషాయ ధ్వజం రూపకల్పనలో పలు ప్రత్యేకతలు ఉన్నాయి. త్రిభుజాకారంలో ఉన్న ధ్వజం 10 అడుగుల ఎత్తు, 20 అడుగుల పొడవు ఉంది. దానిపై శ్రీరాముడి వంశమైన భగవాన్ సూర్యుడితోపాటు ఓంకారాన్ని ముద్రించారు. శ్రీరాముడి కాలంలో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న కోవిదార వృక్షాన్ని కూడా ధ్వజంపై ముద్రించారు. త్రేతాయుగంలో కశ్యప మహర్షి మందార, పారిజాత చెట్లను అంటుకట్టి ఈ కోవిదార వృక్షాన్ని సృష్టించినట్లు చెబుతారు. శ్రీరాముడి సోదరుడైన భరతుడి రథ ధ్వజంలో ఈ వృక్షపు చిహ్నమే ఉంటుంది.

లోకం తీరు



ఆపరేషన్ యాంటీబయాటిక్స్

- నేషనల్ యాక్షన్ ప్లాన్ 2.0 విడుదల

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి పెనుముప్పుగా పరిణమిస్తున్న యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)ను ఎదుర్కోవడానికి భారతదేశం సిద్ధమైంది. అత్యాధునిక యాంటీబయాటిక్ మందులకూ లొంగని మొండి సూక్ష్మజీవులను (ఎంఎంఆర్) అరికట్టేందుకు పక్కా కార్యాచరణ ప్రణాళికతో ముందుకొచ్చింది. రాబోయే ఐదేళ్ల కాలానికి (2025-2029) సంబంధించి.. 'నేషనల్ యాక్షన్ ప్లాన్ ఆన్ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఎన్ఏపీ-ఏఎంఆర్) 2.0'ను తాజాగా విడుదల చేసింది. కేంద్రం రూపొందించిన ఈ యాక్షన్ ప్లాన్ ప్రధానంగా ఆరు అంశాల ఆధారంగా పనిచేయనుంది.

విస్తృత అవగాహన: యాంటీబయాటిక్స్‌ను విచ్చలవిడిగా వాడేయకూడదని ప్రజలకు అర్థమయ్యేలా చెబుతారు. స్కూల్ పిల్లల నుంచి హెల్త్ వర్కర్ల వరకు అందరికీ దీనిపై అవగాహన కల్పిస్తారు.

పటిష్టమైన నిఘా: దేశవ్యాప్తంగా ల్యాబ్‌ల సామర్థ్యాన్ని పెంచనున్నారు. ఏయే ప్రాంతాల్లో ఏ బ్యాక్టీరియా మందులకు లొంగడం లేదు? ఎక్కడ ఎక్కువ కేసులున్నాయి? అనే డేటాను సేకరిస్తారు. .

ఇన్ఫెక్షన్ల నివారణ: ఆసుపత్రుల్లో పరిశుభ్రత పాటించడం ద్వారా.. ఇన్ఫెక్షన్లు ఒకరి నుంచి ఒకరికి సోకకుండా చూస్తారు. దీనివల్ల మందుల వాడకం తగ్గుతుంది.

మందుల వాడకంపై నియంత్రణ: వైద్యులు సిఫారసు చేసి, ప్రిస్క్రిప్షన్ ఇస్తేనే ఔషధాలను అమ్మే విధానాన్ని తీసుకురానున్నారు. డాక్టర్ చీటీ లేకుండా మందులు అమ్మడాన్ని పూర్తిగా అరికడతారు.

పరిశోధనలు-ఆవిష్కరణలు: పాత మందులు పనిచేయడం లేదు కాబట్టి, కొత్త యాంటీబయాటిక్ ఔషధాలను, టీకాలను, తక్కువ ఖర్చుతో రోగాన్ని గుర్తించే కిట్లను తయారు చేయడంపై దృష్టి సారిస్తారు. ఇందుకోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తారు.

సమన్వయం: ఇది ఒక్క ఆరోగ్య శాఖ పనే కాదు కాబట్టి... వ్యవసాయం, పశుసంవర్ధక, పర్యావరణ శాఖలతో సమన్వయం చేస్తారు.

కొన్నిసార్లు శిక్ష కన్న క్షమ మిన్న

- బూటు విసిరిన ఘటనను పట్టించుకోలేదు
- హిందువులను కించపరచడమన్న ప్రశ్నే లేదు: మాజీ సీజేఐ జస్టిస్ గవాయ్



న్యూఢిల్లీ, నవంబరు 25: కోర్టులో తనపై బూటు విసిరిన సంఘటనను తాను పట్టించుకోలేదని, ప్రభావితం కాలేదని మాజీ సీజేఐ జస్టిస్ గవాయ్ అన్నారు. తాను హిందువుల మనోభావాలను దెబ్బ తీశానన్న ప్రశ్నే తలెత్తదని చెప్పారు. పదవీ విరమణ చేసిన అనంతరం ఆయన ఓ టీవీ ఛానెల్‌తో మాట్లాడారు. మధ్యప్రదేశ్‌లో ఓ విష్ణు విగ్రహం పునరుద్ధరణకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా 'పోయి, దేవుడికే చెప్పుకోండి' అని పిటిషనర్‌ను ఉద్దేశించి అన్నారు. ఇది హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనని నిరసన తెలుపుతూ కోర్టులో ఒకరు ఆయనపై బూటు విసిరారు. దీనిపై అడిగిన ప్రశ్నకు గవాయ్ సమాధానం ఇస్తూ 'నేను హిందువుల మనోభావాలను కించపరిచానన్న ప్రశ్నే లేదు. నేను గుడులు, దర్గాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు అన్నింటికీ వెళ్తాను. అన్ని మతాలనూ అమితంగా గౌరవిస్తాను' అని చెప్పారు. ఆ నిర్ణయం ఆ క్షణంలో తీసుకున్నదే తప్ప ముందుగా అనుకొని చేసినది కాదని అన్నారు. బూటు విసిరన వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకోవడానికి ఇష్టపడలేదని చెప్పారు. కొన్ని సార్లు శిక్షించడం కన్నా క్షమించడం మంచిదని అన్నారు. వ్యాఖ్యలు చేసేటప్పుడు జాగ్రత్త అవసరమని ఈ సంఘటన రుజువు చేసిందని చెప్పారు. రిటైర్మెంట్ అయిన తరువాత ప్రభుత్వ పదవులు చేపట్టకూడదని బాధ్యతలు స్వీకరించిన రోజునే అనుకున్నానని చెప్పారు. దానికి కట్టుబడి ఉంటానన్నారు.

ఆ సైన్యాధికారి తొలగింపు సబబే!

పూజలో పాల్గొనేందుకు నిరాకరించిన క్రైస్తవ సైన్యాధికారి డిస్మిస్‌పై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబరు 25: తమ రెజిమెంటుకు సంబంధించిన హిందూ ఆలయంలో జరిగే వారాంతపు పూజలో ఇతర సైనికులతో కలిసి పాల్గొనటానికి నిరాకరించిన క్రైస్తవ మతానికి చెందిన ఓ సైన్యాధికారిని సైన్యం నుంచి తొలగించటాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. దీనివల్ల సదరు రెజిమెంటులో ఉండాల్సిన ఐక్యత దెబ్బతింటుందని, ప్రవర్తన మార్చుకోవాలని సీనియర్ అధికారులు పలుమార్లు చేసిన హెచ్చరికలను పెడచెవిన పెట్టటాన్ని.. తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యంగా అభివర్ణించింది. 'మీ ఉద్యోగానికి సంబంధించిన ఇతర అంశాల్లో మీరు ఎంత ప్రతిభావంతులైనా కావొచ్చు. కానీ, భారతీయ సైన్యం అంటేనే సెక్యులరిజానికి ప్రతీక. మీ సొంత సైనికుల భావోద్వేగాలను గౌరవించటంలో మీరు విఫలమయ్యారు' అని వ్యాఖ్యానించింది. శామ్యూల్ కమలేశన్ అనే సైన్యాధికారిని ఆర్మీ నుంచి తొలగించిన అంశంపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. శామ్యూల్ కమలేశన్ 2017లో సైన్యంలో చేరారు. తదనంతర కాలంలో ఆయనకు ఒక స్క్వాడ్రన్ ట్రూప్ లీడర్ బాధ్యతలు అప్పగించారు. వారి రెజిమెంట్ ఉండే ప్రాంతంలో ఒక గురుద్వారా, ఒక ఆలయం ఉన్నాయి. వారాంతాల్లో జరిగే ఆధ్యాత్మిక పరేడ్‌లలో శామ్యూల్ తన సైనికులతో కలిసి పాల్గొనేవారు. అయితే, ఆలయంలో జరిగే మంగళహారతి, పూజ వంటి కార్యక్రమాల్లో పాలుపంచుకోకుండా ఆలయం బయట ఉండిపోయేవారు. దీనిపై ఆయన పైఅధికారులు పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. తర్వాత ఆయనను విధుల నుంచి తొలగించారు. ఈ ఉత్తర్వులను శామ్యూల్ ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేయగా.. ఉన్నతాధికారుల నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించింది. దీంతో, శామ్యూల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ.. 'ఈ విధమైన ప్రవర్తన ద్వారా మీరు ఏ సంకేతం ఇస్తున్నారు? నాయకులు ఒక సమున్నత ఉదాహరణగా నిలవాలి. కానీ, మీరు మీ సైనికులనే అవమానిస్తున్నారు' అని పేర్కొన్నారు. శామ్యూల్ కమలేశన్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ వాదనలు వినిపిస్తూ.. తన క్లయింట్ రెజిమెంటులో జరిగే దీపావళి, హోలీ వంటి పండుగల్లో పాల్గొంటారని, సర్వధర్మస్థల్ (అన్ని మతాల ప్రార్థనాస్థలం) వద్ద జరిగే కార్యక్రమాల్లోనూ పాలుపంచుకుంటారని తెలిపారు. ప్రస్తుతం పోస్టింగు ఉన్న ప్రాంతంలో సర్వధర్మస్థల్ లేకపోవటంతో.. ఆలయం బయట జరిగే కార్యక్రమాల్లో పాల్గొనటానికి సిద్ధంకానీ, లోపల జరిగే పూజల్లో మాత్రం పాల్గొననని, తన మతభావనకు అది విరుద్ధమని తెలిపారని పేర్కొన్నారు. ఆర్టికల్ 25 ప్రకారం శామ్యూల్ తన మతాన్ని పాటించే హక్కును కలిగి ఉంటారని, ఆర్మీ అధికారి అయినంత మాత్రాన దానిని కోల్పోరన్నారు.



కస్టడీ మరణాలు వ్యవస్థకు కళంకం

న్యూఢిల్లీ, నవంబరు 25: పోలీసు కస్టడీలో హింస, మరణాలు వ్యవస్థకు కళంకంలాంటివని, దేశం వీటిని సహించబోదని మంగళవారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పోలీసు స్టేషన్లలో పనిచేసే సీసీటీవీ కెమేరాలు లేకపోవడంపై సుమోటోగా విచారణ జరుపుతున్నధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. రాజస్థాన్‌లో ఎనిమిది నెలల వ్యవధిలో 11 లాకప్ మరణాలు సంభవించడానికి సంబంధించిన కేసులో అన్ని పోలీసు స్టేషన్లలో సీసీటీవీ కెమేరాలు ఏర్పాటు చేసి, అవి పనిచేసేలా చూడాలని 2020లో ఆదేశించింది. ఆ ఆదేశాలు అమలు కాకపోవడంతో కోర్టులంటే చులకనగా తీసుకుంటున్నారా అని జస్టిస్ విక్రమ్ నాథ్ ప్రశ్నించారు. దీనిపై తుషార్ మెహతా స్పందిస్తూ ఆదేశాల అమలుపై మూడు వారాల్లో అఫిడవిట్లు సమర్పిస్తామని చెప్పారు.

గందరగోళానికి అధిష్ఠానం తెరదించాలి

- కర్ణాటక సీఎం సిద్దరామయ్య



బెంగళూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో సీఎం మార్పు అంశంపై నెలకొన్న గందరగోళానికి పార్టీ అధిష్ఠానం తెరదించాలని సీఎం సిద్దరామయ్య వ్యాఖ్యానించారు. బెంగళూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అధిష్ఠానం నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. అధిష్ఠానం పెద్దలను కలసి తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ ఎమ్మెల్యేలకు ఉందని స్పష్టం చేశారు. ఈ నెల 20వ తేదీకి కర్ణాటకలో రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలన పూర్తయింది. ఈ నేపథ్యంలో కర్ణాటక సీఎం మార్పుపై చర్చ మొదలైంది. తాజా పరిణామాలపై డీకే శివకుమార్ కనకపురలో మీడియాతో మాట్లాడారు. పవర్ షేరింగ్ గురించి 2023లో పార్టీలోని నలుగురైదుగురు ముఖ్యుల సమక్షంలో ఒప్పందం జరిగిందని వెల్లడించారు. అది తమ మధ్య జరిగిన రహస్య ఒప్పందమని, బహిర్గతం చేయలేమని తెలిపారు.

నన్ను టార్గెట్ చేస్తే మీ పునాదులు కదిలిస్తా: మమత



బొన్‌గావ్, నవంబర్ 25: రాష్ట్రంలో తనను టార్గెట్ చేస్తే, దేశంలో బీజేపీ పునాదులు కదిలిస్తానంటూ పశ్చిమబెంగాల్ సీఎం మమత వ్యాఖ్యానించారు. బీజేపీ ఎన్ని కోట్ల రూపాయాలు ఖర్చు పెట్టినా, కేంద్ర సంస్థలన్నింటినీ రంగంలోకి దించినా తనను ఓడించలేదని అన్నారు. థాకూర్ నగర్‌లో మంగళవారం ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా జరిగిన ర్యాలీలో ఆమె ప్రసంగించారు. రాష్ట్రంలో మతువా మెజార్టీ ప్రాంతాల్లోని ఓటర్లను సీఏఏ పేరుతో విదేశీయులుగా ప్రకటించి, వెంటనే జాబితా నుంచి తొలగించేలా బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ వల్ల రాష్ట్రంలో ఇప్పటివరకు 36మంది ప్రాణాలు తీసుకున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

దేశంలోనే 'హ్యామర్' క్షిపణుల తయారీ

భారత్, ఫ్రాన్స్ సంస్థల మధ్య ఒప్పందం

న్యూఢిల్లీ, నవంబరు 25: భారత రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేసుకొనే దిశగా కీలక ఒప్పందం కుదిరింది. అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేధించే సామర్థ్యం ఉన్న 'హ్యామర్' ఆయుధ వ్యవస్థ ఇకపై భారత్‌లోనే తయారు కానుంది. ఈ మేరకు మన దేశానికి చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), ఫ్రాన్స్‌కు చెందిన శాఫ్రాన్ ఎలక్ట్రానిక్స్ అండ్ డిఫెన్స్ జాయింట్ వెంచర్ సహకార ఒప్పందం చేసుకున్నాయి. ఆకాశం నుంచి భూమిపై (ఎయిర్ టూ గ్రౌండ్) ఉన్న లక్ష్యాలను ఛేదించేలా హామర్ క్షిపణి వ్యవస్థను రూపొందించారు. దీన్ని రాఫెల్ యుద్ధ విమానం, తేజస్ వంటి తేలికపాటి యుద్ధ విమానాల నుంచి ప్రయోగించవచ్చని రక్షణ శాఖ పేర్కొంది. మరోవైపు, బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను భారత్ ఇతర దేశాలకు సరఫరా చేయనుంది. ఈ మేరకు 450 మిలియన్ డాలర్ల (సుమారు రూ.4 వేల కోట్లు) విలువైన ఒప్పందాలు తుది దశకు చేరుకున్నాయని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు ఈ క్షిపణిపై ఆసక్తి కనబరుస్తున్నాయని తెలిపాయి.

సూపర్ వుడ్.. ఉక్కును మించిన చెక్క

(మొదటి పేజీ తరువాయి)

సాధారణ చెక్కనే రసాయన, యాంత్రిక మార్పులకు గురిచేయడం ద్వారా దాన్ని వారు కొన్ని పారిశ్రామిక లోహాల కన్నా మరింత బలంగా, దృఢంగా.. ఒక్క మాటలో చెప్పాలంటే 'సూపర్ వుడ్'గా మార్చగలిగారు. ఉక్కు బరువుతో పోలిస్తే ఆ చెక్క బరువు ఆరోవంతే! కానీ.. శక్తి మాత్రం ఉక్కుకన్నా 10 రెట్లు ఎక్కువ. సహజంగా భూమిలో కలిసిపోయే పదార్థం కావడంతో పర్యావరణానికి హానికరం కాదు. సూపర్‌వుడ్ తయారీలో భాగంగా తొలుత మామూలు చెక్కను తీసుకుని దానిలోని కొన్ని ముఖ్యమైన భాగాలను ముందుగా తొలగిస్తారు. చెక్కలో ముఖ్యమైన భాగాలు.. సెల్యులోజ్, హెమీసెల్యులోజ్, లిగ్నిన్. వీటిలో లిగ్నిన్.. చెక్కకు గోధుమ రంగును, గట్టిదనాన్ని ఇస్తుంది. ఈ మూడింటిలో.. లిగ్నిన్‌ను ఎక్కువగా, హెమీసెల్యులోజ్‌ను కొంత మేర తొలగిస్తారు. దీంతో చెక్క మృదువుగా తయారవుతుంది. అనంతరం అధిక ఒత్తిడి, ఎక్కువ ఉష్ణోగ్రత ఉపయోగించి ఆ చెక్కను కంప్రెస్ చేస్తారు. దీంతో చెక్కలో ఉండే సూక్ష్మతంతువులన్నీ ఒకదానికొకటి అతుక్కుపోయేంత దగ్గరగా జరిగి ఆ చెక్క అత్యధిక సాంద్రత కలిగిన బ్లాకుగా మారుతుంది. అదే పరిమాణంలో ఉన్న చెక్కతో పోలిస్తే.. ఈ సూపర్ వుడ్ దృఢత్వం 3 నుంచి 10 రెట్లు ఎక్కువగా, ఉక్కుతో సమానంగా లేదా అంతకు మించి ఉంటుందని మేరీల్యాండ్ వర్సిటీ శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. అదే సమయంలో.. ఈ చెక్క బరువు ఆయా లోహాలతో పోలిస్తే చాలా తక్కువగా ఉండడం గమనార్హం. ఇక.. సాధారణ చెక్క కంప్రెసివ్ స్ట్రెంత్ (అంటే చెక్కను ఎంత గట్టిగా నొక్కితే అది విరుగుతుందో తెలిపే బలం).. 35 ఎంపీఏ(మెగాపాస్కల్)గా ఉంటుంది. కానీ ఈ సూపర్‌వుడ్ కంప్రెసివ్ బలం ఏకంగా 160 ఎంపీఏ. కాగా.. ఈ పరిశోధన ప్రయోగశాలలకే పరిమితం కాలేదు. 'ఇన్వెంట్‌వుడ్' అనే కంపెనీని ప్రత్యేకంగా స్థాపించి.. ఈ సూపర్ వుడ్‌ను వాణిజ్యస్థాయిలో ఉత్పత్తి చేయడం ప్రారంభించారు.

రేపు వైకుంఠద్వార దర్శనాల ఈ-డిప్ కోటా విడుదల

» డిసెంబరు 1 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం

» తొలి మూడు రోజులూ ఉచిత దర్శనాలే

తిరుమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలను తొలి మూడు రోజులకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే ప్రక్రియ ఈ నెల 27న ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. డిసెంబరు 30, 31, జనవరి 1 తేదీల్లో వైకుంఠద్వార దర్శనాలను పూర్తి ఉచితంగా సామాన్య భక్తులకే కేటాయించాలని టీటీడీ నిర్ణయించింది. ఈరోజుల్లో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, శ్రీవాణి సహా అన్ని ప్రత్యేక దర్శనాలనూ రద్దు చేశారు. ఈ నెల 27 గురువారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ మొదలవుతుంది. డిసెంబరు 1న సాయంత్రం 5 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. ఆ తర్వాత డిప్ ద్వారా ఎంపికైన భక్తులకు డిసెంబరు 2వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు టోకెన్లు కేటాయిస్తారు. ఈ-డిప్ ద్వారా కేటాయించే టోకెన్ల కోసం టీటీడీ అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్‌తో పాటు వాట్సాప్‌లోని ఏపీ గవర్నమెంట్ బాట్‌లో కూడా రిజిస్ట్రేషన్ చేసుకునేలా టీటీడీ ఏర్పాట్లు చేసింది.



మంగళవారం ఉదయం పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌ను మునక వేయిస్తుండగా స్నానాలు ఆచరించేందుకు సిద్ధంగా ఉన్న భక్తులు

రికార్డు స్థాయిలో మల్లన్న హుండీ ఆదాయం

» 33 రోజుల్లో రూ.7,27,26,400 రాబడి

శ్రీశైలం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లన్నకు కార్తీకమాసంలో రికార్డ్ స్థాయిలో హుండీ ఆదాయం సమకూరింది. మంగళవారం జరిగిన హుండీ లెక్కింపులో రూ.7,27,26,400 ఆదాయం వచ్చింది. గత సంవత్సరం కంటే ఇది రూ.1.30 కోట్లు అధికం కావడం విశేషం. నగదుతో పాటు 117.800 గ్రాముల బంగారం, 7.230 కిలోల వెండిని భక్తులు హుండీలో సమర్పించారు. 646 యూఎస్‌ఏ డాలర్లు, 120 యూఏఈ దిర్హమ్స్, 85 సౌదీ రియాల్స్, 30 సింగపూర్ డాలర్లు, 136 ఖతార్ రియాల్స్, 85 ఇంగ్లాండ్ పౌండ్స్, 200 ఉమాన్ బైంసా, 25 ఆస్ట్రేలియా డాలర్లు తదితర విదేశీ కరెన్సీ కూడా లభించింది. చంద్రావతి కల్యాణ మండపంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీ లెక్కింపును చేపట్టినట్టు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.



శాంతి భద్రతల అదనపు డీజీపీ మహేష్ భగవత్‌తో ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు

తెలంగాణకు నలుగురు కొత్త ఐపీఎస్‌లు

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన నలుగురు ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారుల ఒక రోజు దిశానిర్దేశ కార్యక్రమం మంగళవారం డీజీపీ కార్యాలయంలో జరిగింది. రాష్ట్రానికి కేటాయించిన 2023 బ్యాచ్ ఐపీఎస్ అధికారులైన మందారే సోహం సునీల్, రాహుల్‌కాంత్, అయేషా ఫాతిమా, మనీషా నెహ్రాలు డీజీపీ కార్యాలయంలోని వివిధ విభాగాలను సందర్శించి అక్కడి పనితీరు తెలుసుకున్నారు. మొదటగా వారు శాంతి భద్రతల విభాగం అదనపు డీజీపీ మహేష్ భగవత్‌ను కలిసి శాంతి భద్రతలను పర్యవేక్షించే విధానం తెలుసుకున్నారు. అదేవిధంగా పోలీసు ఆర్గనైజేషన్ సెటప్ గురించి ఏఐజీ రమణకుమార్, పోలీసు కంప్యూటర్ సర్వీసెస్, కమ్యూనికేషన్ విభాగాల గురించి టెక్నికల్ సర్వీసెస్ అదనపు డీజీపీ వీవీ శ్రీనివాసరావు, ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ గురించి ఐజీపీ ఎం.రమేష్, ఆర్గనైజేషన్ కార్యకలాపాలపై అదనపు డీజీపీ స్వాతిలక్రా, మహిళా భద్రతా విభాగం, సీఐడీ గురించి అదనపు డీజీపీ చారుసిన్హాను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ పోలీసు అకాడమీలో ఐదు వారాల శిక్షణను పూర్తి చేసుకున్న అనంతరం సోహం సునీల్ కరీంనగర్ కమిషనరేట్, రాహుల్ కాంత్ ఆదిలాబాద్ జిల్లా, అయేషా ఫాతిమా సిద్దిపేట కమిషనరేట్, మనీషా నెహ్రా ములుగు జిల్లాలో శిక్షణ పొందనున్నారు.



తల్లి.. అచ్చంగా ఆమె గెటప్‌లో కుమారుడు (కుడివైపు)

పెన్షన్ పొందేందుకు 'ఆమె'గా

» స్కర్టు, విగ్గు, మేకప్‌తో తల్లి రూపంలో అతడు

» తల్లి మృతదేహాన్ని మమ్మీగా మార్చి..

» మూడేళ్లుగా తల్లి గెటప్‌లోనే..

» ఇటలీలో ఘటన.. నిందితుడి అరెస్టు..

న్యూఢిల్లీ, నవంబరు 25: పైసా సంపాదన లేని ఆ వయసు మళ్లిన వ్యక్తి అచ్చుగుద్దినట్లు తల్లి రూపురేఖలతోనే ఉండటాన్ని పూర్తిగా తనకు అనుకూలంగా మలచుకున్నాడు. ఉద్యోగ విరమణ చేసిన తల్లి చనిపోవడంతో ఆమెకొచ్చే పెన్షన్‌ను తాను పొందేందుకు పథకం వేశాడు. మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచి ప్రత్యేక రసాయనాలతో మమ్మీగా మార్చేశాడు. తర్వాత.. స్కర్టు ధరించి, విగ్గు పెట్టుకొని, లిప్‌స్టిక్ సహా పూర్తి మేకప్ తన తల్లి మాదిరిగా చలామణి అయ్యాడు. ఇలా ఏకంగా మూడేళ్ల పాటు అతడు పింఛను పొందాడు. ఇటలీలోని బోర్గో వర్జిలియో అనే పట్టణ శివారులో ఉంటున్న 57 ఏళ్ల వయసున్న మాజీ నర్సు గతంలో ఆస్పత్రిలో పనిచేసిన అనుభవం ఉండటంతో తల్లి మృతదేహం కుళ్లిపోకుండా మమ్మీగా మార్చగలిగాడు. అయితే ఇన్నాళ్లుగా 'ఆమె'గా చెలామణి అవుతున్న అతడు ఎలా పట్టుబడ్డాడన్నదే ఇక్కడ ఆసక్తికరం. ఎలాంటి అడ్డంకులు లేకుండా ఖాతాలో పెన్షన్ డబ్బులు పడేందుకుగాను తన తల్లి ఐడీ కార్డును రెన్యూవల్ చేయించడం కోసం అతడు స్థానిక రిజిస్ట్రీ ఆఫీసుకు ఆమె గెటప్‌తో వెళ్లాడు. అక్కడి ఉద్యోగి అనుమానంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. అతడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

పహాణీలో పేర్లు మార్చి పాస్‌పుస్తకాలు!

భూ యజమానికి తెలియకుండానే ఇతరులకు భూమి పట్టా.. కొత్త, పాత ఆర్‌వోఆర్‌లలో మాత్రం పాత యజమాని పేరే

» ఏ పద్ధతిలో భూ బదలాయింపు చేశారో చెప్పని అధికారులు

» అచ్చంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇష్టారీతిన పట్టాల మార్పు

» ఇతర ప్రాంతాల్లో ఉంటున్నవారు కౌలుకిచ్చిన భూములే టార్గెట్

మహబూబ్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వివాదాస్పద ధరణి శకం ముగిసి.. భూభారతి పోర్టల్ వచ్చినా.. ఆనాటి భూ వివాదాలు మాత్రం పరిష్కారం కావడంలేదు. ఏళ్ల కిందట రెవెన్యూ అధికారులు చేసిన తప్పులకు తాము బాధ్యులం కాదంటూ ప్రస్తుత అధికారులు చేతులెత్తేస్తున్నారు. భూ యజమానికి తెలియకుండా, అతనికి సమాచారం కూడా లేకుండానే పహాణీలో పేరు మార్చి.. మరొకరికి పాస్‌పుస్తకం జారీ చేసిన ఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి. దీనిపై బాధితులు తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీవో ఆఫీసుకు, అక్కడి నుంచి కలెక్టరేట్‌కు, సీసీఎల్‌ఏ దాకా వెళ్లినా ప్రయోజనం ఉండడంలేదు. నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇలాంటి భూ వివాదాలు వెలుగులోకి వస్తున్నాయి. ఉదాహరణకు.. అచ్చంపేట మండలం సిద్ధాపూర్‌కు చెందిన అడువంగల బాలలింగయ్య.. నీరటిగా పని చేసేవారు. దీంతో ప్రభుత్వం ఆయనకు సామాజిక సేవ కింద సర్వే నెంబర్ 326/3లో మూడు ఎకరాల భూమిని కేటాయించింది. ఆయనకు వారసత్వంగా లావాణి పట్టా కింద 326/6లో ఐదు ఎకరాల భూమి ఉంది. కాగా, బాలలింగయ్య 2000 సంవత్సరంలో మరణించారు. అప్పటి నుంచి ఆయన పేరుపైనే 2014 వరకు ఆ భూమి కొనసాగింది. ఆ తర్వాత పహాణీలో అనధికారికంగా వేరే వారి పేరు మీదికి భూమి మారింది. పట్టాదారు పాసుపుస్తకాలు కూడా ఇచ్చారు. బాలలింగయ్య కొడుకు శ్రీనివాస్ అప్పటి నుంచి తన తండ్రి నుంచి తనకు వారసత్వంగా రావాల్సిన భూమిని వేరే వారి పేరు మీదికి మార్చారని, అసైన్డ్ భూమిని ఎలా మారుస్తారని ప్రశ్నిస్తూ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు.



బదలాయింపు నిబంధనలకు విరుద్ధంగా..

సాధారణంగా.. భూమిని కొనుగోలు చేస్తే రిజిస్టర్డ్ డాక్యుమెంట్, వారసత్వంగా వస్తే మ్యుటేషన్, గిఫ్ట్ డీడ్, సాదా బైనామా లాంటి పద్ధతుల ద్వారా బదలాయింపు జరుగుతుంది. ఏ పద్ధతిలో బదలాయింపు జరిగిందో దానిని నెంబర్, డేట్ ఆర్‌వోఆర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ, ఇక్కడ ఇవేవీ లేకుండానే కేవలం పహాణీల్లో మాత్రమే పేర్లు మార్చి పాసుపుస్తకాలు అందజేశారు. ఆర్‌వోఆర్‌లో మాత్రం పాత పేర్లే కొనసాగుతున్నాయి. భూ భారతిలో దరఖాస్తు చేసుకుంటే బదలాయింపు జరిగి 12 ఏళ్లవుతున్నందున అప్పీలేట్ అధికారి అయిన ఆర్డీవోను కలవాలని చెప్పారు. అక్కడ అడిగినా సరైన సమాధానం రావడం లేదు. ఇలా అనధికారికంగా పట్టాలు కోల్పోయిన వారు చాలా మంది ఉన్నా.. బయటకు చెబితే అధికారులు తమ పనులు చేయరేమోనని చెప్పడానికి జంకుతున్నారు. కాగా, పహాణీల్లో పేర్లు మార్చి.. ఇతరులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చే పైరవీకారులు, అధికారులు ప్రధానంగా కౌలు భూములను టార్గెట్ చేస్తున్నారు. పట్టాదారులు స్థానికంగా అందుబాటులో ఉండని కారణంగా ఈ తతంగాన్ని యథేచ్ఛగా పూర్తి చేస్తున్నారు.

మా కోర్టులో అప్పీల్ చేస్తే బ్లాక్ చేస్తాం



పహాణీలో పేరు మార్చి భూబదలాయింపు చేసిన విషయమై అచ్చంపేట ఆర్డీవో మాధవిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఇది గతంలో ఎప్పుడో జరిగిందని, తమ కోర్టులో అప్పీల్ చేస్తే కొత్త పాసుపుస్తకాలను బ్లాక్ చేస్తామని చెప్పారు. అయితే అక్టోబరు 7వ తేదీనే బాలలింగయ్య కొడుకు ఆర్డీవో కోర్టులో బి/1245 ఆఫ్ 2025 నెంబర్‌తో అప్పీల్ చేశారు. అంతకు ముందు పలుమార్లు దరఖాస్తు కూడా చేసుకున్నారు. కానీ, ఈ విషయం తన దృష్టిలో లేదని ఆర్డీవో చెప్పడం గమనార్హం.

- మాధవి, ఆర్డీవో, అచ్చంపేట

హిడ్మా ఎన్‌కౌంటర్‌పై విచారణ చేపట్టండి

» ఎన్‌హెచ్‌ఆర్సీకి న్యాయవాది ఫిర్యాదు

హైదరాబాద్/చర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్‌పై సమగ్ర విచారణ చేపట్టాలని న్యాయవాది కె.విజయకిరణ్ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు (ఎన్‌హెచ్‌ఆర్సీ) ఫిర్యాదు చేశారు. ఎన్‌కౌంటర్ విషయంలో ఏపీ పోలీసులు నమోదు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌లపై విచారణ జరిపించాలని ఆయన కోరారు. కాగా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా పోలీసుల ఎదుట మంగళవారం నాడు 28 మంది మావోయిస్టులు ఆయుధాలతో పాటు లొంగిపోయారు. వీరిలో 8 మంది మహిళలు, 20 మంది పురుషులున్నారు. వీరంతా దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ సభ్యులుగా పని చేస్తున్నారు.



సీఆర్పీఎఫ్ బేస్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ఐజీ, ఎస్పీ

సురక్షిత ప్రాంతంగా కర్రెగుట్టలు

» సీఆర్పీఎఫ్ ఐజీ విక్రమ్

» మురుమూరులో బేస్ క్యాంప్ ప్రారంభం

వాజేడు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. కర్రెగుట్టలను పూర్తిగా ఆధీనంలోకి తీసుకునేందుకు ములుగు జిల్లా వాజేడు మండలంలోని మారుమూల అటవీ ప్రాంతమైన మురుమూరులో సీఆర్పీఎఫ్ 39వ బెటాలియన్ క్యాంపును ఏర్పాటు చేసింది. ఈ క్యాంపును మంగళవారం సీఆర్పీఎఫ్ దక్షిణ విభాగం ఐజీ టీ విక్రమ్ ప్రారంభించారు. కర్రెగుట్టలకు ఇది బేస్ క్యాంపుగా ఉంటుందని, పామునూరులో మరో క్యాంపును ఏర్పాటు చేసి.. కర్రెగుట్టల వరకు రహదారి నిర్మాణం చేపడతామని ఆయన తెలిపారు. సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఆదివాసీల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. 350 మంది సీఆర్పీఎఫ్ బలగాలను ఈ క్యాంపునకు కేటాయించినట్లు తెలుస్తోంది. ప్రైవేటు భూమిని ఐదేళ్ల పాటు లీజుకు తీసుకుని తాత్కాలిక టెంట్లు నిర్మించి క్యాంపును అందుబాటులోకి తీసుకొచ్చారు. త్వరలో పూర్తిస్థాయిలో క్యాంపు ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రేంజ్ డీఐజీ అనిల్ మింజ్, ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, కమాండెంట్ ప్రశాంత్ శ్రీవాత్సవ్, ములుగు ఓఎస్డీ శివం ఉపాధ్యాయ, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, సీఐ రమేష్, ఎస్సైలు సతీశ్, తిరుపతిరావు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులు తాళలేక అల్లుడి ఆత్మహత్య

వెల్దుర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భార్యతో కలిసి అత్తింటి వారు వేధింపులు గురిచేయడంతో మనస్తాపం చెందిన ఓ అల్లుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తిలో మంగళవారం చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టకు చెందిన హరిప్రసాద్ (32)కు, జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన పూజతో 2022లో వివాహం జరిగింది. పెళ్లయినప్పటి నుంచి వేరు కాపురం పెట్టాలంటూ అత్తమామలు హరిప్రసాద్‌పై ఒత్తిడి తీసుకువచ్చేవారు. ఈ నెల 2న పెద్దల సమక్షంలో జరిగిన పంచాయతీలో.. అత్తమామలు కిషన్, వరలక్ష్మితో పాటు వారి బంధువులు హరిప్రసాద్‌ను దుర్భాషలాడారు. 'పురుగుల మందు తాగి చనిపో' అని రెచ్చగొట్టారు. దీంతో మనస్తాపం చెందిన హరిప్రసాద్ ఈనెల 18న పూజ ఇంటి సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న హరిప్రసాద్ తల్లిదండ్రులు.. అతడిని నిమ్స్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు.. పూజ ఆమె తల్లిదండ్రులతో పాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



బేస్‌మెంట్ ఫ్లోరింగ్ కుంగడంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్‌ను పడిపోకుండా పట్టుకుంటున్న నాయకులు

కుంగిన 'డబుల్' ఇళ్ల బేస్‌మెంట్ ఫ్లోరింగ్

» ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్‌కు తప్పిన ప్రమాదం

వేములవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించేందుకు వెళ్లిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆర్టీసీ డిపో సమీపంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. అయితే, ఇటీవల అర్థాంతరంగా నిర్మాణ పనులు నిల్చిపోయాయి. దీంతో పనులను తిరిగి చేపట్టేందుకు మంగళవారం గరిమా అగ్రవాల్‌తో కలిసి ఆది శ్రీనివాస్ నిర్మాణాలను పరిశీలిస్తుండగా.. వారు నిల్చున్న బేస్‌మెంట్ ఫ్లోరింగ్ ఒక్కసారిగా కుంగిపోయింది. ప్రభుత్వ విప్, కలెక్టర్‌లు పట్టుతప్పి కింద పడబోగా అక్కడే ఉన్న నాయకులు వారిని పట్టుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యత లేకుండా నిర్మాణం చేపట్టిన కారణంగానే ఫ్లోరింగ్ కుంగిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు.

ఎన్‌డీడీబీతో మదర్ డెయిరీ ఒప్పందం

» ఇక పాడి రైతుల కష్టాలు తొలగినట్లే

» డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘానికి(నార్ముల్-మదర్ డెయిరీ) జాతీయ డెయిరీ అభివృద్ధి బోర్డు(ఎన్‌డీడీబీ)తో ఒప్పందం కుదిరిందని చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో మదర్ డెయిరీ డైరెక్టర్లతో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో మదర్ డెయిరీ రూ.22 కోట్ల నష్టాలతో వెంటిలేటర్‌పై ఉందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో డెయిరీని గట్టెక్కించేందుకు నూతన పాలకవర్గం ఇబ్బందులకు గురైందన్నారు. దీంతో డెయిరీని కాపాడుకునేందుకు ఎన్‌డీడీబీతో ఒప్పందం కుదిరేలా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య చొరవ తీసుకున్నారని తెలిపారు. ఇకపై పాడి రైతుల కష్టాలు తొలగినట్లేనన్నారు. 15 సంవత్సరాల వరకు డెయిరీ ద్వారా సేకరించిన పాలను ఎన్‌డీడీబీ మార్కెటింగ్ చేస్తుందన్నారు. తొలుత ఎన్‌డీడీబీ రూ.10 కోట్ల నిధులు విడుదల చేస్తుందని, దీంతో పాడిరైతుల పెండింగ్ బిల్లులన్నీ చెల్లిస్తామని తెలిపారు. అలాగే ఎన్‌డీడీబీ ద్వారా ప్రతీ ఏడాది రూ.5 కోట్ల ప్రత్యేక గ్రాంట్ వస్తుందన్నారు. తమ పాలకవర్గంతో పాటుగా ఎన్‌డీడీబీ కమిటీ సమన్వయంతో సంస్థను ముందుకు తీసుకువెళతామని తెలిపారు. డెయిరీ నిర్వహణతో పాటు ఉద్యోగుల వేతనాలు, పాల సేకరణ, రవాణాపై పూర్తి అజమాయిషీ తమదే ఉంటుందని వివరించారు.

చెక్‌డ్యామ్‌ల నాణ్యతపై విచారణ చేయించండి

అవి కూలిపోయేలా కట్టిన కాంట్రాక్టర్లపై కేసు పెట్టండి.. సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ

» 'బీజేపీ సర్పంచ్ అభ్యర్థులను' ఏకగ్రీవంగా ఎన్నుకుంటే.. ప్రతి పంచాయతీకి రూ.10 లక్షల నిధులిస్తానని ప్రకటన

హైదరాబాద్/హుస్నాబాద్/కరీంనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా చెక్ డ్యామ్‌ల నిర్మాణ నాణ్యతపై స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణకు ఆదేశించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్.. సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. నాసిరకంగా చెక్ డ్యామ్‌లు కట్టి, అవి కూలిపోవడానికి కారకులైన కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, నష్టపోయిన ప్రజా ధనాన్ని రాబట్టేందుకు కాంట్రాక్టర్ల ఆస్తులను జప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంజయ్ మంగళవారం సీఎంకు లేఖ రాశారు. "కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో నిర్మించిన చెక్ డ్యామ్‌ల పరిస్థితి దారుణంగా తయారైంది. నాసిరకం నిర్మాణాల వల్ల ఇప్పటికే చాలా చోట్ల నిర్మాణాలు కూలిపోయాయి. తాజాగా కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని తనుగుల-గుంపుల వద్ద నిర్మించిన చెక్ డ్యామ్ ధ్వంసమైంది. 2021 వరదల్లోనూ చాలా వరకు చెక్ డ్యామ్‌లు ధ్వంసమయ్యాయి. చెక్ డ్యామ్‌ల నిర్మాణ పనులపై ప్రజలు సందేహాలు లేవనెత్తుతూ అనేక ఫిర్యాదులు చేశారు. దీంతో చెక్ డ్యామ్‌ల నిర్మాణం, నిధుల చెల్లింపుపై ఈ ఏడాది మే నెలలో మీరే విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో మానేరు నదిపై 57 చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టర్లకు రూ.287 కోట్లు చెల్లించిన దానిపై మీరు విజిలెన్స్ విచారణ చేయిస్తున్నారు. ఆ విచారణ ఏమైందో నేటి వరకు తెలియదు. బీఆర్‌ఎస్ పాలనలో చెక్ డ్యామ్ కాంట్రాక్టులను మీ పార్టీ నాయకులే చేజిక్కించుకున్నారు. చెక్ డ్యామ్‌ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించలేదు. కమీషన్లకు కక్కుర్తి పడి బీఆర్‌ఎస్ పాలకులు చెక్ డ్యామ్‌ల నిర్మాణ పర్యవేక్షణను గాలికొదిలేయడం వల్లే ఈ దుస్థితి ఏర్పడింది" అని సంజయ్ విమర్శించారు.

పంచాయతీకి రూ.10 లక్షలు ఇస్తా..

పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపరచిన సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ఆ పంచాయతీ అభివృద్ధికి ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలు ఇస్తానని బండి సంజయ్ ప్రకటించారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు రూ.5 లక్షల నిధులిస్తానని హామీ ఇచ్చి.. నయాపైసా ఇవ్వలేదని విమర్శించారు. అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఏకగ్రీవం పేరుతో నజరానా ప్రకటించి.. మోసం చేసిందన్నారు.

అన్ని పంచాయతీల్లో పోటీ: బీజేపీ

పంచాయతీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేయాలని బీజేపీ నిర్ణయించింది. ప్రతి పంచాయతీలో వార్డు సభ్యులు, సర్పంచ్ పదవులకు తాము బలపరచిన అభ్యర్థులు పోటీ చేస్తారని పార్టీ ప్రకటించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అధ్యక్షతన మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

రాష్ట్రంలో భూ బకాసురుల రాజ్యం: ఏలేటి

రాష్ట్రంలో భూ బకాసురులు రాజ్యమేలుతున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్(హెచ్ఐఎల్‌టీ) పాలసీయే ఇందుకు నిదర్శనమని ఆరోపించారు. కాంగ్రెస్ పాలకులు ల్యాండ్ లూటీ మాఫియాగా మారారని మండిపడ్డారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. జీవో 27ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అమెరికాలేని జీ20!

జీ20 సదస్సు నిర్వహణ ఎంతో కష్టమని మాతో ఓ మాట ముందే చెప్పవచ్చు కదా... అని భారత ప్రధాని నరేంద్ర మోదీతో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామ్‌ఫోసా అన్నారట. సదస్సు నిర్వహణలో భారత్ సహకారం మరువలేనిదని కూడా ఆయన మోదీతో అన్నారట. రెండేళ్ళక్రితం జీ20 సదస్సును ఘనంగా నిర్వహించిన అనుభవం భారత్‌కు ఉన్నది కనుక, రామ్‌ఫోసా సరదాగా ఈ మాటలు అనివుంటారు. నిజానికి, ఆఫ్రికాఖండంలో జరిగిన ఈ తొలి జీ20 సదస్సు కూడా చక్కగా జరిగింది. దక్షిణాఫ్రికామీద అప్పటికే కక్షకట్టివున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ సదస్సుకు రాకపోవచ్చునన్న అంచనాలు ఎప్పటినుంచో ఉన్నవే. దక్షిణాఫ్రికాలో శ్వేతజాతివారిని నల్లవారు ఊచకోత కోస్తున్నారంటూ ఆర్నెల్లక్రితం శ్వేతసౌధం సమావేశంలో, అంతర్జాతీయ మీడియా సమక్షంలో రామ్‌ఫోసాను ట్రంప్ తీవ్రంగా అవమానించిన ఆ దృశ్యం విస్మరించలేనిది. వందలమంది శ్వేతజాతీయులు హత్యలకు గురైనారంటూ ట్రంప్ మీడియాకు చూపిన ఆ చిత్రాలు సైతం అసత్యాలని అమెరికా పత్రికలే అప్పట్లో విమర్శించాయి. సోషల్ మీడియా ప్రచారాన్ని శ్వేతసౌధం అధికారికం చేస్తున్నదని తప్పుబట్టాయి. ఈ ఆరోపణలను సిరిల్ ఖండిస్తూ, తనది పేదదేశమని, అమెరికా అధ్యక్షుడికి ఖరీదైన విమానాలను బహుమతిగా ఇచ్చుకోలేనంటూ ఓ నర్మగర్భమైన వ్యాఖ్య కూడా చేశారు. ఖతార్ మాదిరిగా బోయింగ్ ఇచ్చి ట్రంప్‌ను ప్రసన్నం చేసుకోగల ఆర్థికస్తోమత తనకు లేదన్న ఆ వ్యాఖ్యలో హాస్యం కంటే అదిమిపట్టిన ఆగ్రహమే అధికం. శ్వేతజాతి పరిరక్షకుడుగా అవతారమెత్తి, దక్షిణాఫ్రికామీద కాలుదూస్తున్న ట్రంప్ ఈ జీ20 సదస్సుకు రాకపోవడం ఒకందుకు మనకూ మంచిదైంది. ట్రంప్‌తో దోస్తీ పూర్తిగా చెడి, ఎడమొఖం పెడమొఖంగా ఉన్న తరుణంలో, ట్రంప్‌కు ఎదురుపడకూడదన్న ఉద్దేశంతో ఇప్పటికే నరేంద్రమోదీ పలు అంతర్జాతీయ సదస్సులను వదులుకున్నారు. ఇలా వరుసబెట్టి ప్రపంచవేదికల మీద కనిపించకుండా పోవడం దేశానికి మంచిదికాదని విపక్షాలు సైతం వ్యాఖ్యానిస్తున్న నేపథ్యంలో, ట్రంప్ గైర్హాజరీతో అందివచ్చిన జీ20 అవకాశాన్ని మోదీ సద్వినియోగం చేసుకున్నారు. దేశాధినేతలతో ఆయన చిరునవ్వులు, కరచాలనాలు, హాస్య సంభాషణలు మన మీడియా విస్తృతంగా ప్రచారం చేసింది. సదస్సుకు సంబంధించిన అన్ని సెషన్స్‌లోనూ మోదీ పాల్గొనడమే కాక, అద్భుతమైన ప్రసంగాలు, అనేక వినూత్న ప్రతిపాదనలు చేశారు.

ప్రధానంగా వాతావరణ మార్పులమీద చర్చించనున్న జొహెన్నెస్‌బర్గ్ సదస్సుకు ట్రంప్ రాకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. డ్రిల్ బేబీ డ్రిల్ అంటూ శిలాజ ఇంధనాలను తవ్విపోసే పనిలో ఆయన ఉన్నాడు. వాతావరణ మార్పు, పర్యావరణ క్షీణత, భూగోళం వేడెక్కడం వంటి మాటలకు చెవొగ్గితే ఈయన వంటి పారిశ్రామికవేత్తలకు మనుగడ ఉండదు కనుక, ఈ తరహా సదస్సులకు ట్రంప్ రారు. ఎజెండా మార్చుకోమని ట్రంప్ ఒత్తిడిచేశారని, అది సాధ్యపడకపోడంతో రావడమే మానుకున్నారని కొందరు అంటారు. శిఖరాగ్ర సదస్సు సంయుక్త ప్రకటన విషయంలోనూ అమెరికా అడ్డుపడినా దక్షిణాఫ్రికా లొంగలేదు. ట్రంప్ కోసం కేటాయించిన కుర్చీ ఖాళీగా కనిపించడం రామ్‌ఫోసాకు బాగా చిరాకు కలిగించినట్టు ఉంది, అధ్యక్షపదవి బదిలీకి సైతం దక్షిణాఫ్రికా నిరాకరించింది. అమెరికా ఈ సదస్సుల్లో పాల్గొనకపోయినా జీ20 కొనసాగుతుందని దక్షిణాఫ్రికా అంతర్జాతీయ వ్యవహారాల మంత్రి చేసిన వ్యాఖ్య వినడానికి బాగుంది. కానీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ మాత్రం జీ20 ప్రమాదపుటంచుల్లో ఉన్నదని హెచ్చరిస్తున్నారు. అమెరికా గైర్హాజరీతో ప్రధాన సంక్షోభాల పరిష్కారానికి సమష్టిపోరాటం కష్టమవుతుందన్న ఆయన అంచనా కొట్టిపారేయలేనిది. వాతావరణ సమస్యలు, అసమానతల పరిష్కారాలు ఇత్యాది కీలకాంశాలమీద జీ20 ఒక్కమాటగా ఉండటం బాగుంది. ఉగ్రవాద చర్యలను ముక్తకంఠంతో ఖండించడం ఎర్రకోట దాడి నేపథ్యంలో భారత్‌కు మంచి ఊరట. మాదకద్రవ్యాలపై పోరాటం వంటి భారత్ ప్రతిపాదిత అనేక అంశాలకు డిక్లరేషన్‌లో స్థానం దక్కింది. కృత్రిమమేధ దుర్వినియోగం మీద దృష్టిపెట్టాలంటూ మోదీ చేసిన హెచ్చరికలు సముచితమైనవి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఇండియాలో జరగబోయే ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు జీ20 దేశాలను ఆహ్వానించడమూ బాగుంది. అనేకానేక అంశాలపై గ్లోబల్ సౌత్ ఘోషను వినిపిస్తున్న ఈ ముప్పై పేజీల ప్రకటన అమెరికా భాగస్వామ్యం లేకుండా ముందుకు తీసుకువెళ్లడం నిజంగా సాధ్యమేనా? అన్నది విలువైన ప్రశ్న, సరైన అనుమానం.

‘భారతి’ ఆరాధకులు కానరారే?!



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

‘నేను ఎవరి కోసం తీయని రాగాల్ని పాడాలి?.. మన కనుల ముందే దేశం ఆకలితో కుమిలిపోతున్నప్పుడు. దేశమంతా విషాన్ని మథిస్తుంటే, ఢిల్లీ మద్యం సేవిస్తోంది. దేశమంతా చీకటి నిండితే ఢిల్లీ మెరిసిపోతోంది..’ అని హిందీ కవి రాంధారీ సింగ్ దినకర్ (1908–74) ఆక్రోశించారు. ఆయన బిహారీ. కాంగ్రెస్‌వాది. జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా దినకర్‌ను మూడుసార్లు రాజ్యసభకు ఎంపిక చేశారు. రాజ్యసభ సభ్యుడుగా ఉన్నప్పుడే ఆయన ఈ కవిత రాశారు. దినకర్ కవితలు ప్రజల వెతలను ప్రభావవంతంగా వ్యక్తం చేశాయి. కనుకనే వాటిని జయప్రకాశ్ నారాయణ్ మాత్రమే కాదు, అటల్ బిహారీ వాజపేయి, నరేంద్ర మోదీ సైతం అమితంగా అభిమానించారు. ఈ బిహారీ కవి కవితల్ని వాజపేయి అనేక సందర్భాల్లో ఉటంకించేవారు. మోదీ సైతం తరచూ ఉటంకిస్తూ దినకర్ పట్ల తన అభిమానాన్ని చాటుతుంటారు. కాంగ్రెస్‌వాది అయిన ఈ కవి తల్లజుని శతజయంత్యుత్సవాలను భారతీయ జనతా పార్టీ ఘనంగా నిర్వహించింది. అధికార పీఠాలు గుర్తించినా, గుర్తించక పోయినా కవులు, రచయితలు తమ మనసు కలచివేసిన వాస్తవాల గురించి రచిస్తూనే ఉంటారు. చాలామంది జర్నలిస్టులు రాయలేని నిజాలు కవులు, రచయితల రచనల్లో తచ్చాడుతుంటాయని అంగీకరించక తప్పదు.

బిహార్‌లో ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో గతంతో పోలిస్తే నేరచరితులు 68 నుంచి 53 శాతానికి తగ్గిపోవడం ఒక శుభపరిణామం. గతంలో బిహార్‌లో సాహితీవేత్తలు, రచయితలు, కవులు క్రియాశీలంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేవారు. తర్వాతి కాలంలో వారి స్థానంలో నేర చరితులు ప్రవేశించారు. రామకృష్ణ బేణిపురి, లక్ష్మీనారాయణ సుధాంశు, ఫణీశ్వర్‌నాథ్ రేణు వంటి రచయితలు 1950వ దశకంలో ఎన్నికల బరిలో నిలిచి పోరాడారు. బేణిపురి, సుధాంశు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలుపాలయ్యారు. ఆ స్ఫూర్తితో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు కూడా. దళితుల హక్కుల పరిరక్షణ, రైతుల ప్రయోజనాల కోసం పోరాడిన ఫణీశ్వర్‌నాథ్ రేణు (1921–77) అరారియా జిల్లాలోని ఫోర్బ్స్‌గంజ్ నియోజకవర్గం నుంచి 1972లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. కబీర్ గీతాల్ని, రామాయణ శ్లోకాల్ని, అమీర్ ఖుస్రో పర్షియన్ కవితల్ని ఉటంకిస్తూ ఆయన ప్రచారం చేశారు. ఎందరో రచయితలు, కళాకారులు ప్రచారం చేసినా ఆయన కేవలం 5వేల ఓట్లు మాత్రమే తెచ్చుకున్నారు. ‘తీస్రీ కసమ్’ లాంటి కళాత్మక సినిమాలకు ప్రేరణనిచ్చిన రేణు ఎన్నికల ఓటమి తర్వాత ‘కాగజ్ కీ నావ్’ (కాగితపు పడవ) అనే నవల రచించారు. అప్పటికి దేశంలో ఎన్నికల వాతావరణం సంపన్నులకు, నేర చరితులకు అనుకూలంగా మారిపోయింది. ఆ తర్వాతి కాలంలో దేశంలో రచయితలు, కళాకారులకూ– రాజకీయ వ్యవస్థకూ దూరం రోజురోజుకూ పెరిగిపోయింది. రేణు సృజించిన సాహిత్యంలోని స్ఫూర్తిదాయక మాటలను మోదీ, నితీశ్‌కుమార్ మొదలైన నేతలు తరచూ ఉటంకిస్తూ ఉంటారు.

బిహార్‌లోని మధుబని ప్రాంతానికి చెందిన 25 ఏళ్ల గాయని మైథిలీ ఠాకూర్– మైథిలీ, భోజ్‌పురి, హిందీ భాషల్లో స్వంత గీతాలతో పాటు భక్తి గీతాలూ ఆలపిస్తుంటారు. గాయనిగా సామాజిక మాధ్యమాలలో ఆమె బహుళ ప్రచారం పొందారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో అలీనగర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. ఆమె విజయం.. ఉక్కబోస్తున్న వాతావరణంలో ఒక మలయానిలం వీయడం లాంటిదే. మైథిలిని తమ అభ్యర్థిగా బీజేపీ నిలబెట్టడం ఆ పార్టీ ఆలోచనా విధానానికి యుక్తమైన నిర్ణయమే. అయితే దేశంలో తమ పార్టీ భావజాలంతో సంబంధం లేకపోయినా ప్రముఖ రచయితలను, కళాకారులను చట్టసభలకు, ముఖ్యంగా పార్లమెంటు ఎగువసభ అయిన రాజ్యసభకు ఎంపిక చేయడమనే ఒక మంచి సంప్రదాయాన్ని జాతీయ స్థాయిలో కొనసాగించిన నేతలు ఉన్నారు. నెహ్రూ నుంచి వాజపేయి దాకా ఈ సంప్రదాయాన్ని పాటించారు. నెహ్రూ తరచూ రచయితలను తీన్‌మూర్తి భవన్‌కు పిలిచి మాట్లాడడమే కాక గేటు వరకూ వచ్చి వారికి వీడ్కోలు చెప్పేవారు. మైథిలీ శరణ్ గుప్తా, కెఎం.పణిక్కర్, తారాశంకర్ బందోపాధ్యాయ, హరివంశరాయ్ బచ్చన్, జి.శంకర్ కురూప్, ఉమాశంకర్ జోషి, అబూ అబ్రహం, హబీబ్ తన్వీర్, భగవతి చరణ్ వర్మ, కుష్వంత్ సింగ్, అమృతా ప్రీతమ్, ఆర్‌కె.నారాయణ్, కర్తార్‌సింగ్ దుగ్గల్, సి.నారాయణరెడ్డి, విద్యానివాస్ మిశ్రా, జావేద్ అఖ్తర్ తదితరులు రాజ్యసభకు నామినేట్ అయిన వారే. సినారెను రాజ్యసభకు నామినేట్ చేసిన సాహిత్య సహృదయుడు వాజపేయి. సినారెను చూడగానే వాజపేయి కవిత్వ పిపాసి అయిపోయేవారు. ఇరువురూ పార్లమెంటు నడవాల్లో ఉర్దూ కవితలను గుర్తు చేసుకుంటూ నడిచేవారు. తర్వాతి కాలంలో పెద్దల సభకు కవులు, రచయితలను ఎంపికచేయడం క్రమంగా తగ్గిపోయింది. ఒకవేళ ఒకరిద్దరిని ఎంపికచేసినా నాటి ప్రమాణాలు వారిలో కనపడడం తక్కువే. ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు?

> రచయితలు, కళాకారులను వారి భావజాలంతో నిమిత్తం లేకుండా గౌరవించి అక్కున చేర్చుకున్న ప్రభుత్వాలే చరిత్ర పుటల్లో నిలిచిపోతాయి. రాజరాజనరేంద్రుడు, మనుమసిద్ధి, శ్రీకృష్ణ దేవరాయలు మనకు ఇంకా ఎందుకు గుర్తున్నారు?

నిజానికి యూరోపియన్ ప్రమాణాలతో పోలిస్తే మన దేశంలో రచయితలను, కళాకారులను గౌరవించిన సందర్భాలు చాలా తక్కువే. ఇటీవల ఐర్లాండ్‌ను సందర్శించినప్పుడు అక్కడ రహదారుల కూడళ్లలోనూ, మార్కెట్ ప్రాంతాల్లోనూ, పార్కుల్లోనూ ఎక్కడ చూసినా రచయితల, కళాకారుల విగ్రహాలే కనపడ్డాయి. డబ్లిన్ నడిబొడ్డున మ్యూజియమ్ ఆఫ్ లిటరేచర్‌లో ఐరిష్ రచయితలు, వారి రచనలను ప్రదర్శించిన తీరు ఎవరికైనా అచ్చెరువు కలిగిస్తుంది. విఖ్యాత నవలా రచయిత జేమ్స్ జాయిస్ (1882–1941) రచనలు మనను చుట్టుముడతాయి. మహాకవి విలియం బట్లర్ యేట్స్ (1865–1939) పేరిట నిర్మించిన మ్యూజియంలో ఆయనకు సంబంధించిన వస్తువులు, రచనలు, పుస్తకాలను ప్రదర్శించడమే కాక, అడుగడుగునా ఆయన కవితల మధ్య మనం నడుస్తున్నట్లు వాతావరణాన్ని, దృశ్యాల్ని కల్పించారు. గాల్వేలో ప్రముఖ రచయిత ఆస్కార్ వైల్డ్ (1854–1900) ఆయన సోదరుడు, కవి విలియమ్ వైల్డ్ విగ్రహాలు కూర్చుని సంభాషిస్తున్నట్లుంటాయి. యేట్స్‌తో పాటు ఎందరో కవులు, రచయితలు ఐరిష్ పార్లమెంట్‌లో సభ్యులు అయ్యారు. ఐర్లాండ్ సాంస్కృతిక పునరుజ్జీవనంలో కీలకపాత్ర పోషించిన రచయిత డగ్లస్ హైడ్ ఐర్లాండ్ తొలి అధ్యక్షుడయ్యారు. భారతదేశ స్వాతంత్ర్యోద్యమానికి అనీబిసెంట్ లాంటి నేతలను అందించడమే కాదు, మాలపల్లి రచించిన ఉన్నవ లక్ష్మీనారాయణ, రాష్ట్రపతి వీవీ గిరి లాంటి వారికి ఎంతో ప్రేరణ కలిగించిన దేశం ఐర్లండ్. అంతే కాదు, బ్రిటిష్ వారి పాలనలో మనుగడ కోల్పోయిన ఐరిష్ భాషను మళ్లీ పునరుజ్జీవింపచేసిన ఐర్లండ్, భాషా సంస్కృతుల పరిరక్షణ విషయంలో మనకు ప్రేరణగా నిలుస్తుందని డబ్లిన్‌లో మన రాయబారి అఖిలేశ్ మిశ్రా చెప్పారు. నదులు, సంస్కృతులను కాపాడుకునే విషయంలో మనం యూరప్ నుంచి నేర్చుకోవాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయి.



మన దేశంలో ఎల్లెడలా రాజకీయ నాయకుల విగ్రహాలే కనిపిస్తాయి. మన ప్రసిద్ధ రచయితలు, కవుల స్మృతులను మనం భద్రపరచగలిగామా? కనీసం ప్రేమ్‌చంద్, గురజాడ, నిరాలా వంటి కవులు, రచయితల ప్రాధాన్యం గురించి ఈ తరం వారికి చెప్పగలుగుతున్నామా? కాళిదాసు కాలం నుంచీ సుసంపన్నమైన మన సాహిత్య కళాసంస్కృతి యూరోపియన్ సాహిత్య, కళాసంస్కృతి కంటే ఎంతో ప్రాచీనమైనదని వారికెలా తెలుస్తుంది? ఇటీవల ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ‘గుర్జాల హాలు’లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర మంత్రి ఆహ్వానం పంపారు. అది ‘గుర్జాల హాలు’ కాదని, ‘దేశమును ప్రేమించుమన్నా’ అన్న గీతాన్ని రచించిన ప్రముఖ కవి గురజాడ అప్పారావు పేరును ఆ హాలుకు నందమూరి తారకరామారావు పెట్టారని ఎవరు చెప్పాలి?

‘రాజు జీవించు రాతి విగ్రహములందు, సుకవి జీవించు ప్రజల నాలుకల యందు..’ అని గుర్రం జాషువా; ‘నీ కవిని బతికించుకోవాలిరా, నీవు మనిషి వనిపించుకోవాలిరా’ అని తెన్నేటి సూరి; ‘గాయపడిన కవి గుండెల్లో రాయబడని కావ్యాలెన్నో..’ అని దాశరథి లాంటి కవులు ఉన్న మన నేలపై రాజకీయ నేతల, సంపన్నుల, అధికారుల, దళారుల దుష్ట సంస్కృతి సాహిత్య, కళా వాతావరణంపై చీకటి నీడలా పరుచుకుంది. అయినప్పటికీ కొన్ని పరిణామాలు ఎంతో ఊరట కలిగిస్తాయి. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు సునీల్ గంగోపాధ్యాయ మరణించినప్పుడు ఆయన అంతిమ యాత్రకు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా సారథ్యం వహించారు. ఉత్కళ సాహితీవేత్తలు రమాకాంత్‌రథ్, మనోజ్‌దాస్‌లకు ఒడిషా ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించింది.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ప్రజాకళాకారుడు అందెశ్రీ పార్థివ దేహాన్ని మోసి ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అందెశ్రీ ప్రతిధ్వనించిన ‘మాయమైపోతున్నడమ్మా’ అన్న ఒక్క గీతం చాలు ఆయన స్మృతిని గుండెలో పదిలం చేసుకునేందుకు. ధిక్కార స్వరాన్ని వినిపించిన బమ్మెర పోతన నుంచి కాళోజీ దాకా తెలంగాణ జన జీవన సంస్కృతిలో రచయితలు, కళాకారులు పోషించిన పాత్రను తక్కువ అంచనా వేయలేము. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా నన్నయ్య నుంచి శ్రీశ్రీ దాకా తెలుగు సంస్కృతిని సమున్నతం చేసిన వారిని మరిచిపోగలమా?

కవులు, రచయితలను గౌరవించడంలో తమిళనాడు అగ్రగామిగా, ఆదర్శప్రాయంగా ఉన్నదని చెప్పక తప్పదు. పార్లమెంటులో రవికుమార్, కనిమొళి, సల్మా, సుమతి, జ్యోతిమణి, వెంకటేశన్ వంటి తమిళ రచయితలు ఎందరో మనకు తటస్థపడతారు. జర్మనీలోని ‘ఫ్రాంక్‌ఫర్ట్ ప్రపంచ పుస్తక ప్రదర్శన’లో తమ స్వంత స్టాల్‌ను నిర్వహించేది తమిళనాడు ప్రభుత్వం ఒక్కటే. రచయితల పుస్తకాలు ప్రచురించి, తామే కొనుగోలు చేసి, రాయల్టీలు ఇవ్వడమే కాదు, కేంద్ర సాహిత్య అకాడమీ విజేతలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత తమిళనాడు సర్కార్‌కే దక్కుతుంది. కర్ణాటకలో కూడా రచయితలు, కళాకారులను గౌరవించేందుకు పింఛన్లతో పాటు ఎన్నో చర్యలు చేపట్టారు. రచయితలు, కళాకారులను వారి భావజాలంతో నిమిత్తం లేకుండా గౌరవించి అక్కున చేర్చుకున్న ప్రభుత్వాలే చరిత్ర పుటల్లో నిలిచిపోతాయి. రాజరాజనరేంద్రుడు, మనుమసిద్ధి, శ్రీకృష్ణ దేవరాయలు మనకు ఇంకా ఎందుకు గుర్తున్నారు?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

> మదీన పుణ్యక్షేత్రంలోని జన్నతుల్ బఖీ అనే స్మశానవాటికలో ఖననం చేయాలని విశ్వాసులు ప్రగాఢంగా అభిలషించడం కద్దు. సాధారణంగా ఇక్కడ ఖననానికి అనుమతులు ఇవ్వరు. అయితే మన అధికారుల కృషి ఫలితంగా హైదరాబాద్ మృతులందరికీ జన్నతుల్ బఖీలో అంతిమక్రియలు నిర్వహించేందుకు సౌదీ అధికారులు అనుమతించారు.

మదీనా మృతులకు గౌరవ వీడ్కోలు

గల్ఫ్ లేఖ

ప్రమాదవశాత్తు జరిగే దుర్ఘటనల్లో ప్రాణాలు ఎవరు కోల్పోయినా బాధకరమే. ఆ ప్రమాద ఘటన వారి స్వస్థలానికి దూరంగా అదునా విదేశీగడ్డపై సంభవించడం మరింత దుఃఖదాయకం. ఇటీవల హైదరాబాద్ నుంచి ఉమ్రా (ఇస్లామిక్ తీర్థయాత్ర)కు సౌదీ అరేబియాకు వెళ్లిన (చిన్నారులు, మహిళలతో సహా) 45 మంది తీర్థ యాత్రికులు ఒక రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ దుర్ఘటన పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శీఘ్రగతిన స్పందించిన తీరు అభినందనీయం. ప్రభుత్వాల ప్రత్యేక శ్రద్ధతో అధికారిక లాంఛనాలు అన్నీ సత్వరమే పూర్తయి, మృతులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో మదీన పుణ్యక్షేత్రంలో అంతిమక్రియలు నిర్వహించారు. ప్రమాదం చోటుచేసుకున్న వెన్వెంటనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి మృతులకు అయిదు లక్షల రూపాయల నష్టపరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు చెందిన వారిని డి.యన్.ఎ పరీక్షల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతో సౌదీ అరేబియాకు పంపించారు. రేవంత్ మంత్రివర్గంలో కొత్తగా చేరిన మోహమ్మద్ అజ్హరోద్దీన్ సారథ్యంలో ఒక అధికారిక బృందం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పక్షాన సౌదీ అరేబియాకు వచ్చింది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ అత్యున్నత స్థాయి బృందం ఒకటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ అధ్వర్యంలో సౌదీ అరేబియాకు వచ్చి సౌదీ అధికారిక వర్గాలతో సమావేశమై మృతదేహాల అప్పగింత విషయమై చర్చించింది. భారతీయ రాయబారితో సహా సమస్త దౌత్యవేత్తలు మదీన పుణ్యక్షేత్రంలో మకాం వేసి మృతదేహాల అప్పగింత, అంతిమక్రియల ఏర్పాట్లను సమన్వయం చేసారు. మదీన పుణ్యక్షేత్రంలోని జన్నతుల్ బఖీ అనే స్మశానవాటికకు ఇస్లాంలో ప్రాముఖ్యత ఉంది. తమను ఈ స్మశానవాటికలో ఖననం చేయాలని విశ్వాసులు ప్రగాఢంగా అభిలషించడం కద్దు. సాధారణంగా ఇక్కడ ఖననానికి అనుమతులు ఇవ్వరు. అయితే భారతీయ అధికారుల కృషి ఫలితంగా హైదరాబాద్ మృతులందరికీ



జన్నతుల్ బఖీలో అంతిమక్రియలు నిర్వహించేందుకు సౌదీ అధికారులు అనుమతించారు. ఇదీ ఒక గొప్ప విషయమే, సందేహం లేదు.

తీర్థ యాత్రలలో మరణించిన వారికి రూ.5 లక్షల నష్ట పరిహారం చెల్లించింది. ముస్లింలైనా, ఇతర మతస్తులైనా తీర్థ లేదా విహార యాత్రలకు వెళ్లేవారు సాధారణంగా మధ్య తరగతి లేదా ఉన్నత వర్గానికి చెందిన వారై ఉంటారు. పైగా సౌదీ అరేబియాలో తాజాగా అమలులో ఉన్న నిబంధన ప్రకారం, భారత్‌తో సహా విదేశాల నుంచి వచ్చే ఉమ్రా యాత్రికులకు బీమా తప్పనిసరి. బీమా పాలసీ లేకుండా వీసా ఎండార్స్ చేయరు. ప్రమాదవశాత్తు మరణించిన ఉమ్రా యాత్రికులకు ఒక్కొక్కరికి ఒక లక్ష రియాళ్ళు అంటే సుమారు రూ. 23.77 లక్షలు చొప్పున లభిస్తాయి. అయినా, రాష్ట్రప్రభుత్వం కూడా నష్టపరిహారం ప్రకటించడంపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి.

హైద్రాబాద్ నగరంలో కాంగ్రెస్ ప్రాబల్యాన్ని పెంపొందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఇందుకు, నగరంలోని కొన్ని ప్రాంతాలలో బలీయమైన శక్తిగా ఉన్న మజ్లీస్ పార్టీ మద్దతు అవశ్యకత ఉందనే విషయం ఇటీవల జరిగిన జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలలో అవగతమైంది. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా వ్యూహాత్మక బంధాన్ని బలోపేతం చేసుకోవడమనేది అటు కాంగ్రెస్‌కు, ఇటు మజ్లిస్‌కు ఒక రాజకీయ అనివార్యత. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మదీన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక చర్యలను కొందరు ఈ కోణంనుంచే చూస్తున్నారు. ఒక అధికారిక బృందంలో మజ్లీస్ పార్టీ శాసనసభ్యుడిని రాష్ట్ర ప్రభుత్వం సౌదీ అరేబియాకు పంపించింది. అతడు దాన్ని పూర్తిగా ఓవైసీ ఖాతాలో వేస్తూ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం సహాయంతో చేసిన సహాయక చర్యలన్నీ కూడా మజ్లిస్ తన ఖాతాలోకి జమ చేసుకోగా కాంగ్రెస్ నిస్సహాయంగా చూస్తుండిపోయింది. ఈ రకమైన బుజ్జగింపు చర్యల వల్లే, అధికారంలో ఉన్న పార్టీ ఏదైనా సరే హైద్రాబాద్ నగరంలో స్థానికంగా బలోపేతం కాలేకపోతోంది. అందుకు కాంగ్రెస్ సైతం మినహాయింపు కాదు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

జాతి ఆత్మ మన రాజ్యాంగం

భారత రాజ్యాంగం మన దేశపు ఆత్మ, అది మన ప్రజాస్వామ్యం ఇచ్చిన అమూల్యమైన వారసత్వం. రాజ్యాంగం కేవలం పరిపాలనా నియమాల పుస్తకం కాదు; అది న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి విలువలకు మార్గదర్శక దీపస్తంభం. అనేక భాషలు, మతాలు, సంస్కృతులు, వర్గాలతో కూడిన మన దేశాన్ని ఒక గూటిగా నిలిపేందుకు రాజ్యాంగమే అసలైన బలసారం. వందలాది అధికరణలు, భాగాలు, షెడ్యూళ్లు, సవరణలతో కూడిన ఈ పత్రం రూపుదిద్దుకోవడానికి రాజ్యాంగ సభ నిరంతరం శ్రమించింది. రాజ్యాంగ రూపకల్పనలో కనిపించిన ఆలోచనల వైవిధ్యం, సఖ్యత, చర్చ–సమ్మతి సంస్కృతి మన ప్రజాస్వామ్య పరిపక్వతకు చిరస్మరణీయ నిదర్శనం.



రాజ్యాంగం ప్రతి పౌరునికి హక్కులను అందించడమే కాదు, బాధ్యతలను కూడా స్పష్టంగా నిర్ధారించింది. హక్కుల పట్ల ఎంత అప్రమత్తంగా ఉంటామో, అలాగే కర్తవ్యాల పట్ల జాగ్రత్తగా, నిబద్ధతతో ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. స్వాతంత్ర్య సమర స్ఫూర్తితో దేశ నిర్మాణానికి బాటలు వేసిన డా. రాజేంద్ర ప్రసాద్, బాబాసాహెబ్ డా. భీమ్‌రావ్ అంబేడ్కర్ వంటి మహానుభావుల త్యాగం, దూరదృష్టి వల్లే సమాన అవకాశాల సమాజం దిశగా మన ప్రస్థానం ప్రారంభమైంది.

అయితే ఈ మహత్తర రాజ్యాంగాన్ని కాలక్రమేణా అనేక సంఘటనలు అవహేళన చేశాయి. అత్యవసర స్థితి (ఎమర్జెన్సీ) విధించడం భారత ప్రజాస్వామ్య చరిత్రలో అతి చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. ప్రాథమిక హక్కులను తొక్కిపెట్టి, భిన్నాభిప్రాయాలకు సంకెళ్ళు వేసే పాలన ఆ కాలంలో నెలకొంది. కానీ ఎమర్జెన్సీ అనంతరం ప్రజలు తమ తీర్పుతో ఆ నిరంకుశ ధోరణికి చెక్ పెట్టారు. ఇది భారత రాజ్యాంగ బలాన్ని మరోసారి ప్రపంచానికి చాటింది. తరువాత 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఇలాంటి దుర్వినియోగాలకు అడ్డుకట్ట వేయడానికి మార్పులు జరిగాయి. రాజ్యాంగానికి స్వయంగా తనను తాను సరిదిద్దుకునే శక్తిని ఉన్నదని ఇది నిరూపిస్తుంది. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాజ్యాంగ గౌరవం, ప్రాముఖ్యతకు కొత్త ఊపిరి లభించింది. న్యాయవ్యవస్థ స్వతంత్రతను బలోపేతం చేయడానికి తీసుకున్న చర్యలు, రాజ్యాంగ దినోత్సవాన్ని జాతీయ స్థాయిలో జరుపుకోవడం వంటి ప్రయత్నాలు రాజ్యాంగ విలువలను ప్రజల దైనందిన జీవితంతో మరింత దగ్గర చేశాయి. ఆర్థిక రంగంలో కేంద్ర–రాజ్యాల సమన్వయాన్ని బలోపేతం చేసే జీఎస్టీ వంటి సంస్కరణలు కూడా రాజ్యాంగ స్ఫూర్తితోనే అమలైనవి.

జమ్మూ కశ్మీర్‌పై అమలులో ఉన్న ఆర్టికల్ 370 రద్దు చేయడాన్ని మరో మైలురాయిగా చూడవచ్చు. తాత్కాలిక ప్రత్యేక హోదాగా ప్రవేశపెట్టిన ఆ అధికరణం కాలక్రమంలో రాష్ట్ర సమగ్ర సంలీనానికి అడ్డంకిగా మారింది. దీన్ని తొలగించడం ద్వారా జమ్మూ కశ్మీర్ ప్రజలకు ఇతర రాష్ట్రాల పౌరుల్లానే సమాన హక్కులు, సమాన అభివృద్ధి అవకాశాలు కల్పించడం రాజ్యాంగ న్యాయాన్ని, సమానత్వ ఆత్మను బలపరిచిన నిర్ణయం. తరువాత సుప్రీంకోర్టు ఈ చర్యను రాజ్యాంగబద్ధమని నిర్ధారణ చేసింది.

రాజ్యాంగం ఒక స్థిర పత్రం మాత్రమే కాదు, కాలానుగుణంగా మార్పులు, సవరణల ద్వారా సజీవంగా ఉండే జీవ గ్రంథం. సామాజిక–రాజకీయ అవసరాలు మారుతున్న కొద్దీ అనేక సవరణలు చేయబడతాయి. అయితే ఏ మార్పు చేసినా ప్రాథమిక నిర్మాణం (Basic Structure) దెబ్బతినకూడదనే భావన న్యాయవ్యవస్థ గీసిన మార్గదర్శక సూత్రం. ప్రజాస్వామ్య స్వరూపం, న్యాయపాలన, మౌలిక హక్కులు వంటి విలువలను కాపాడే ఈ సూత్రం రాజ్యాంగ స్థిరత్వానికి భరోసా ఇస్తోంది.

ఈ నేపథ్యంతో ప్రతీ ఏడాది రాజ్యాంగ దినోత్సవాన్ని కేవలం ఫార్మాలిటీగా కాకుండా, ఒక ప్రతిజ్ఞగా భావించాలని మనస్ఫూర్తిగా కోరాలి. హక్కులు మాత్రమే కాదు, కర్తవ్యాలను కూడా గౌరవించాలి. సామాజిక న్యాయం, సమానత్వం, జాతీయ ఏకత్వం దిశగా ప్రతీ రోజు ఒక్కో అడుగు వేస్తూ ఉంటేనే రాజ్యాంగ స్ఫూర్తి నిజంగా నిలుస్తుంది. పుస్తకాలలో పరిమితమై ఉన్న పత్రంగా కాకుండా, మన వ్యవహారాల్లో, పాలనలో, ప్రజా జీవితాల్లో ప్రతిబింబించే జీవ శక్తిగా రాజ్యాంగాన్ని మనం చూడాలి.

రాజ్యాంగ రక్షణ మన చేతుల్లోనే ఉంది. ఈ పత్రాన్ని దేశ స్వరూపానికి ప్రతీకగా, మన ఉమ్మడి బాధ్యతకు చిహ్నంగా, ప్రజాస్వామ్య గర్వానికి నిదర్శనంగా భావించి, భవిష్యత్ తరాలకు మరింత బలమైన, న్యాయసమాజాన్ని అందించే దిశగా మనందరం కట్టుబడి పనిచేయాలి.

● డా. కె.లక్ష్మణ్
రాజ్యసభ సభ్యులు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు
(నేడు రాజ్యాంగ దినోత్సవం)

పెచ్చరిల్లుతున్న ఫేక్ న్యూస్

సోషల్ మీడియా వచ్చాక న్యూస్, సమాచారం క్షణాల్లో యూజర్‌కు చేరిపోతోంది. సోషల్ మీడియా ద్వారా వార్తల వినియోగం పెరిగింది. ఇదే అదనుగా యూట్యూబ్ చానెళ్లు, వెబ్ పోర్టళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి.

వ్యూస్, డబ్బు కోసం యూట్యూబ్ చానెళ్లు పెడుతున్నవారి సంఖ్య పెరిగిపోతోంది. ఫేక్ న్యూస్, అశ్లీలత కంటెంట్‌తో వీడియోలు రూపొందిస్తున్నారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తూ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారు. దీనిపై ఎలాంటి నియంత్రణ, కంప్లైంట్ వ్యవస్థ లేకపోవడంతో వీరు చెలరేగిపోతున్నారు. క్రింజ్ వీడియోలు చేసే వారితో ఇంటర్వ్యూలు చేయడమేకాదు, ఆయా వీడియోల్లో అశ్లీలత, సమాజంలోని కొందరిపై విద్వేషం పెంచేలా వీడియోలు రూపొందించడం సర్వసాధారణమైపోయింది.



ఫేక్ న్యూస్ ఘటనలు కోకొల్లలు. ఈ మధ్య టాటా బైక్ విడుదలైనట్లు ఫొటోలు వైరల్ అయ్యాయి. అలాగే, ఓ పులి మనిషిని లాక్కుపోతున్న వీడియో కూడా. ఇదంతా ఫేక్ న్యూసే. పైరసీ పోర్టల్‌లో వచ్చే సినిమాలపై ఓ వెబ్ పోర్టల్ అప్డేట్స్ ఇస్తూ దానిని ప్రమోట్ చేస్తున్నది. ‘రూ. 56వేలు తగ్గిన బంగారం ధర!’ వంటి తప్పుడు వార్తల క్లిప్, బైట్ హెడ్‌లైన్స్ పెడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది. ‘మీ దగ్గర పాత నోట్లు ఉంటే రూ.30–40 లక్షలు సంపాదించవచ్చు’ అంటూ ఓ వెబ్ పోర్టల్ అదే పనిగా వార్తలను పబ్లిష్ చేసింది. వైరల్ వీడియోలను నమ్ముకుని, అది ఎంతవరకు నిజమనేది రూఢీ చేసుకోకుండానే కొన్ని వెబ్‌పోర్టళ్లు వాటిని ప్రచారం చేస్తున్నాయి. వెబ్ పోర్టళ్లు, యూట్యూబ్ చానెళ్లలో వచ్చే వార్తల్లో నిజమెంత? అని ఫ్యాక్ట్ చెక్ చేసుకునే అవకాశం సాధారణ ప్రజలకు లేదు. ఆ వార్తలు నిజమే అని నమ్మేవారి సంఖ్యే ఎక్కువ. ఫేక్ న్యూస్ వల్ల సమాజంలో గందరగోళం, ద్వేషం, అపనమ్మకం పెరుగుతున్నాయి. ఈ ప్రభావం ప్రధాన మీడియాపై పడడం ప్రజాస్వామ్యంలో అత్యంత ప్రమాదకర పరిణామం. మీడియా మీద నమ్మకం కోల్పోతే, ప్రజల్లో నిజాన్ని అర్థం చేసుకునే సామర్థ్యం తగ్గిపోతుంది. భారత రాజ్యాంగంలోని 19(1)(a) అధికరణ ప్రకారం ‘వ్యక్తి స్వేచ్ఛగా తన అభిప్రాయాన్ని వ్యక్తపరచవచ్చు.’ కానీ తప్పుదారి పట్టించే సమాచారానికి అదే కవచం కాకూడదు. ఐటీ చట్టం 69A, 79వ సెక్షన్లు ఫేక్ న్యూస్, మిస్ లీడింగ్ కంటెంట్‌పై చర్యలు తీసుకునే అధికారం ఇస్తున్నప్పటికీ వాటి అమలు, ఫిర్యాదు వ్యవస్థలు అందుబాటులో లేవు. సోషల్ మీడియా వినియోగం పెరుగుతున్న ఈ తరుణంలో ప్రజలను తప్పుదోవ పట్టించే యూట్యూబ్ చానెళ్లు, వెబ్ పోర్టళ్లపై మానిటరింగ్ వ్యవస్థ రావాలి. ఫేక్ న్యూస్ వ్యాప్తి చేసే వారిపై సులభంగా కంప్లైంట్ చేసేలా ఓ వ్యవస్థను రూపొందించాలి. అలాంటి వారిని కఠినంగా శిక్షించాలి.


సమాచారం శక్తిమంతమైనది. కానీ తప్పుడు సమాచారం విధ్వంసం సృష్టిస్తుంది. ప్రజలు నమ్మకంగా ఉండాలంటే, సోషల్ మీడియా బాధ్యతాయుతంగా ఉండాలి. వ్యూస్ కోసం ఫేక్ న్యూస్ ప్రసారం చేసే ఈ డిజిటల్ చానెళ్లను అరికట్టాలంటే ప్రభుత్వం, మీడియా, ప్రజలు ముగ్గురూ కలసి నడవాల్సిందే. నిజాలు తెలుసుకోవడం ప్రజల హక్కు. ఫేక్ న్యూస్ వల్ల వారు ఆ హక్కును కోల్పోకూడదు.

○ వంగరి రవిరాజు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

ఈసారి ఏకగ్రీవాలు ఏ మేరకు ఉండేనో ? 7

- అందని రూ. 10 లక్షల ప్రోత్సాహక నిధులు
- మొండిచేయి చూపిన గత ప్రభుత్వం
- ఎంపీలు, ఎమ్మెల్యే నుంచి రాని మరో రూ.10 లక్షలు
- నిరాశకు లోనైన గత పంచాయతీ పాలక వర్గాలు





'పంచాయతీ' షురూ..

హనుమకొండ, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. మంగళవారం ఎన్నికల షెడ్యూల్ జారీ అయింది. మూడు విడతలుగా డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల షెడ్యూల్ జారీతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎన్నికల కోడ్ కూడా అమలులోకి వచ్చింది. ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగాలు సమాయత్తం అయ్యాయి. ఎన్నికల ఏర్పాట్లు ఇదివరకే పూర్తి చేశాయి. ఓటర్ల జాబితాలను ప్రకటించాయి. పోలింగ్ కేంద్రాలను గుర్తించాయి. ఎన్నికల సిబ్బందిని సైతం నియమించాయి. ఎన్నికల పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్ల నియామకం కూడా ఇదివరకే జరిగింది. చాలినన్ని బ్యాలెట్ బాక్సులను కూడా సిద్ధం చేసి పెట్టుకున్నారు. పోలింగ్ సామగ్రిని సైతం అందుబాటులో ఉంచుకున్నారు.

మూడు విడతలుగా..

జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతలుగా జరుగుతాయి. మొత్తం 210 జీపీలు, 1,986 వార్డుల్లో ఈ ఎన్నికలు జరుగుతాయి. ఇందుకోసం 1,986 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి విడత ఎన్నికలు డిసెంబర్ 11న, రెండో విడత ఎన్నికలు డిసెంబర్ 14న, మూడో విడత ఎన్నికలు డిసెంబర్ 17న జరుగుతాయి.

- మొదటి విడత ఎన్నికలు భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో జరుగుతాయి. ఈ మండలాల పరిధిలోని 69 జీపీలు, 658 వార్డుల్లో ఎన్నికలు జరుగుతాయి. ఇందుకోసం 658 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. భీమదేవరపల్లి మండలంలోని 25 గ్రామ పంచాయతీలు, 232 వార్డుల్లో జరుగుతాయి. పోలింగ్ నిర్వహణకు 232 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎల్కతుర్తి మండలంలోని 20 జీపీల్లో 180 వార్డులో (మిగతా 8లో..)

జారీ అయిన గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్



- విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్
- జిల్లాలో మూడు విడతలుగా పోలింగ్
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- ఇక పల్లెల్లో వేడెక్కనున్న రాజకీయం

ఎన్నికల ప్రక్రియ	మొదటిదశ	రెండో దశ	మూడో దశ
ఓటర్ల జాబితా ప్రకటన	27-11-2025	30-11-2025	03-12-2025
నామినేషన్ల దాఖలు గడువు	29-11-2025 (సా:5గం.వరకు)	02-12-2025 (సా.5గం.వరకు)	05-12-2025 (సా:5గం.వరకు)
నామినేషన్ల పరిశీలన	30-11-2025 (సా:5గం.వరకు)	03-12-2025 (సా.5గం.వరకు)	06-12-2025 (సా:5గం.వరకు)
చెల్లిన నామినేషన్ల ప్రదర్శన	30-11-2025 (సా:5గం.తర్వాత)	03-12-2025 (సా.5గం.తర్వాత)	06-12-2025 (సా:5గం.తర్వాత)
అప్పీలుకు చివరి తేదీ	01-12-2025 (సా: 5గం.వరకు)	04-12-2025 (సా.5గం.వరకు)	07-12-2025 (సా:5గం.వరకు)
పరిష్కారం చివరి తేదీ	02-12-2025 (సా:5గం.లోపు)	05-12-2025 (సా.5గం.లోపు)	08-12-2025 (సా:5గం.లోపు)
ఉపసంహరణలకు చివరి తేదీ	03-12-2025 (మ:3గం. లోపు)	06-12-2025 (మ.3గం. లోపు)	09-12-2025 (మ:3గం. లోపు)
పోటీలోని అభ్యర్థుల జాబితా ప్రచురణ	03-12-2025 (మ:3గం. తర్వాత)	06-12-2025 (మ.3గం.తర్వాత)	09-12-2025 (మ:3గం. తర్వాత)
పోలింగ్ తేదీ	11-12-2025 (ఉ.7గం.నుంచి మ.1గం.)	14-12-2025 (ఉ.7గం.నుంచి మ.1గం.)	17-12-2025 (ఉ.7గం.నుంచి మ.1గం.)
ఓట్ల లెక్కింపు	11-12-2025 (మ.2గం.తర్వాత)	14-12-2025 (మ.2గం.తర్వాత)	17-12-2025 (మ.2గం.తర్వాత)

ఫలితాల ప్రకటన: ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాల ప్రకటన

ఫలితాల ప్రకటన రోజే ఉప సర్పంచ్ ఎన్నిక జరుగుతుంది. ఒక వేళ ఏదైనా కారణం వల్ల జరగకపోతే ఆ మరుసటి రోజు నిర్వహిస్తారు.

అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్

పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ జారీతో మంగళవారం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. జిల్లాలోని అర్బన్ మండలాలు హనుమకొండ, కాజీపేట మండలాలు మినహా మిగతా 12 రూరల్ మండలాల్లో ఈకోడ్ అమలులో ఉంటుంది. ఎన్నికలను పురస్కరించుకొని వివిధ విధుల నిర్వహణకునోడల్ అధికారులను నియమించారు. శాంతి భద్రతలు, ఎంసీసీసీ ఖర్చులు, మానవ వక్తి, బ్యాలెట్ పెట్టెలు, ఎన్నికల రవాణా, ఎన్నికల శిక్షణ, ఎన్నిక సామగ్రి, ఖర్చుల నిర్వహణ, ఎన్నిక పరిశీలన, బ్యాలెట్ పత్రాలు, మీడియా, సహాయ కేంద్రం, ఫిర్యాదులు, రిపోర్ట్స్ అండ్ రిటర్న్స్ విధుల కోసం వీరి నియామకం జరిగింది. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి జిల్లా స్థాయి అధికారులను ఇందు కోసం ప్రత్యేకంగా తీసుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య

పార్టీల ఫిరాయింపులో కడియం బ్రాండ్

- కేంద్ర మంత్రి పదవి ఇస్తా అంటే బీజేపీలోకి వెళతారు..
- బహిష్కరణకు శ్రీహరి సిద్ధంగా ఉండాలి
- మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య

హనుమకొండ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పార్టీలు ఫిరాయించడంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బ్రాండ్ అని మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య ఎద్దేవా చేశారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. కడియం శ్రీహరి ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నాడని, కనీసం నైతిక విలువలు లేకుండా పూటకోమాట మాట్లాడి అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని రాజయ్య విమర్శించారు. కడియం శ్రీహరికి దమ్ముంటే ఘన్‌పూర్‌లో చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. ఎంపీ కడియం కావ్యకు కేంద్ర మంత్రి పదవి ఇస్తా అంటే, కడియం శ్రీహరి బీజేపీలోకి (మిగతా 6లో..)

రైతు డిక్లరేషన్ అమలులో కాంగ్రెస్ విఫలం

- రైతులకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలుపర్చాలి
- లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అందోళనలు
- తెలంగాణ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వ లక్ష్మీనర్సయ్య

రాంనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైతు డిక్లరేషన్‌ను అమలుచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వ లక్ష్మీ నర్సయ్య ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు ఎదుట హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి అధ్యక్షతన రైతు మహాదీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బస్వ లక్ష్మీ నర్సయ్య మాట్లాడుతూ.. అధికారంలోకి రావడం కోసం రైతులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో మాయమాటలు చెప్పిందన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. రుణమాఫీ కానీ అర్హులైన రైతులందరికీ వెంటనే రూ.2లక్షల రుణమాఫీని ఏకకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. రైత భరోసా కింద ఎకరాకు రూ.15,000 చొప్పున వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలన్నారు.



రైతు మహాదీక్షలో మాట్లాడుతున్న బస్వ లక్ష్మీ నర్సయ్య

రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను వెంటనే అమలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను వెంటనే చెల్లించాలన్నారు. ఆకాలవర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30,000 చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, మాజీ ఎంపీ సీతారాంనాయక్, వరంగల్, జనగామ అధ్యక్షులు రవికుమార్, రమేశ్, కార్పొరేటర్ చాడ స్వాతిరెడ్డి, నాయకులు చాడ శ్రీనువాస్‌రెడ్డి, రావు పద్మ, కాశిప్రసాద్, గోలి మధుసూదన్ తిరుపతిరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, దొంతి దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్‌కు వచ్చిన కొత్త మిర్చి

మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన తేజ రకం కొత్త మిర్చి

వరంగల్ వ్యవసాయం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం కొత్త మిర్చి అమ్మకానికి వచ్చింది. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పెద్దకోర్పోలు గ్రామానికి చెందిన చందర్ కొత్తమిర్చిని శ్రీ నీలకంఠ అడ్తికి అమ్మకానికి తీసుకురాగా వెంకటేశ్వర ట్రేడర్స్ వారు క్వింటాకు రూ.16,000ల చొప్పున కొనుగోలు చేశారు. అదే విధంగా ఎల్లో మిర్చికి క్వింటాకు రూ.21,500లు ధర పలికింది. కొత్త మిర్చి అమ్మకానికి రావడంతో రైతులు ఆసక్తిగా పరిశీలించారు. సదరు రైతుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

చదువు కొంచెం.. పనులు ఘనం

- మినీ కల్టివేటర్, ఎలక్ట్రికల్ వాహనాల తయారీ
- పలు అవార్డులకు సీతారాంపురం వాసి ఎంపిక
- ఆదర్శంగా నిలుస్తున్న మహిపాల్‌చారి

7



జనవరి 24 నుంచి పలు రైళ్లు రద్దు

- మూడో రైల్వే లైన్ నిర్మాణ పనులే కారణం

7

నాలాల్లో పేరుకుపోయిన పూడికమట్టిని తొలగించాలి



తిరుమల బార్ ప్రాంతంలో పనులను పరిశీలిస్తున్న మేయర్

- నగర మేయర్ గుండు సుధారాణి
- సిల్ట్ తొలగింపు పనుల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని నాలాల్లో పేరుకుపోయిన పూడికమట్టిని ఎప్పటికప్పుడు తొలగించాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. మంగళవారం హనుమకొండ అంబేద్కర్ భవన్, పిస్తా హౌస్, తిరుమల బార్ ప్రాంతాల్లో మురుగు కాల్వలలో పేరుకుపోయిన సిల్ట్ (పూడికతీత) పనులను మేయర్ అక్కడి అధికారులతో కలిసి పరిశీలించారు. జేసీబీ యంత్రాల ద్వారా జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలో చాలా డ్రైన్‌లు చెత్తతో నిండుకుని ఉండడం వల్ల వర్షం కురిసిన సమయంలో నీరు ప్రవహించడం ఆటంకంగా మారి ఇండ్లు, కాలనీలలోకి వస్తున్నాయన్నారు. డ్రైనేజీలలో చెత్త లేకుండా చూడాలన్నారు. ప్రధానంగా కూడళ్లలో ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్న అనిల్‌కుమార్‌లతో పాటు జవాన్‌లు పాల్గొన్నారు.

కేటీఆర్ మరో కిల్ బిల్ పాండే..!

- సెంట్రల్ జైలు కూల్చి హరీశ్‌రావు కోట్లు వెనకేశాడు..
- ఇంటి ఆడబిడ్డ కవితే బీఆర్ఎస్ గుట్టు విప్పుతోంది..
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వ్యాఖ్యలు



ప్రభుత్వ ఆస్పత్రికి భూమి పూజచేస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ రవీందర్ రావు, కలెక్టర్ సత్య శారద

వర్ధన్నపేట రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): టిల్లు మియా, కిల్ బిల్ పాండే వరంగల్‌కు వస్తున్నాడని తెలిసిందని కేటీఆర్‌ను ఉద్దేశించి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు వ్యాఖ్యానించారు. మంగళవారం మండలంలోని ఉప్పరపెల్లి క్రాస్ రోడ్డు వద్ద 100 పడకల ఆధునిక ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి రూ.28 కోట్లతో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో వరంగల్ వరదల సమయంలో కేటీఆర్ ఇక్కడకు వచ్చి రూ.పదివేలు ఇస్తానని చెప్పి ముఖం చాటేశాడని అన్నారు. వరంగల్‌లో ఉన్న బినామీల కోసం, వారి వద్ద ఉన్న లెక్కల కోసం వస్తున్నాడని, కేటీఆర్ మాటలను నమ్మొద్దన్నారు. పింకీ గొర్రెలు కండ్లు తెరవాలని, ఇప్పటికైనా బీఆర్ఎస్ పార్టీని నమ్మొద్దని సూచించారు. తమ కుటుంబ సభ్యులు దొంగలని ఇంటి ఆడబిడ్డ కవితే చెపుతున్నారని, కోట్లాది రూపాయాలు కూడగట్టుకున్నట్లు కవితే చెపుతోందన్నారు. సెంట్రల్ జైలును అమ్మి హరీశ్‌రావు ఎంత డబ్బులు దోచుకున్నాడో కవిత స్పష్టం చేసిందని గుర్తుచేశారు. హరీశ్‌రావుకు ఉద్యమ సమయంలో అగ్గిపెట్టే దొరకలేదని, కానీ, తెలంగాణ పిల్లలు బలయ్యారని తెలిపారు. తాటిచెట్టు పొడుగున్న హరీశ్‌రావు మాటలు నమ్మే పరిస్థితి లేదన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రజలు అండగా ఉండాలని నాగరాజు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలన్నారు. ఐదెకరాల్లో 100పడకల ఆస్పత్రిని రూ.28కోట్లతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి (మిగతా 6లో..)



మురుమూరులో ఏర్పాటు చేసిన బేస్‌క్యాంపు వద్ద సీఆర్పీఎఫ్ జవాన్‌లతో ఐజీ విక్రమ్, ములుగు ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్

కర్రెగుట్టలను సురక్షిత ప్రాంతంగా చేస్తాం.. 7

- సీఆర్పీఎఫ్ దక్షిణ విభాగం ఐజీ ఎస్‌హెచ్ టి.విక్రమ్
- మురుమూరులో సీఆర్పీఎఫ్ బేస్ క్యాంప్ ప్రారంభం
- కర్రెగుట్టలపై రహదారి నిర్మాణం చేపడతామని స్పష్టం

మద్యం మత్తులో ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుల దాడి

నర్సంపేట టౌన్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఆర్టీసీ డ్రైవర్ పై యువకులు దాడిచేసిన ఘటన నర్సంపేటలో చోటుచేసుకుంది. మహబూబాబాద్ డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి మహబూబాబాద్‌కు వెళ్తుండగా నర్సంపేట బస్టాండుకి రాగానే డ్రైవర్ వెంకటయ్య బస్సులో మద్యం మత్తులో నిద్రపోతున్న ఇద్దరు యువకులను మీరు దిగాల్సిన స్టేజీ వచ్చిందని లేవాలంటూ చేయితట్టాడు. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన యువకులు డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారు. డ్రైవర్ దగ్గర ఉన్న క్యాష్ బ్యాగును సైతం లాక్కొని దాడికి పాల్పడినట్లు వెంకటయ్య తెలిపారు. బస్సులో ఉన్న మిగతా ప్రయాణికులు మందుబాబులను వారించి స్థానిక నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. డ్రైవర్ వెంకటయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టినరోజు నాడే.. విద్యుదాఘాతంతో గర్భిణి మృతి


ప్రత్యూష (ఫైల్)

నర్సంపేట టౌన్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట పట్టణంలో విషాదం నెలకొంది. సర్వాపురానికి చెందిన ఏడు నెలల గర్భిణి దార ప్రత్యూష (30) విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో మేడపైకి వెళ్లి ఆరవేసిన బట్టలు తీస్తుండగా, ఇంటికి ఆనుకొని ఉన్న కరెంటు తీగలు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురైంది. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్త, కొడుకు ఉన్నారు. భర్త అనిల్ మహబూబాబాద్ రోడ్డులో ఆటో మొబైల్ షాపు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం ప్రత్యూష పుట్టిన రోజు. పుట్టినరోజు నాడే తన భార్య మరణించిందని భర్త అనిల్ రోదనలతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన చిన్నారులు


సుధాకర్(ఫైల్)


అనాథలైన పిల్లలు

పర్వతగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తల్లి ఎనిమిదేండ్ల కిందట అనారోగ్యంతో చనిపోగా, తండ్రి రైలు ప్రమాదంలో సోమవారం మృతిచెందడంతో చిన్నారులు అనాథలైన ఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ఏనుగల్లు గ్రామంలో చోటు చేసుకుంది. మంగళవారం ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఏనుగల్లుకు చెందిన సైదా సుధాకర్ (45), ఉమ (38) దంపతులకు కుమార్తె లాస్య, కుమారుడు ఉన్నారు. 8ఏళ్ల కిందట ఉమ అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో తండ్రి సుధాకర్ అన్నీ తానై పిల్లలను సాకుతూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, కాజీపేటలో సోమవారం ఉదయం రైలు ట్రాక్‌పై వెళ్తుండగా రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సోమవారం సాయంత్రం ఏనుగల్లు గ్రామానికి బంధువులు తీసుకుకొచ్చి అంత్యక్రియలు జరిపించారు. తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోవడంతో పిల్లలు అనాథలయ్యారు. పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడంతో ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మడికొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన మంగళవారం మడికొండలో చోటు చేసుకుంది. స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ పోచమ్మమైదాన్‌కు చెందిన ఆకుల శశాంక్, సాయిరాం అనే యువకులు బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈక్రమంలో మడికొండ పోలీస్ శిక్షణ కేంద్రం వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని కిందపడిపోయారు. ప్రమాదంలో శశాంక్ తలకు గాయమై తీవ్రరక్తస్రావం కావడంతో పాటు చేయి విరిగింది. సమాచారం తెలిసిన ఇన్‌స్పెక్టర్ కిషన్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్సై రాజ్‌కుమార్, స్థానికులు, పోలీస్ సిబ్బంది సహకారంతో గాయపడిన శశాంక్‌ను పోలీస్ వాహనంలో ఆస్పత్రికి తరలించారు. వెంటనే స్పందించి గాయపడిని వ్యక్తిని సకాలంలో ఆస్పత్రికి తరలించిన ఇన్‌స్పెక్టర్‌ను స్థానికులు అభినందించారు.

నెక్కొండను మునిసిపాలిటీ చేయాలి

ఇక్కడ పంచాయతీ ఎన్నికలను నిలిపివేయాలి
కోర్టును ఆశ్రయించిన మాజీ సర్పంచ్‌లు
హై కోర్టు నుంచి గ్రీన్ సిగ్నల్

నెక్కొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ మునిసిపాలిటీగా ఏర్పాటవుతున్నందున స్థానిక సంస్థల ఎన్నికలు నిలిపివేయించాలని కోరుతూ నెక్కొండ, పత్తిపాక గ్రామాల మాజీ సర్పంచ్‌లు సొంటిరెడ్డి యమునా రంజిత్‌రెడ్డి, లావుడ్యా సరిత తిరుమల్‌నాయక్ హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో వారి పిటిషన్‌పై కోర్టు సానుకూలంగా స్పందించి ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే మునిసిపాలిటీ ఏర్పాటు చేయాలంటూ మంగళవారం ప్రభుత్వాన్ని ఆదేశించినట్లు సమాచారం. సర్పంచ్‌లు తెలిపిన సమాచారం ప్రకారం..

నెక్కొండను మునిసిపాలిటీగా ఏర్పాటు చేయాలని ఆరు నెలల కిందట నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో టీపీసీసీ మెంబర్ రంజిత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని కోరారు. విలీనం కావలసిన ఆరు గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించి తీర్మానాలను అందించాలని ప్రభుత్వం కోరింది. మండలంలోని నెక్కొండ, పత్తిపాక, అమీన్‌పేట, టీకే తండా, నెక్కొండతండా, గుండ్రపల్లి గ్రామాల్లో అధికారులు గ్రామసభలను ఏర్పాటు చేసి తీర్మానాలను పంపించారు. మునిసిపాలిటీ ఏర్పాటుపై కేబినెట్ అమోదం తెలపాల్సి ఉంది. అయితే ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగితే నెక్కొండ మునిసిపాలిటీ ఏర్పాటు మరో ఐదేళ్లు వెనుకబడుతుందని భావించిన రెండు గ్రామాల మాజీ సర్పంచ్‌లు వీలిన గ్రామాల్లో ఎన్నికలు నిలిపివేయాలంటూ కోర్టును ఆశ్రయించారు. దీంతో సానుకులంగా స్పందించిన హై కోర్టు 4వ సెషన్స్ కోర్టు ప్రభుత్వానికి, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. కోర్టు ఆదేశాల మేరకు నెక్కొండ మునిసిపాలిటీ ఏర్పాటవడం ఖాయమంటూ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నెక్కొండ గ్రామ పంచాయతీ కార్యాలయం

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేయండి

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలోని 12 మండలాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయని, ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి నోడల్ అధికారులు, ఎంపీడీవోలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నియమ నిబంధనలపై పూర్తి అవగాహనను కలిగి ఉండాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది క్రియాశీలక పాత్ర పోషించాలని, పరస్పరం సమన్వయంతో పని చేస్తూ ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని జాగ్రత్తగా సరి చూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, సదుపాయాలు లేని ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎన్నికల నిర్వహణతో ముడిపడిన అంశాలపై, నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీపీవో లక్ష్మీ రమాకాంత్, ఎంపీడీవోలు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


లాండ్రోమార్ట్‌ను పరిశీలిస్తున్న మేయర్

లాండ్రోమార్ట్‌ను వినియోగంలోకి తీసుకురావాలి

● నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో అధునాతన సాంకేతిక పద్ధతిలో ఏర్పాటు చేసిన లాండ్రోమార్ట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. మంగళవారం వరంగల్ పోతననగర్‌లోని లాండ్రోమార్ట్‌ను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లాండ్రోమార్ట్‌లోని యంత్రాలకు ఏమైనా నష్టం జరిగిందా? అని అధికారులు పరిశీలించాలన్నారు. లాండ్రోమార్ట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు త్వరగా టెండర్లు పిలిచి వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ఈఈ మహేందర్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ గోల్కొండ శ్రీనివాస్, ఏఈ సంతోష్‌కుమార్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోగా ప్రతిపాదనలు అందజేయాలి

గ్రేటర్ కమిషనర్ చహత్ బాజ్‌పాయి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నిర్దేశిత గడువులోగా ప్రతిపాదనలు అందజేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయి అన్నారు. మంగళవారం కుడా సమావేశ మందిరంలో కుడా సీడబ్ల్యూఎంసీ, కుడా అధికారులతో సాస్కి ప్రతిపాదనల సమర్పణ ఏర్పాటు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీడబ్ల్యూఎంసీ కమిషనర్, కుడా వైస్‌చైర్మన్ చహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ.. రెండునెలల కాలంలో సాస్కి స్కీమ్‌లో భాగంగా ప్రతిపాదనలు సమర్పించడానికి అధికారులకు పలు సూచనలు చేశారన్నారు. ఇందుకు డిసెంబరు 15 చివరి గడువు అని తెలిపారు. ఇందులో నీటి సరఫరా, డ్రెయినేజీ నెట్‌వర్క్, సీఐఎస్ మ్యాపింగ్, మునిసిపల్ ఆస్తుల మ్యాపింగ్, పాత బావులను పునరుద్ధరణ, నైబర్ వుడ్ అంశాలపై పురోగతి వంటి అంశాలను ఈ ప్రాజెక్టులో చేర్చడం వల్ల వరంగల్ నగరానికి ప్రోత్సాహక మొత్తం లభించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడా సీపీవో అజిత్‌రెడ్డి, ఎస్ఈ సత్యనారాయణ, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఈఈ సంతోష్ బాబు, కుడా ఈఈ భీమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయి

కేటీఆర్ మరో కిల్ బిల్ పాండే..!

(5వ పేజీ తరువాయి)

డయాలసిస్ సెంటర్‌ను సైతం తెచ్చామన్నారు. పర్వతగిరికి 50 పడకల ఆస్పత్రి మంజూరి చేయించామని, 133 కేవీ సబ్ స్టేషన్ పర్వతగిరికి వచ్చిందన్నారు. వర్ధన్నపేట మునిసిఫ్ కోర్టును ఏర్పాటు చేస్తున్నామని, హనుమకొండకు వెళ్లకుండా త్వరలోనే పాత మునిసిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేస్తామన్నారు. రూ.200 కోట్ల యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తామని, త్వరలో శంకుస్థాపనకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, జిల్లా కలెక్టర్ సత్యశారద, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఎంఅండ్‌హెచ్‌వో సాంబశివ రావు, డీసీహెచ్ రామ్మూర్తి, సూపరింటెండెంట్ నర్సింహస్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, జిల్లా నాయకుడు పోశాల వెంకన్న, గుజ్జ రవీందర్ రెడ్డి, అక్బర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

డిఫాల్టర్లకు కేటాయింపులు లేవు

మిల్లర్ల సమీక్షలో కలెక్టర్ సత్యశారద


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద, పాల్గొన్న జిల్లా అధికారులు, మిల్లర్లు

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : డిఫాల్టర్ మిల్లర్లకు ఈసారి ధాన్యం కేటాయింపులు లేవని కలెక్టర్ సత్యశారద స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో మిల్లర్లు, సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోలు, మిల్లింగ్ ప్రక్రియ పురోగతిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పంట ఉత్పత్తులను గిట్టుబాటు ధరకే మిల్లర్లు కొనుగోలు చేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని నిర్ణీత గడువులోగా సీఎంఆర్ పూర్తి చేసి ప్రభుత్వ గోదాములకు అందజేయాలని ఆదేశించారు. ఈ విషయంలో మిల్లర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్లు వారి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా.. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్డీవో రాంరెడ్డి, డీఏవో అనురాధ, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి శోభన్‌బాబు, సివిల్ సప్లయీస్ అధికారి కృష్ణయ్య, డీఎం సంధ్యారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గోనెల రవీందర్‌రావు, కార్యదర్శి బూరెళ్ల సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు తోట సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

నేటి దీక్షా దివస్ సన్నాహక సమావేశం
హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని, ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ మరో పోరాటానికి సిద్ధమవుతోందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2009లో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన దీక్షను దీక్షా దివస్‌గా వేడుకలు జరుపుకుంటున్నామన్నారు. నవంబరు 26 నుంచి డిసెంబరు 9 వరకు నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ సన్నాహక సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని తెలిపారు.

రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని ఆరోపించారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న నిబంధన సుప్రీంకోర్టులో ఉందని తెలిసి బీసీల రిజర్వేషన్ల విషయంలో ద్రోహానికి పాల్పడిందన్నారు. బీసీ ప్రధానమంత్రిగా ఉండి బీసీ సంక్షేమ శాఖ ఏర్పాటు చేయకుండా తెలంగాణలో అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తాననడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో స్టేట్ సరోగసీ బోర్డు మాజీ సభ్యురాలు హరి రమాదేవి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు చెన్నం మధు, రంజిత్‌రావు, సోదా కిరణ్, జోరిక రమేష్, పులి రజినీకాంత్, మేకల బాబురావు, పోలెపల్లి రాంమూర్తి, పస్తం అనిల్, తక్కళ్లపెల్లి వినిల్‌రావు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

పార్టీలు ఫిరాయింపులో కడియం బ్రాండ్

(5వ పేజీ తరువాయి)

జంపు జిలానీ అవుతాడన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గంలో పచ్చటి కాపురంలో చిచ్చుపెట్టే రకం కడియం అని అన్నారు. శ్రీహరి రాజీనామా చెయ్యకుంటే వేటు తప్పదని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆయన పదవి బర్తరఫ్ కావడం ఖాయమని రాజయ్య జోస్యం చెప్పారు.

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దళితుల మీద ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, అలా మాట్లాడితే ఉరుకునే ప్రసక్తేలేదని రాజయ్య హెచ్చరించారు. నాయిని దందాలు, సెటిల్‌మెంట్స్, కబ్జా, అక్రమాస్తుల గురించి తాను మాట్లాడలేదన్నారు. వరంగల్ నగరంలో నిర్మిస్తున్న 24 అంతస్థుల ఆస్పత్రి నిర్మాణం పనులపై సమీక్ష నిర్వహించాలని మాట్లాడితే అవమానకరంగా మాట్లాడారని అన్నారు. దళితులతో గోక్కోవడం సరికాదని, డప్పు దండోరా దరువు వేసి కాంగ్రెస్ ప్రభుత్వ తీరును, రాజేందర్‌రెడ్డి అక్రమాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని రాజయ్య హెచ్చరించారు.

జీవో 46పై భగ్గుమన్న బీసీ విద్యార్థి సంఘాల నేతలు

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



కేయూలో నిరసన చేస్తున్న బీసీ విద్యార్థి సంఘాల నేతలు

కేయూ క్యాంపస్ నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు గండికొడుతూ వెలువరించిన జీవో 46ను నిరసిస్తూ మంగళవారం కేయూ మొదటి గేటు వద్ద బీసీ విద్యార్థి సంఘాల నేతృత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల నిరసన నేపథ్యంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసే క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు.

ఈ సందర్భంగా బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్, కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఆరెగంటి నాగరాజుగౌడ్ మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు దొంగ వైఖరిని అనుసరిస్తున్నాయని ధ్వజమెత్తారు. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని అసెంబ్లీలో చట్టం చేసి పార్లమెంట్‌కు కాంగ్రెస్ పంపిందన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బిల్లు పాస్ చేయించి రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకాక అనేక ప్రాంతాల్లో అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయకపోతే తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నేతలు అన్వేశ్, రవితేజ, సుధీర్, రాజశేఖర్, రాజేశ్, అనిల్, రవి, గణేశ్, నితిన్, సాయి, వరుణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

29న దివ్యాంగుల జిల్లా స్థాయి ఆటల పోటీలు

వరంగల్ టౌన్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం-2025 సందర్భంగా ఈనెల 29న ఉదయం 8 గంటలకు వరంగల్ ఓసిటీలో గల ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా సంక్షేమాధికారి బి.రాజమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులకు జూనియర్స్ విభాగం(అండర్ 18) బాల,బాలికలకు వేరువేరుగా ఆటల పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. అదేవిధంగా సీనియర్స్ విభాగంలో (18 నుంచి 54 సంవత్సరాలలోపు) మహిళలు, పురుషులకు వేరువేరుగా పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు తీసుకొని రావాలని ఆమె సూచించారు.

ఆటల పోటీల వివరాలు..

అంధులకు: రన్నింగ్, షాట్‌పుట్, చెస్ పోటీలు
బధిరులకు: రన్నింగ్, షాట్‌పుట్, జువెలిన్ త్రో పోటీలు
శారీరక వైకల్యం: షాట్‌పుట్, జువెలిన్ త్రో, క్యారమ్స్ పోటీలు
బుద్ధి మాంద్యం: రన్నింగ్, షాట్‌పుట్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఇతర వివరాలకు మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్ శాఖ వరంగల్ జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని బి.రాజమణి కోరారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	6880	6300
మక్కలు	1814	1521
కందులు	6360	3022
పెసళ్లు	----	----
పల్లికాయ (సూక)	5000	3500
పల్లికాయ (పచ్చిది)	6300	3890
పసుపు (కాడి)	----	----
పసుపు (గోల)	----	----
తేజ మిర్చి	----	----
తేజ మిర్చి ఏసీ	14600	9500
వండర్‌హాట్	----	----
వండర్‌హాట్ ఏసీ	19500	12000
యూఎస్341ఏసీ	17000	9000
దీపిక	----	----
సింగిల్‌పట్టి ఏసీ	----	----
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

మీ పత్తి బంగారం కావాలంటే..



- తేమ విషయంలో జాగ్రత్తలు పాటించాలి
- రైతులకు మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి మల్లేశం సూచన

వరంగల్ వ్యవసాయం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో అతివృష్టి, అనావృష్టి వల్ల ఈసారి పత్తి దిగుబడి అంతంత మాత్రమే వచ్చింది. వచ్చిన కాస్త పత్తిని నాణ్యతగా మార్కెట్‌కు తరలిస్తేనే గిట్టుబాటు ధర లభిస్తుంది. ఈ విషయంలో రైతులు ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా.. పెద్ద ఎత్తున నష్టపోవాల్సి వస్తుంది. అందుకే పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చేముందు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? మంచి ధర రావాలంటే ఏం చేయాలి అనే అంశాలపై ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి మల్లేశం కొన్ని సూచనలు చేస్తున్నారు. అవేంటో ఆయన మాటల్లోనే చూద్దాం..

చేనుపై పత్తి పూర్తిగా విచ్చుకుని ఆరిన తరువాత ఏమాత్రం తేమలేని సమయంలో పత్తిని ఏరాలి. తరువాత నీడలో ఒకటి రెండు రోజులు ఆరబెట్టాలి. పూర్తిగా ఎండలో ఆరబెట్టడం వల్ల నాణ్యత తగ్గే అవకాశం ఉంటుంది. రెండు రోజులు నీడలో ఆరబెట్టిన తరువాత బస్తాల్లో కానీ విడిగా గదిలో గానీ నిల్వ చేయడం వల్ల ఎలాంటి తేమ పెరుగదు.

చేనుపై పత్తి ఉన్న సమయంలో వర్షాలు కురిస్తే వెంటనే పత్తి తీయకుండా నాలుగు రోజులు చెట్టుమీదనే పూర్తిగా ఆరేలా చూడాలి. ఆ తరువాతే పత్తి తీయాలి.

ఎక్కువ తూకం వస్తుందని నీటిని కలిపి తీసుకురావడం వల్ల అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉంటుంది. నీటిని కలుపడం వల్ల రంగు మారి నాణ్యత తగ్గిపోతుంది. ఒకటి రెండు కిలోల తూకం కోసం ఆశపడి మొత్తం పత్తిని నాశనం చేసుకోవద్దు. నాణ్యమైన పత్తిని తీసుకురావడం వల్ల మంచి ధరపొందవచ్చు.

పత్తిని ఉదయం, సాయంత్రం సమయాల్లో కాకుండా కొద్దిగా ఎండ ఉన్న సమయాల్లో తీయాలి. ఎలాంటి పత్తిని తీయాలనే విషయంలో కూలీలకు ముందుగానే సలహాలు ఇవ్వాలి. మంచి పత్తి, గుడ్డి పత్తిని వేరువేరుగా తీసేలా చూడాలి. వేరువేరుగానే మార్కెట్‌కు తీసుకురావాలి.

వివిధ రకాలైన పత్తిని కలుపరాదు. ఎందుకంటే అన్ని రకాల పత్తి గింజలు ఒకేలా ఉండవు. రంగుల్లో తేడాలుంటాయి. చూడగానే వ్యాపారులకు అనుమానం వస్తుంది. అందువల్ల ఏ రకానికి ఆ రకం మార్కెట్‌కు తీసుకువెళ్లాలి.


మల్లేశం, ఏనుమాముల మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి

సీసీఐ నిబంధనలు

- నాణ్యతలేని, రంగుమారిన, వర్షానికి తడిసిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయదు.
- పత్తిని సంచుల్లో కాకుండా ట్రాలీ వాహనాల్లో తీసుకురావాలి.
- పత్తి రైతులందరూ సంబంధిత (ఏపీఎంసీ)లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- పత్తి రైతులకు చెల్లింపు నేరుగా (ఏబీపీఎస్/పీఎఫ్ఎంఎస్) ద్వారా వారి ఆధార్‌కు లింక్ చేయబడిన బ్యాంక్ ఖాతాలోకి మాత్రమే జమ చేస్తుంది.

అందువల్ల పత్తి రైతులు తమ బ్యాంకు ఖాతాను ఆధార్‌కు లింక్ చేసుకోవాలి.

తేమ శాతం ముఖ్యం..

పత్తి ఖరీదు చేసే సమయంలో తేమ శాతాన్ని ప్రధానంగా పరిగణలోకి తీసుకుంటారు. 8శాతం తేమ ఉంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లిస్తుంది. పత్తిలో తేమ శాతం తెలుసుకోవడానికి అధికారులు ప్రత్యేక పరికరాన్ని వినియోగిస్తారు. ఈ పరికరం పొడవు 18 అంగుళాలు రెండు కడ్డీలకు ఉన్న తీగల ద్వారా డిజిటల్ మీటర్‌కు అనుసంధానం చేసి ఉంటుంది. రెండు కడ్డీలు పత్తిలో గుచ్చిన సమయంలో డిజిటల్ మీటర్ పత్తిలో తేమ శాతాన్ని అంకెల రూపంలో చూపిస్తుంది.

తేమ విషయంలో కొంత సడలింపు ఇవ్వాలని రైతుల పక్షాన కాటన్ అసోసియేషన్ ప్రతినిధులు ఇప్పటికే కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం 8 శాతం వరకు ఉంటేనే మద్దతు ధర లభిస్తోంది. దానిని 10 శాతానికి పెంచాలని కోరుతున్నారు. అదే విధంగా 8 నుంచి 12 వరకు తేమశాతం ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తోంది. అలా కాకుండా 12 నుంచి 18 వరకు తేమశాతం ఉన్న పత్తిని కూడా సీసీఐ కొనుగోలు చేయాలని రైతుల పక్షాన కాటన్ అసోసియేషన్ కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది.

పత్తిలో తేమ	మద్దతు ధర
8 శాతం	రూ.8.110లు
9 శాతం	రూ.8.028లు
10 శాతం	రూ.7.947లు
11 శాతం	రూ.7.866లు
12 శాతం	రూ.7.785లు


కథా నాటిక పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సహృదయ ప్రతినిధులు

కాళోజీ కళాక్షేత్రంలో
రాష్ట్రస్థాయి కథానాటిక పోటీలు

జనవరి 1 నుంచి 4 వరకు ప్రదర్శన

వడ్డెపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కందాళం ఫౌండేషన్ (అమెరికా), సహృదయ వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో జనవరి 1 నుంచి 4వ తేదీ వరకు రాష్ట్రస్థాయి కథానాటికల పోటీలను నిర్వహించనున్నట్లు సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ వరంగల్ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజా మనోహర బాబు, సంస్థ ప్రతినిధులు ఆచార్య డీఎస్ఎన్ మూర్తి, ఆచార్య అప్పాజ్యోషుల సత్యనారాయణ తెలిపారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర స్థాయి కథానాటిక పోటీల కరపత్రాలు, బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2026 సంవత్సరం ప్రతిభామూర్తి జీవిత కాల సాధన పురస్కారం డాక్టర్ గుంజి వెంకటరత్నంకు, విశిష్ట సాహితీమూర్తి జీవిత కాల సాధన పురస్కారం వరంగల్‌కు చెందిన ప్రముఖ రచయిత రామా చంద్రమౌళికి, సరిలేరు నీకెవ్వరు విశిష్ట రంగస్థల పురస్కారం కోట్ల హన్మంతరావుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు నేత్రపర్వంగా నిర్వహించే 9 నాటికలను ప్రతీ రోజు మూడు చొప్పున కాళోజీ కళాక్షేత్రంలో సాయంత్రం ప్రదర్శించనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ నంబర్లు: 98662 53646 / 99490 13448 లలో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో సహృదయ సంస్థ ప్రతినిధులు రామకోటేశ్వర్‌రావు, వనం లక్ష్మీకాంతరావు, ఏవీ నర్సింహారావు, కె.కృష్ణమూర్తి, న్యాలకొండ భాస్కర్‌రావు, కళా రాజేశ్వర్‌రావు, కనుకుంట్ల గంగన్న తదితరులు పాల్గొన్నారు.

జనవరి 24 నుంచి పలు రైళ్లు రద్దు

మూడో రైల్వే లైన్ నిర్మాణ పనులే కారణం

కాజీపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మందమర్రి రైల్వే స్టేషన్ సమీపంలో మూడో రైల్వే లైన్ నిర్మాణంతో జనవరి 24 నుంచి ఫిబ్రవరి 14 వరకు, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్ష రూట్లలో వెళ్లే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. (67771) సిర్పూర్ టౌన్ - కరీంనగర్‌ల మధ్య మెము అప్ అండ్ డౌన్ రైలు, (17003) కాజీపేట - సిర్పూర్ కాగజ్‌నగర్‌ల మధ్య నడిచే మెము ప్యాసింజర్ అప్ అండ్ డౌన్, (17004) కాజీపేట - బల్లార్ష మధ్య నడిచే రామగిరి ప్యాసింజర్ అప్ అండ్ డౌన్, (17035) కాజీపేట -బల్లార్ష మధ్య నడిచే సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్ రైళ్లు రద్దు కానున్నాయి. జనవరి 24 బల్లార్షా మీదుగా ఢిల్లీ వైపు వెళ్ల మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల దారి మళ్లించి నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

నాగేంద్రుడికి నెమలి వాహనసేవ

గీసుగొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊకల్‌లో గల సుప్రసిద్ధ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా తయారు చేయించిన నెమలి వాహనంలో ఆసీనులైన సుబ్రహ్మణ్యేశ్వస్వామి, వల్లిదేవి, దేవసేనాదేవి విగ్రహాలకు పట్టువస్త్రాలతో అలంకరించి తరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష, ఆలయ చైర్మన్ తిమ్మాపురం రాజేశ్వర్‌రావు, భక్తులు పాల్గొన్నారు.


నెమలి వాహనంలో ఆసీనులైన ఉత్సవ మూర్తులు

కర్రెగుట్టలను సురక్షిత ప్రాంతంగా చేస్తాం..

- సీఆర్పీఎఫ్ దక్షిణ విభాగం ఐజీ ఎస్‌హెచ్ టి.విక్రమ్
- మురుమూరులో సీఆర్పీఎఫ్ బేస్ క్యాంప్ ప్రారంభం

వాజేడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. కర్రెగుట్టలను పూర్తిగా ఆధీనంలోకి తీసుకునేందుకు వాజేడు మండలంలోని మారుమూల అటవీ ప్రాంతమైన మురుమూరులో సీఆర్పీఎఫ్ 39 బెటాలియన్ క్యాంపును ఏర్పాటు చేసి మంగళవారం ఆ క్యాంపును ప్రారంభించారు. సీఆర్పీఎఫ్ దక్షిణ విభాగం ఐజీ ఎస్‌హెచ్ టి.విక్రమ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కర్రెగుట్ట హిల్స్‌తో సీఆర్పీఎఫ్ క్యాంపును ప్రారంభించిన ఐజీ విక్రమ్ మాట్లాడారు. కర్రెగుట్ట అడవులను సురక్షితంగా ప్రదేశంగా ఉంచేందుకు ఈ క్యాంపుల ముఖ్య ఉద్దేశమన్నారు. మురుమూరులో బేస్ క్యాంపు ఏర్పాటుతో పాటు పామునూరులో మరో క్యాంపు ఏర్పాటు చేసి కర్రెగుట్టల వరకు రహదారి నిర్మాణం చేపడతామని ఆయన అన్నారు. కర్రెగుట్టలను అభివృద్ధి చేయడంతో ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో ఇక్కడ నివాసం ఉంటున్న ఆదివాసీలకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కర్రెగుట్టలను సురక్షితం, శాంతిని నెలకొల్పి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అటవీ శాఖ, రెవెన్యూ స్థానిక పోలీసుల సహకారంతో త్వరితగతిన ఈ క్యాంపును ఏర్పాటు చేయగలిగామని ఆయన పేర్కొన్నారు.

కాగా, ఈ క్యాంపులో సుమారు 350 మంది సీఆర్పీఎఫ్ బలగాలతో ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ప్రయివేటు భూమిలో ఐదేళ్ల పాటు లీజుకు తీసుకొని క్యాంపును ఏర్పాటు చేయగా ప్రస్తుతం తాత్కాలిక టెంట్లు, మరుగుదొడ్లను నిర్మించి క్యాంపు అందుబాటులోకి తీసుకువచ్చారు. త్వరలోనే పూర్తి స్థాయిలో ఈ క్యాంపును నిర్మించి సీఆర్పీఎఫ్ పూర్తి కార్యకలపాలను చేయనుంది. ఈకార్యక్రమంలో హైదరబాద్ రేంజ్ డీఐజీ అనిల్‌మింజ్, కమాండెంట్ ప్రశాంత్ శ్రీవాత్సవ్, ములుగు ఓఎస్డీ శివంఉపాధ్యాయ, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, సీఐ రమేష్, ఎస్సైలు సతీష్, తిరుపతిరావులు పాల్గొన్నారు.

'సానుభూతి పరుల ముద్రను తొలగించండి'

సీఆర్పీఎఫ్ క్యాంపు ప్రాంభోత్సవంలో మురుమూరు మాజీ సర్పంచ్ పూనం నరేష్ మాట్లాడారు. తమ పంచాయతీలో కొంత మంది వ్యక్తులను మావోయిస్టు సానుభూతిపరుల ముద్ర వేసి తరచూ స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారన్నారు. ప్రస్తుతం మారిన పరిస్థితుల్లో ఆ ముద్రను తొలగించాలని ఆయన ఈ సందర్భంగా ఐజీ విక్రమ్, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌ను కోరారు.


బేస్ క్యాంప్ నమూనాను పరిశీలిస్తున్న ఐజీ, ఎస్పీ తదితరులు

కేంద్ర బలగాల చేతికి కర్రె గుట్టలు

మురుమూరులో సీఆర్పీఎఫ్ క్యాంపు ఏర్పాటుతో కర్రెగుట్టలను కేంద్ర బలగాల పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుందని తెలుస్తోంది. బేస్ క్యాంప్‌లో సుమారు 350 సీఆర్పీఎఫ్ జవాన్‌లు విధులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండగా అత్యధునిక ఆయుధాలు, డ్రోన్‌ల సాయంతో నిత్యం కర్రెగుట్టలపై నిఘా ఉంచనుంది. కర్రెగుట్టల్లో మిగిలిన మావోయిస్టుల కోసం కేంద్రం వేట కొనసాగిస్తుందని తెలుస్తోంది. కర్రెగుట్టలపైకి రహదారి నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తీసుకువస్తే నిత్యం జనసంచారం ఉండడంతో మావోయిస్టులు కర్రెగుట్టలో తల దాచుకునే పరిస్థితి ఉండదు. దీంతో మావోయిస్టులు లొంగి పోవడమో లేక ఇతర మార్గాలను ఎంచుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. కర్రెగుట్టల చుట్టూ సీఆర్పీఎఫ్ క్యాంపులను ఏర్పాటు చేస్తామని ఐజీ విక్రమ్ తెలపడంతో కర్రెగుట్టలు మొత్తం సీఆర్పీఎఫ్ బలగాల చేతికి వెళ్లినట్లేనని చెప్పుకోవచ్చు. తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులను ఆనుకొని ఈ కర్రెగుట్టల ఉండగా, ఈ ఏడాది మార్చి నుంచి ఆపరేషన్ కగార్ పేరుతో కర్రెగుట్టలను కేంద్ర బలగాలు పూర్తిగా ఆధీనంలో తీసుకొని మావోయిస్టుల ఏరివేతను ప్రారంభించాయి. దీంతో మావోయిస్టు పార్టీ కోలుకోలేని స్థితికి వెల్లడంతో మావోయిస్టు అగ్రనాయకులు లొంగిపోవడంతో పాటు సీసీ సభ్యులు ఎదురుకాల్పుల్లో హతమయ్యారు. వందల సంఖ్యలో మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్, మహరాష్ట్ర మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల ముందు ఆయుధాలతో సహ లొంగిపోయారు. ఇటీవల మావోయిస్టు అగ్రనాయకుడు హిడ్మా సైతం మృతిచెందడంతో మావోయిస్టు ఉద్యమం మరింతగా నీరుగారిందని చర్చలు జరుగుతున్నాయి. తాజా వాజేడులోని మురు మూరులో సీఆర్పీఎఫ్ క్యాంపు ఏర్పాటుతో ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టుల కార్యకలపాలకు చెక్ పడనుంది.

ఈసారి ఏకగ్రీవాలు ఏ మేరకు ఉండేనో ?

- అందని రూ. 10 లక్షల ప్రోత్సాహక నిధులు
- మొండిచేయి చూపిన గత ప్రభుత్వం
- ఎంపీలు, ఎమ్మెల్యే నుంచి రాని మరో రూ.10 లక్షలు
- నిరాశకు లోనైన గత పంచాయతీ పాలక వర్గాలు

హనుమకొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. మరో 24 గంటల్లో ఎన్నికల షెడ్యూల్ కూడా విడుదల కాబోతోంది. దీంతో పల్లెల్లో పంచాయతీ ఎన్నికల సమరం మొదలు కానుంది. ఈసారి కూడా ఏకగ్రీవమైన పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పుడే నజరానా ప్రకటించింది. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ప్రోత్సాహకంగా రూ. 10 లక్షలు ఇవ్వనున్నట్లు స్పష్టం చేసింది.

ఇంత వరకు బాగానే ఉంది. ఎన్ని పంచాయతీలు ఏకగ్రీవం అవుతాయనే విషయంలోనే అనుమానాలు తలెత్తుతున్నాయి. స్పందన ఎలా ఉంటుందన్నదే చర్చనీయాంశం అవుతోంది. ఇందుకు కారణం గత ప్రభుత్వాన్ని నమ్మి ప్రజలు ఏకగ్రీవాలు చేసుకుంటే పాలకవర్గాల కాలపరిమితి ముగిసే నాటికి ఎలాంటి నిధులు రాలేదు. ఈ ప్రోత్సాహకాలు అందనందువల్ల ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేక పోయామని మాజీలు అభిప్రాయపడుతున్నారు.

మొర ఆలకించలేదు

గత పంచాయతీ ఎన్నికలు 2019 జనవరి 21,25,30 తేదీల్లో మూడు విడతలుగా జరిగాయి. పాలక వర్గాల గడువు ముగిసిన వెంటనే ఎన్నికలు జరగలేదు. పంచాయతీలు ప్రత్యేకాధికారుల పాలన కిందకు వెళ్లాయి. గత అయిదేళ్ల గ్రామ పంచాయతీల అభివృద్ధికి అనుకున్న స్థాయిలో గ్రాంట్లు విడుదల కాకపోవడంతో పల్లెల్లో అభివృద్ధి కుంటుపడింది. కొన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచులు అప్పులు తెచ్చి పనులు చేశారు. పాలక వర్గాలు స్థానిక నేతలు, ఎమ్మెల్యే ద్వారా తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. కనీసం ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు ప్రోత్సాహకాలన్నా ఇప్పించాలని ప్రాధేయపడినా ఫలితం దక్కలేదు.

ప్రశాంతంగా ఎన్నికలకు...

పంచాయతీ ఎన్నికలు ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా, వివాదాలక తీతంగా ప్రశాంతంగా జరిగేందుకు, ప్రజలు ఐక్యంగా ఉండి ప్రశాంత వాతావరణంలో పల్లెలను తీర్చిదిద్దుకోవాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవాలను ప్రోత్సాహకంగా ఈ నజరానాను ప్రకటించింది. గత ప్రభుత్వం కూడా ఇలాగే ఏకగ్రీవమైన పంచాయతీలకు ప్రోత్సాహకాలను ఇస్తానని వాగ్దానం చేసింది. సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా చేసుకున్న ప్రతి గ్రామ పంచాయతీకి రూ. 10 లక్షలు ఇస్తానంది. పైగా నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి ఆయా ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా ఒక్కో గ్రామ పంచాయతీకి రూ. 10 లక్షల ప్రోత్సాహక నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. వెరసి రూ. 20 లక్షల నిధులులొస్తాయి. గ్రామాన్ని ఎంతకొంత అభివృద్ధి చేసుకోవచ్చునని ప్రజలు ఆశపడ్డారు. దీనితో వీరంతా ఏకమై పార్టీలను పక్కన పెట్టి ఏకగ్రీవాలకు కలిసికట్టుగా కదిలారు. ఇలా ఉమ్మడి జిల్లాలో 1,708 గ్రామ పంచాయతీల్లో 284 చోట్ల ఏకగ్రీవమయ్యాయి. ఇందుకు సంబంధించి రూ. 56 కోట్లు రావాల్సి ఉంది. కానీ పాలక వర్గాల పదవికాలం ముగిసినా చిల్లిగవ్వ ఇవ్వలేదు. అటు ఎమ్మెల్యేలు, ఎంపీలు సైతం తాము ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని ఏకగ్రీవంగా గెలిచినవారు వాపోయారు.



వివరాలు తీసుకున్నా..

గత ప్రభుత్వం ఏకగ్రీవ ప్రోత్సాహకాలు ఇస్తానని జిల్లా పంచాయతీ అధికారుల నుంచి వివరాలను తీసుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యుల స్థానాల వివరాలను పంపించారు. కానీ నిధులు మాత్రం విడుదల కాలేదు. గతంలో పంచాయతీ పాలకవర్గాల సమావేశాల్లో కూడా సర్పంచ్‌లు ప్రోత్సాహకం విషయమై పలుమార్లు లేవనెత్తారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఏక్రగీవంగా ఎన్నికైన పంచాయతీలు ప్రోత్సాహక నిధులు వస్తాయనే ఆశతో పాలకవర్గాలు అత్యవసర పనులకు తీర్మానం చేసికొని పనులను పూర్తి చేసి ప్రభుత్వం ఇచ్చే నిధుల కోసం నిరీక్షించారు. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులు ప్రభుత్వం డబ్బులు ఇస్తే తీసుకుంటామనే భావనతో పనులు పూర్తి చేయగా మరికొందరు పనులను మధ్యలోనే నిలిపివేశారు. కొన్ని చోట్ల అసలు ఆ డబ్బులు రాకపోవడంతో ఎలాంటి పనులు చేపట్టక పోవడంతో గ్రామస్థులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలకు వెళ్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏకగ్రీవాలకు రూ. 10 లక్షలు ఇస్తానని ప్రకటిస్తున్నందునా ఈసారి అవైనా వస్తాయా ? అన్న సందేహాన్ని గ్రామీణ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

చదువు కొంచెం.. పనులు ఘనం

- మినీ కల్టివేటర్, ఎలక్ట్రికల్ వాహనాల తయారీ
- పలు అవార్డులకు సీతారాంపురం వాసి ఎంపిక
- ఆదర్శంగా నిలుస్తున్న మహిపాల్‌చారి



ఎలక్ట్రికల్ కారుగా మార్చిన పాత కారు వద్ద మహిపాల్‌చారి

పరకాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తుంది నేటి యువత. పుట్టింది పల్లెటూరు, పెద్దగా చదువుకోకపోయినా ఢిల్లీ వరకు వెళ్లి రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకొని ఆదర్శంగా నిలుస్తున్నాడు మహిపాల్‌చారి. హనుమకొండ జిల్లా పరకాల మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన కె.మహిపాల్‌చారి పదో తరగతి ఫెయిల్ అయి తల్లిదండ్రులు మందలిస్తే హనుమకొండకు వెళ్లి అలంకార్ థియేటర్ సమీపంలో ఓ మెకానిక్ వద్ద చేరాడు. మెకానిజంలో నైపుణ్యంతో అనతికాలంలోనే గడ్డిని తొలగించేందుకు మినీ కల్టివేటర్‌ను తయారు చేశాడు. అది తమకు కావాలంటూ రైతుల నుంచి ఆర్డర్లు వచ్చాయి. పది మందిని ఏర్పాటు చేసుకొని అధిక సంఖ్యలో కల్టివేటర్లు తయారు చేసి రైతులకు అందించేవాడు.

2015లో రాష్ట్రపతి అవార్డు

మహిపాల్‌చారి తయారు చేసిన మినీ కల్టివేటర్ రాష్ట్రపతి అవార్డుకు ఎంపికైంది. 2015లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి అవార్డును అందుకున్నాడు. అప్పటి నుంచి ప్రతియేటా 500లకు పైగా మినీ కల్టివేటర్లు తయారు చేస్తూ దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన రైతులకు ఆన్‌లైన్‌లో అందిస్తున్నాడు. ఇదే కాకుండా నేషనల్ ప్రీమియర్ ఎంటర్‌షిప్ అవార్డు కూడా కేంద్ర ప్రభుత్వం 2016లో అందించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన గ్రామీణ సృజన శక్తి వెలుగుదారుల వేదికపై ప్రస్తుత దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహిపాల్‌చారికి సంబంధించిన సృతజనాత్మకతో ప్రతిబింబించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పాత వాటిని ఎలక్ట్రికల్ వాహనాలుగా తయారీ

ఇటీవల ప్రజలు ఎక్కువగా ఎలక్ట్రికల్ వాహనాలపై మక్కువ చూపడంతో బోర్‌కు వచ్చిన వాహనాలతో పాటు మూలన పడ్డ వాహనాలకు ఎలక్ట్రికల్ వాహనాలుగా మార్చుతున్నాడు. నాలుగు గంటలు చార్జింగ్ చేస్తే 60 నుంచి 100 కిలోమీటర్ల వరకు వెళ్లే బైక్‌ను తయారు చేశాడు. ఇందుకు రూ. 35 వేలు ఖర్చవుతుందని, ఎవరికైనా కావాలంటే పాత వాహనాలను ఎలక్ట్రికల్ వాహనాలుగా తయారు చేసి ఇస్తానని మహిపాల్‌చారి పేర్కొన్నారు. అలాగే కారుకు 4 గంటల చార్జింగ్‌తో 70 నుంచి 250 కి.మీ. వరకు ప్రయాణించేలా రూ. 1 లక్షా 50 వేల ఖర్చుతో అందజేస్తున్నారు. గ్రామీణ యువకుడు ఇలా ప్రజలకు అవసరమయ్యే వస్తువులను తయారు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.



అవార్డు అందుకుంటున్న మహిపాల్‌చారి



ఏజెన్సీలో మంచు దుప్పటి




ఇబ్బందులు పడిన వాహనదారులు

ఏజెన్సీ కొత్తగూడ మండలంలో మంగళవారం ఉదయం మంచు దుప్పటి కప్పింది. మంచుతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో మంచు కప్పడంతో ప్రజలు ఆహ్లాదానికి గురయ్యారు.

- కొత్తగూడ (ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి
WWW.ANDHRAJYOTHY.COM
హనుమకొండ సిటీ
HANUMAKONDA CITY ■ బుధవారం 26 నవంబరు 2025



'టీఎన్జీవోల స్థలం కబ్జాలో ప్రజాప్రతినిధులు లేరు'

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ టీఎన్జీవోస్‌కాలనీ 100 ఫీట్ల రోడ్డులోని వెంకటేశ్వర గుడి ఎదురుగా ఉన్న టీఎన్జీవోస్ యూనియన్ స్థలం కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న వారిలో ప్రజాప్రతినిధుల హస్తం ఉందని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, ప్రధాన కార్యదర్శి బైరి సోమయ్య, యూనియన్ కార్యవర్గం మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. యూనియన్‌కు సంబంధించిన విలువైన స్థలంలో ఉన్న గ్రంథాలయాన్ని కొద్ది రోజుల కిందట కబ్జాదారులు కూల్చివేశారన్నారు. ఈ ఘటనపై అప్పట్లో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి విషయం చెప్పామని, స్థలం ఆక్రమణకు గురికాకుండా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని తెలిపారు. ఈ స్థలం విషయంలో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ కూడా సహకరిస్తున్నారని తెలిపారు. కబ్జా వెనుక స్థానిక ప్రజాప్రతినిధులు, వారి బంధువులు, అనుచరులు ఎవరూ లేరని, వారిపై అనవసర అభియోగాలు మోపవద్దని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. స్థలంపై పూర్తి యాజమాన్య హక్కులు టీఎన్జీఓస్ యూనియన్‌వి మాత్రమేనని అన్నారు.

టీబీ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

» కలెక్టర్ స్నేహ శబరీష్ » న్యూశాయంపేట పీహెచ్‌సీ తనిఖీ

న్యూశాయంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : టీబీ నియంత్రణకు వైద్యులు, సిబ్బంది పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. న్యూశాయంపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల గురించి ఈ సందర్భంగా కలెక్టర్ ఆరా తీశారు. ఓపీ నమోదు, ఫార్మసీ, ఆరోగ్య మహిళా రికార్డులను తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎంత జనాభా ఉంటుంది, టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ఎలా నిర్వహిస్తున్నారు, స్ర్కీనింగ్ ఎంత మందికి చేశారు, ఇంకా ఎంత మందికి చేయించాల్సి ఉంది, ఎక్స్‌రే పరీక్షలు శాంపిల్స్ ఎంత మందికి చేయించారు, టెస్టులు చేస్తున్నారా..? అని కలెక్టర్ సంబంధిత వైద్యులను అడగగా వాటి వైద్యులు, సిబ్బంది వివరాలను తెలియజేశారు. ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్, స్టోర్ రూమ్, థియేటర్, ఫీమేల్ వార్డు, ఫార్మసీ గదులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో భవన పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ఆరోగ్య మహిళా క్లినిక్ ఎలా నిర్వహిస్తున్నారనే వివరాలు వైద్య సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో టెస్టులు, ఇతర పరీక్షలను నిర్వహించి వారికి సరైన మందులు. పౌష్టికాహారం, ఆరోగ్య జాగ్రత్తలు పాటించి కోలుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా వైద్య సేవల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన మహిళలతో కలెక్టర్ మాట్లాడి సదుపాయాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, న్యూశాయంపేట పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక, కాజీపేట తహసీల్దార్ భావ్‌సింగ్, ఇతర వైద్యులు, సిబ్బంది ఉన్నారు.



పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్



సదస్సులో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

రామకృష్ణ సేవా సమితి సేవలు భేష్

నగర మేయర్ గుండు సుధారాణి

వడ్డేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవే రామకృష్ణ సేవా సమితి లక్ష్యంగా సాగడం అభినందనీయమని మేయర్ గుండు సుధారాణి అన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో ఆర్యజనని ట్రస్టు, రామకృష్ణ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో నాయిని విశాల్‌రెడ్డి ట్రస్టు సౌజన్యంతో మంగళవారం గర్భిణులకు వర్క్‌షాపులను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు కటంగూరి సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ గుండు సుధారాణి మాట్లాడారు. గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు.

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమారెడ్డి మాట్లాడుతూ.. రామకృష్ణ సేవా సమితి నిస్వార్థ సేవా దృక్పథంతో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు తమ సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయన్నారు. తొలుత నాయిని విశాల్‌రెడ్డి 10వ వర్ధంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులకు డ్రైఫ్రూట్స్ లడ్డూలు కిట్‌లను పంపిణీ చేశారు. శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు శివసుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, గైనకాలజిస్టు సౌమ్య, పిల్లల డాక్టర్ అశోక్‌రెడ్డి, గర్భిణులకు, బాలింతలకు ఆసనాలతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి జయంతి, ఆర్య జనని సమన్వయకులు దశరథం, సేవా సమితి సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, కేవీ రావు, తిరువరంగం ప్రభాకర్, సూర్య, అరుణ్, రాధిక, అంజలిదేవి, సరస్వతి తదితర వలంటీర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

హనుమకొండ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని టీయూసీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొత్తపల్లి రవి అన్నారు. మంగళవారం హనుమకొండ బస్టాండ్ సమీపంలో ఆటో కార్మికులతో సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్మికులు, హక్కులను కాపాడుకునేందుకు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం వరంగల్, హనుమకొండ జిల్లాల కార్యదర్శి చిర్ర సూరి, సహాయ కార్యదర్శి అర్షం అశోక్, పి. శంకరయ్య, వి.శ్రీనివాస్ , వెంకటేశ్వర్లు, రవికుమార్, నాగరాజు, పరమేష్, నన్ని, నగేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

వరంగల్ క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 18 మందిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ ఇద్దరికి జైలుశిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. మిగతా 16 మందికి రూ.19,300 జరిమానా విధించిందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని ఆరుగురికి రూ.3,400, మైనర్ డ్రైవింగ్ నలుగురికి రూ.2,000 జరిమానాను న్యాయమూర్తి విధించారన్నారు.

వ్యాయామ విద్య ప్రాధాన్యతను గుర్తించాలి

కేయూ క్యాంపస్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యాయామ విద్యా పితామహుడు ఫ్రెడ్‌రిచ్ జాన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్య వికాసానికి తీవ్ర కృషిచేశారని కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భాస్కర్ కొనియాడారు. మంగళవారం కేయూ వ్యాయామ విద్య కళాశాలలో వ్యాయామ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యాయమ విద్య పితామహుడు ఫ్రెడ్‌రిచ్ జాన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమావేశంలో ప్రిన్సిపాల్ భాస్కర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫ్రెడ్‌రిచ్ జాన్ వ్యాయామ విద్య వికాసానికి కృషిచేశారని వివరించారు. సమాజంలో వ్యాయామ విద్యతో శారీరక వికాసం పెరుగుతోందని అన్నారు. సిలబస్ రూపకల్పన అందరి అవసరాలను గుర్తించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ జోత్స్న, ఎస్.కుమారస్వామి, ఎస్.కిరణ్‌కుమార్‌గౌడ్, సుమన్ నమిలే, మహ్మద్ లాల్ సాహెబ్ పాషా, జరుపుల పల్లవి, చీమల బుచ్చయ్య, మిట్టగడపల అన్వేశ్‌తో పాటు ఎంపీఈడీ, బీపీఈడీ విద్యార్థులు పాల్గొన్నారు.



ఫ్రెడ్‌రిచ్ జాన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు

జీవో 12ను సవరించాలి

కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల నాయకుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సుబేదారి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేస్తున్న 4 ఇన్సూరెన్స్ పథకాలను ప్రయివేట్ కంపెనీలను అప్పగిస్తూ విడుదల చేసిన జీవో 12ను తక్షణమే సవరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఉప్పలయ్య అన్నారు. మంగళవారం సీఐటీయూ, ఏఐటీయూసీ, బీఎన్‌ఆర్‌కేఎస్, ఏఐసీటీయూ, టీఎన్‌టీవీసీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ.. కార్మికశాఖలో జరుగుతున్న అవినీతిని అరికట్టి, అవినీతికి పాల్పడుతున్న వారిపై చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు వ్యతిరేకంగా ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు కార్మికుల సొమ్మును దోచి పెడుతుందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో సమర్పించారు. ఈ కార్యక్రమంలో మూల వీర నర్సింహులు, పి.అశోక్, మంద మల్లేశం, అజీమోద్దీన్, రవీందర్, మంద భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విజయ గణపతి కల్యాణోత్సవం

హనుమకొండ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ విద్యారణ్యపురిలోని విజయ గణపతి ఆలయ 23వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, ఆరాధనలు నిర్వహించి మధ్యాహ్నం శ్రీసిద్ధిబుద్ధి సహిత విజయగణపతి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయసారథి, గిరిష్‌శర్మల వేదమంత్రాల మధ్య మంగళ వాయిద్యాలతో వందలాది భక్తుల సమక్షంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు గణపతిహోమం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు డాక్టర్ ఎన్‌వీఎన్.చారి, రఘుపతిరావు, మధుసూదన్‌రావు, పరాంకుశం వెంకటకృష్ణ, నర్సయ్య, పాండురంగారావు, రవీందర్, అంబరీష్ తదితరులు పర్యవేక్షించారు. సాయంత్రం వేడుకల్లో భాగంగా పల్లకిసేవ నిర్వహించి స్వామివారికి మంత్రపుష్ప నిరాజనాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలి'

మడికొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మన్నె చంద్రయ్య అన్నారు. మంగళవారం కాజీపేట మండలం కడిపికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కాజీపేట మండల ప్రైమరీ ఉపాధ్యాయుల ఇంగ్లీష్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులకు ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచుకాల లింగారావు, పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు మాల కొండారెడ్డి, డీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యాయులు యమునాదేవి, అరుణ, శోభారాణి, వాణి, కవిత, రజిత, ఇందుప్రియ, సంజన, రేష్మ, అయిలమ్మ, స్వరూప, లక్ష్మి, మాధవి, వంశీకృష్ణ, నితిన్ పాల్గొన్నారు.

మనువాదాన్ని మట్టుపెడుదాం..

డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్‌కుమార్



అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న డీబీఎఫ్ నేతలు

వడ్డేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగాన్ని ఎత్తిపట్టి, మనువాద సంస్కృతిని మట్టుపెడుదామని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అన్నారు. మంగళవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నవంబరు 26 నుంచి జనవరి 26 వరకు నిర్వహించే భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని ప్రారంభించాలని, ఎస్సీలకు రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేయూ జాక్ చైర్మన్ డాక్టర్ మంద వీరస్వామి, డీబీఎఫ్ నేతలు బౌతు రాధ, రమ, భాగ్య, గుగులోతు కౌసల్య, దుర్గం పుష్పలత, స్వామి, రాజు, కిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో విశాల్‌రెడ్డి వర్ధంతి

కాజీపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్‌లో మంగళవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తనయుడు నాయిని విశాల్ రెడ్డి వర్ధంతి కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ నాయకులు పసునూరి మనోహర్ ఆధ్వర్యంలో జయలక్ష్మి ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గబ్బెట ఎల్లేష్, కె.శ్రీనివాస్, బి.రాము, కె.రమేశ్ కుమార్, ఎర్ర శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సుబ్రమణ్యేశ్వరస్వామి కల్యాణం

హనుమకొండ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయంలో బుధవారం సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకొని శ్రీవల్లీ దేవసేన సుబ్రమణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో అనిల్ కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కల్యాణంలో రూ.200 చెల్లించి సంప్రదాయ దుస్తులతో దంపతులు పాల్గొనాలని ఆయన సూచించారు. సంతానలేమితో పాటు సకల సౌభాగ్యాలను ఆకాంక్షించి లోక కల్యాణార్థం శ్రీవల్లీ దేవసేన కల్యాణోత్సవంతో పాటు హోమాన్ని కూడా నిర్వహింపజేస్తున్నట్లు చెప్పారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వెంకయ్య

కేయూ క్యాంపస్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థులతో శారీరక, మానసికోల్లాసం కలుగుతోందని కేయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ వై.వెంకయ్య అన్నారు. మంగళవారం కేయూ మహిళ ఇంజనీరింగ్ విద్యార్థులకు కళాశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలను వెంకయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో విద్యార్థులలో మానసిక, శారీరక, ఉల్లాసంతోపాటు ధైర్యం లభిస్తోందని చెప్పారు. క్రీడలతో విద్యార్థులకు మంచి ఆరోగ్యం, క్రమశిక్షణ, అలవడుతోందని అన్నారు. ప్రిన్సిపాల్ భిక్షాలు మాట్లాడుతూ.. ఏటా విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహిస్తామని, వర్సిటీ తరపున రాష్ట్రస్థాయితో పాటు జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణిస్తున్నారని చెప్పారు. త్రోబాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, రన్నింగ్ పోటీలను నిర్వహిస్తామని స్పోర్ట్స్ ఇన్‌చార్జి తూర్పాటి వెంకటేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, అర్చన, సురేందర్, సాయి తరుణ్, వైష్ణవి, యశస్విని, వీణ, దీప్తి, రచన, శ్రీజ, పూర్ణ చందర్, నాన్ టీచింగ్ సిబ్బంది యాదగిరి, సుమన్, సాయి, శాగంటి శ్రీనివాస్, జ్యోతి, లావణ్య, చైతన్య, ఫిరోజ్, తాజ్ బాబా, ఆటల కోఆర్డినేటర్లు శివాని, అక్షయ, విజయలక్ష్మి, శ్రావ్య, తనిష్క, సాహిత్య, శ్రీహర్షిణి, అక్షయ, చిన్మయి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగట్టు దేవస్థానం భూమి పరిశీలన



ఆలయ భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్ తదితరులు

హసన్‌పర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎర్రగట్టు దేవస్థానం భూమిని కొంత మంది వ్యక్తులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి కబ్జా చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదేశాల మేరకు హసన్‌పర్తి తహసీల్దార్ కిరణ్‌కుమార్ మంగళవారం ఎర్రగట్టుదేవస్థానం భూమిని పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పరిశీలిచేందుకు వచ్చిన తహసీల్దార్‌కు మండల కాంగ్రెస్ నాయకులు, దేవస్థానం కమిటీ సభ్యులు కబ్జాకు ప్రయత్నిస్తున్న భూమి వివరాలను తెలియజేశారు. దేవస్థాన భూమి సర్వే నెం.127లో ఉందని చూపించే రికార్డులను చూసి పూర్తి వివరాలతో కూడిన పత్రాలను అందిస్తామని కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్‌కు హామీ ఇచ్చారు. కొంత మంది సర్వే నెంబర్ 137గా చిత్రీకరించి దేవస్థాన భూమిని కబ్జా చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను రెవెన్యూ అధికారులు తిప్పికొట్టాలని కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్‌ను కోరారు. తహసీల్దార్ వెంట దేవస్థానం కమిటీ చైర్మన్ ఆరెపల్లి వెంకటస్వామి, మాజీ చైర్మన్ జన్ను రవీందర్, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, కోడెల మురళి, గొర్రె కిరణ్, సాంబయ్య, జీపీవో వనమ్మ ఉన్నారు.

లింగబలిజలను ఓబీసీలో చేర్చాలి

వడ్డెపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సామాజికంగా వెనుకబడిన లింగబలిజ సామాజిక వర్గాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలని వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దినేష్ పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని రాజరాజేశ్వర స్వామి ఆలయంలో హనుమకొండ జిల్లా వీరశైవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.వీరసోమయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లింగబలిజ కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రప్రభుత్వానికి సిఫారస్ చేస్తూ లేఖ రాయాలని కోరారు. వరంగల్‌లో మహాత్మా బసవేశ్వరుడి విగ్రహం ఏర్పాటుతో పాటు రుద్రభూమి ఏర్పాటుకు కృషి చేస్తానని దినేష్ పటేల్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని శివాలయాల్లో అర్చకులుగా జంగమ సమాజానికి చెందిన వారిని నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈడబ్ల్యూఎస్ ధృవీకరణ పత్రాలను లింగబలిజలకు జారీ చేసే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో లింగశైవ లింగాయత్ లింగబలిజ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పి. ఈశ్వరయ్య, గౌరీశంకర్, జిల్లా మాజీ అధ్యక్షులు నానెం రాజయ్య, ఉప్పు భాస్కర్‌రావు, జిల్లా నాయకులు ప్రవీణ్, బత్తుల రాజయ్య, మఠం రాజేష్, సురేష్, రాజశేఖర్, సోమేశ్వర్, మహేశ్, ఉమామహేశ్వర్, నాగరాజు, గౌరి, రజిత, శోభ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దినేష్ పటేల్

(5వ పేజీ తరువాయి)

పంచాయతీ షురూ..

జరుగుతాయి. 180 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కమలాపూర్ మండలంలో 24 జీపీల్లో. 246 వార్డుల్లో జరుగుతాయి. 246 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు

● రెండో విడత ఎన్నికలు ధర్మసాగర్, హసన్‌పర్తి, ఐనవోలు, వేలేరు, పరకాల మండలాల్లో జరుగుతాయి. వీటిలోని మొత్తం 73 జీపీలు, 8,694 వార్డుల్లో జరుగుతాయి. ఇందుకోసం 694 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ధర్మసాగర్ మండలంలో 19 జీపీలు, 186 వార్డుల్లో ఎన్నికలు జరుగుతాయి. 186 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. హసన్‌పర్తి మండలంలో 15 జీపీలు, 138 వార్డుల్లో ఎన్నికలు జరుగుతాయి. 138 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐనవోలు మండలంలో 17 జీపీలు, 170 వార్డుల్లో ఎన్నికలు జరుగుతాయి.

170 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వేలేరు మండలంలో 12 జీపీలు, 106 వార్డుల్లో ఎన్నికలు జరుగుతాయి. 106 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరకాల మండలంలో 10 జీపీలు, 94 వార్డుల్లో ఎన్నికలు జరుగు తాయి. 94 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

● మూడో విడత ఎన్నికలు ఆత్మకూరు, దామెర, నడికూడ, శాయంపేట మండలాల్లో జరుగుతాయి. వీటి పరిధిలోని 68 జీపీలు, 634 వార్డుల్లో ఎన్నికలు జరుగుతాయి. ఇందుకోసం 634 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆత్మకూరు మండలంలో 16 జీపీలు, 152 వార్డుల్లో ఎన్నికలు జరుగుతాయి. ఇందుకు 152 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దామెర మండలంలో 14 జీపీలు, 132 వార్డుల్లో ఎన్నికలు జరుగుతాయి. 132 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నడికూడ మండలంలో 14 జీపీలు, 138 వార్డుల్లో ఎన్నికలు జరుగుతాయి. ఇందుకోసం 138 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. శాయంపేట మండలంలో 24 జీపీలు, 212 వార్డుల్లో ఎన్నికలు జరుగుతాయి. 212 కేంద్రాలను ఏర్పాటు చేశారు.

భద్రతా ఏర్పాట్లు

పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసే దిశగా చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. తొలుత జిల్లాలోని సమస్యాత్మక గ్రామ పంచాయతీలను గుర్తించారు. గత ఎన్నికల సందర్భంగా ఘర్షణలు చోటుచేసుకున్న జీపీలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. గ్రామాల్లో నేరచరిత ఉన్న వారి జాబితాలను సేకరిస్తున్నారు. ఎన్నికల సమయంలో వారిపై నిఘా వేయనున్నారు.

ఆంధ్రజ్యోతి

నవ్య

కుటుంబ కదంబం

బుధవారం • 26 నవంబరు 2025

వేడుకల్లో లెహంగా, శారీస్‌ను ఎంచుకోడానికి వెనకాడేవారు నిరభ్యంతరంగా షరారాలను ఎంచుకోవచ్చు. సౌకర్యం, స్టైల్‌కు పెద్ద పీట వేసే డిజైనర్ షరారాలు అన్ని వేడుకలకూ అనువుగా ఉంటాయి. తాజాగా ట్రెండ్ అవుతున్న వాటి మీద ఓ లుక్కేద్దాం!

షరారా షరారా









పండుగలు, పెళ్లిళ్లు, పుట్టిన రోజు వేడుకలు.. ఇలా అన్ని రకాల వినోదాల్లో ధరించడానికి వీలుండే దుస్తులు.. డిజైనర్ షరారాలు. ప్రస్తుతం ఇవి ట్రెండ్‌గా మారాయి. డిజైనర్లు ఆధునికత ఉట్టిపడే డిజైనర్ వెర్షన్లను రూపొందిస్తూ ఉండడంతో, కొత్త కొత్త హంగులతో, ఫ్యూజన్ స్టైల్స్‌తో షరారాలు మహిళల మనసులను దోచుకుంటున్నాయి. మరీ ముఖ్యంగా వధువులు కూడా రిసెప్షన్స్, ఎంగేజ్‌మెంట్ ఫంక్షన్ల కోసం డిజైనర్ షరారాలనే ఎంచుకుంటూ ఉండడం చెప్పుకోదగిన విశేషం. జారుతున్నట్టు క నిపించే మెటీరియల్స్, రిల్యాక్స్‌డ్ ఫిట్టింగ్స్‌తో రూపొందుతున్నాయి కాబట్టి వీటిని ధరించడమూ సులభమే! ప్రత్యేకించి లెహంగాలతో పోలిస్తే షరారాలతో రెట్టింపు సౌకర్యం ఉంటుంది.

తాజా ట్రెండ్స్ ఇవే!

- ఎంబ్రాడిరీ, అద్దం పనితనం: సంక్లిష్టమైన ఎంబ్రాయిడరీ, అద్దం పనితనంతో కూడిన షరాలు తాజా ట్రెండ్‌గా మారాయి
- ప్రింటెడ్ డిజైన్లు కూడా బాగా ఆదరణ పొందుతున్నాయి
- చందేరి, ఇతరత్రా తక్కువ బరువుండే వస్త్రాలతో రూపొందే షరారాలు ప్రత్యేకించి వేసవి వస్త్రాలుగా పేరు తెచ్చుకుంటున్నాయి
- సంప్రతాయ, సమకాలీన స్టైల్స్‌ను మేళవించి, రూపొందిస్తున్న డిజైనర్ షరారాలు ఆధునిక ఫ్యూజన్ ఛాయిస్‌గా పేరు తెచ్చుకంటన్నాయి.

అదనపు హంగులు జోడించి...

షరారాలతో భారీ ఆభరణాలు చాలా బాగా నప్పుతాయి. ఈ దుస్తుల కోసం చాంద్‌బాలీ, కంగన్ లేదా కడా లాంటి ఆభరణాలు ఎంచుకోవచ్చు. చమ్కీ పనితనానికి రాళ్ల నగలు చక్కగా నప్పుతాయి. హైహీల్స్ లేదా బ్లంట్ హీల్స్ ధరించాలి.

పశువుల్లో కృత్రిమ గర్భధారణపై పాడి రైతులకు అవగాహన కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్నారు చాకలి అనురాధ. నంద్యాల జిల్లా చింతకుంటలో జూనియర్ వెటర్నరీ అధికారి అయిన ఆమె.. తన సేవలకు గుర్తింపుగా 'జాతీయ గోపాలరత్న' పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం నుంచి నేడు అందుకోబోతున్నారు. "పాడి పరిశ్రమ అభివృద్ధికి రైతుల్లో చైతన్యమే మార్గం" అంటున్న అనురాధను 'నవ్య' పలకరించింది.

ఈ అనురాధ గోపాల మిత్ర



"నా స్వస్థలం ప్రస్తుత నంద్యాల జిల్లా గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామం. నా తల్లిదండ్రులు చాకలి లక్ష్మీదేవి, సుబ్బారాయుడు. వారిది రజక వృత్తి. పేదరికం వల్ల మేము ఎన్నో ఇబ్బందులు పడ్డాం. నేను పదో తరగతి వరకూ మా ఊరిలోనే చదువుకున్నాను. నంద్యాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేశాను. నా మేనమామ రవిశంకర్‌తో నా వివాహం అయింది. మాకు ఇద్దరు పిల్లలు... రిషిత, యోగీశ్వర్. నా భర్త ప్రోత్సాహంతో 2004లో వెటర్నరీ అసిస్టెంట్ పోస్టు కోసం పరీక్ష రాశాను. సుమారు 350 మంది పోటీ పడితే... ఎంపికైన ఆరుగురిలో నేనొకరిని. శిక్షణ తరువాత, 2006లో... బండి ఆత్మకూరులో కాంట్రాక్ట్ విధానంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాను. రెండేళ్ల తరువాత ఉద్యోగం రెగ్యులర్ అయింది. ఆ తరువాత గడివేముల మండలం బిలకలగూడూరులోని రూరల్ లైవ్ స్టాక్ యూనిట్‌లో (ఆర్ఎల్‌యూ) లైవ్ స్టాక్ అసిస్టెంట్‌గా పని చేశాను. 2019లో జూనియర్ పశువైద్యాధికారి (జేవీఓ)గా పదోన్నతి పొందాను. ఆరేళ్లపాటు మహానంది మండలం గోపవరంలో పని చేశాను.

'త్రిపుల్-ఎస్ అనురాధ' అంటారు

ఆ సమయంలోనే కేంద్ర ప్రభుత్వం 'సెక్స్-సోర్టెడ్ సెమెన్ ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్' (త్రిపుల్ ఎస్ఏఐ)' విధానాన్ని అమలు చేసింది. ఈ విధానం పాడి రైతులకు ఉపయోగకరం. దాని గురించి రైతుల్లో అవగాహన కల్పించడానికి క్షేత్రస్థాయిలో అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాను. ఎన్నో పశువులకు కృత్రిమ గర్భధారణ ప్రక్రియ నిర్వహించాను. మూడేళ్లలో 345 వరకూ మేలు జాతి ఆడ దూడలు నా పర్యవేక్షణలో జన్మించాయి. ఎక్కువ కృత్రిమ గర్భధారణలు నిర్వహించడంతో నన్ను మా శాఖలో 'త్రిపుల్ ఎస్ అనురాధ' అంటారు. నేను అందించిన సేవలకు ఇలాంటి ప్రత్యేక గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. అలాగే... పశువులను సమయానుగుణంగా వాక్సినేషన్ లాంటి కార్యక్రమాలు కూడా పెద్ద ఎత్తున చేపట్టాను. ఈ ఏడాది జూన్ నెలలో గోస్పాడు మండలం చింతకుంటకు బదిలీపై వచ్చాను. విధుల్లో నేను అందించిన సేవలకు గుర్తింపుగా... 2021లో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయిలో, 2023లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉద్యోగి పురస్కారాలను, ఈ ఏడాది ఆగస్టు 15న జిల్లా స్థాయిలో ఉత్తమ ఉద్యోగి ప్రశంసా పత్రాన్ని అందుకున్నాను. ఇప్పుడు జాతీయ స్థాయిలో అవార్డు అందుకోబోతున్నాను.

వారి ప్రోత్సాహంతో...

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది 'జాతీయ గోపాలరత్న' అవార్డులు ప్రదానం చేస్తుంది. మూడు కేటగిరీల్లో... ఒక్కొక్క దానికి మూడు చొప్పున మొత్తం తొమ్మిది అవార్డులు అందిస్తారు. ఈ ఏడాది వీటికోసం 2,018 మంది పోటీ పడ్డారు. 'ఉత్తమ కృత్రిమ గర్భధారణ నిపుణుల విభాగం'లో నాకు మూడో స్థానం లభించినట్టు ఈ నెల 17న ప్రకటించారు. దాన్ని నేడు (బుధవారం) ఢిల్లీలోని సుష్మాస్వరాజ్ భవన్‌లో అందుకోబోతున్నాను. ఈ పురస్కారంతో నంద్యాల జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కిందని అందరూ చెబుతూ ఉంటే సంతోషంగా అనిపిస్తోంది. చదువులో నా తల్లిదండ్రులు, ఉద్యోగ ప్రయత్నంలో నా భర్త సహకారంతోనే ఈ స్థాయికి వచ్చాను. ఉద్యోగపరంగా వైద్యులు, అసిస్టెంట్ డైరెక్టర్లు, జిల్లా అధికారులు ఎంతగానో ప్రోత్సహించడంతో.. విధుల్లో చురుకుగా పని చేసి, రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించగలిగాను. ఎక్కువ సంఖ్యలో కృత్రిమ గర్భధారణలకు దోహదం చేశాను. వాటన్నిటి ఫలితమే ఈ పురస్కారం. ఇదే స్ఫూర్తితో.. భవిష్యత్తులో పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తాను."

• చదువుల గోపాలకృష్ణ
నంద్యాల

సవాళ్లను స్వీకరించడం... అపజయాలను పాఠాలుగా మలుచుకోవడం... లక్ష్యం చేరేవరకు పట్టుదలగా ప్రయత్నించడం... ఇవే ఒక యోధుడిని తయారు చేస్తాయి. అందుకు నిలువెత్తు నిదర్శనం... అనుపమా రామచంద్రన్. కఠిన పరీక్షలు ఎదురైనప్పుడు వెనకడుగు వేయకుండా... క్లిష్ట సమయాల్లో ఒత్తిడికి చిత్తవకుండా... ఆత్మస్థైర్యంతో అందలాన్ని అందుకుంది. ఇటీవల ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్ గెలిచిన 23 ఏళ్ల అనుపమ... ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళగా చరిత్ర సృష్టించి... నవ శకానికి నాంది పలికింది.



ఆమె సంకల్పం.. 'అనుపమా'నం

ఖతర్ రాజధాని దోహా... ఐబీఎస్ఎఫ్ ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్... అంతిమ సమరం... ప్రత్యర్థి ఎంగ్ఆన్ యీ... మూడుసార్లు ప్రపంచ చాంపియన్. ఎన్నో ఏళ్లగా నెంబర్ వన్ ర్యాంకర్. కేవలం నైపుణ్యాన్ని మాత్రమే కాకుండా ధైర్యాన్ని పరీక్షించే మ్యాచ్. చివరి ఫ్రేమ్. 2-2 వద్ద విజయం ఊగిసలాడుతోంది. అనుపమా రామచంద్రన్ చేతిలో క్యూ. నవచరిత రాయడానికి షాట్ దూరం. ఒక్క క్షణం ఆగి.. ఆమె గట్టిగా ఊపిరి పీల్చుకుంది. ఒత్తిడిలోకి వెళ్లకుండా తనను తాను స్థిమితంగా ఉంచుకుంది. ఏకాగ్రతతో, పూర్తి నమ్మకంతో షాట్ కొట్టింది. బంతి పాకెట్‌లోకి దూసుకుపోయింది. ఆ ప్రాంతమంతా చప్పట్లు, జయజయ ధ్వానాలతో మార్మోగింది. భారత్‌లో మొట్టమొదటిసారి ఒక మహిళ ప్రపంచ స్నూకర్ చాంపియన్‌గా అవతరించింది. అయితే ఈ గెలుపు అనుపమకు అంత సులువుగా దక్కలేదు. దీని వెనుక నిరంతర కృషి ఉంది. సడలని సంకల్పం ఉంది. దీనికి బలమైన పునాది 2015లో పడింది.

వేసవి క్యాంపుతో...

చెన్నైలో పుట్టి పెరిగిన అనుపమ కోరి స్నూకర్‌ను ఎంచుకోలేదు. ఆట మొదలుపెట్టేవరకూ దానిపై అసలు దాని గురించి తెలియదు. "అప్పుడు నాకు పదమూడేళ్లు. మా ఇంటికి దగ్గర్లో 'మైలాపూర్ క్లబ్' ఉంది. సెలవులు కావడంతో క్లబ్‌లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. అక్కడ చెస్, స్నూకర్ మాత్రమే ఉన్నాయి. చెస్ ఇంట్లో ఆడుతూనే ఉంటాను కాబట్టి, స్నూకర్ నేర్చుకోవాలని అనుకున్నా. అంతే కాదు... ఆకుపచ్చని బోర్డు, రంగురంగుల బాల్స్, చేతిలో క్యూ... చూడగానే నన్ను బాగా ఆకట్టుకున్నాయి. ఎలా ఆడతారో తెలుసుకోవాలన్న ఆసక్తి ఎక్కువైంది. క్యాంపులో చేరాక అందులో లీనమైపోయాను. కోచ్ లో... నా ప్రతిభను చూసి స్నూకర్ కొనసాగించమని చెప్పారు" అంటూ చిన్ననాటి రోజులు గుర్తు చేసుకున్న అనుపమ... వేసవి శిబిరం పూర్తవగానే ప్రొఫెషనల్ కోచింగ్‌లో చేరింది.

అందుకే ప్రత్యేకం

చిన్నప్పుడు కోచ్‌లు అనుపమలో గుర్తించినవి... సడలని ఏకాగ్రత, ఓపిక. సాధారణంగా ఆ వయసు పిల్లల్లో ఈ లక్షణాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. వీటిని అలవర్చుకోవడానికి చాలామంది ఆటగాళ్లకు సంవత్సరాలు పడుతుందనేది శిక్షకుల మాట. అందుకే ఆమెను ప్రత్యేక ప్రతిభ గల అమ్మాయిగా పరిగణించారు. ఆ స్థాయిలోనే శిక్షణ ఇచ్చారు.



స్పోర్ట్స్ పెర్‌ఫార్మెన్స్ స్పెషలిస్టు, తన మామయ్య అయిన కె.నారాయణన్ మార్గదర్శకత్వంలో అనుపమ ఆటలో మరింత పరిణతి సాధించింది. ఆయన నేతృత్వంలో సాంకేతిక అంశాలను ఆకళింపు చేసుకుంది. వ్యూహాలు నేర్చుకుంది. క్లిష్ట సమయాల్లో ఒత్తిడిని ఎలా జయించాలో, మనోధైర్యంతో అడుగులు ముందుకు ఎలా వేయాలో తెలుసుకుంది. నిరంతర సాధనతో పరిపూర్ణ క్రీడాకారిణిగా తనను తాను తీర్చిదిద్దుకుంది.

మలుపు తిప్పిన గెలుపు

స్నూకర్, ఇంగ్లీష్ బిలియర్డ్స్‌లో ఎంతో పరిణతి సాధించిన అనుపమ.. జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ అదరగొట్టింది. ఏకంగా ఎనిమిది జాతీయ జూనియర్ టైటిల్స్ నెగ్గిన ఆమె కెరీర్‌ను 2017లో రష్యాలో జరిగిన 'వరల్డ్ ఓపెన్ అండర్-16 స్నూకర్ చాంపయిన్‌షిప్' మలుపు తిప్పింది. అంచనాలు తలకిందులు చేస్తూ విజేతగా నిలిచింది. దాంతో అనుపమ సీనియర్ విభాగంపై కూడా దృష్టి పెట్టింది. 2023లో 'ప్రపంచ మహిళల అండర్ 21 స్నూకర్' టైటిల్ సాధించింది. మరుసటి ఏడాది 'యూఎస్ ఉమెన్స్ ఓపెన్'లో రన్నరప్‌గా నిలిచి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దాంతో ఈ ఏడాది ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానం దక్కించుకుంది. ఆమె కెరీర్ ఇదే అత్యున్నత ర్యాంక్.

ప్రపంచ చాంపియన్..

చిన్న వయసులోనే ఎన్నో మైలురాళ్లను అధిగమించిన అనుపమ.. చదువును అశ్రద్ధ చేయలేదు. చెన్నైలోని 'విద్యా మందిర్ సీనియర్ సెకండరీ స్కూల్‌'లో చదివిన ఆమె, ప్రస్తుతం వైష్ణవ్ మహిళా కళాశాలలో పబ్లిక్ పాలసీలో పీజీ చేస్తోంది. అంతర్జాతీయ స్థాయి పోటీపడుతూనే... అటు ఆటను, ఇటు చదువును సమన్వయం చేసుకొంటోంది. ఇక ఈ నెల రెండో వారంలో దోహాలో జరిగిన 'ఐబీఎస్ఎఫ్ ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్'లో టాప్ ర్యాంకర్‌ను ఓడించి నవ శకానికి నాంది పలికింది. భారత్‌ను చాంపియన్‌గా నిలబెట్టింది. ఈ గెలుపు ఆమెది మాత్రమే కాదు... ఈ క్రీడలో రాణించాలని కలలు కనే అమ్మాయిలు అందరిదీ. భారతీయ స్నూకర్‌ది. నిశ్శబ్దంగా, ఓపికగా, పట్టుదలగా, ఒక్కో అడుగు ముందుకు వేస్తూ... శిఖరాగ్రానికి చేరిన దృఢ సంకల్పానిది.

ముఖానికి నెయ్యి రాస్తే...



ఆరోగ్యంతోపాటు చర్మ సౌందర్యాన్ని పెంపొందించడంలో నెయ్యి కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ముఖానికి నెయ్యి రాసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం...

- వయసు పెరిగే కొద్దీ ముఖం మీద ముడుతలు, గీతలు ఏర్పడుతుంటాయి. వీటిని నివారించేందుకు యాంటీ ఏజింగ్ క్రీమ్‌లు, మాయిశ్చరైజర్లు వాడేబదులు ముఖానికి నెయ్యి రాసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. నెయ్యిలో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు చర్మానికి పోషణను అందించే ఎ, డి, ఇ, కె విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. దీంతో చర్మం మృదువుగా కాంతివంతంగా మారుతుంది.
- నెయ్యిని ముఖానికి పట్టించి చేతి వేళ్లతో సున్నితంగా వృత్తాకారంలో మర్దన చేయాలి. దీనివల్ల చర్మానికి రక్తప్రసరణ పెరుగుతుంది. చర్మకణాలు వృద్ధి పొందుతాయి. దీంతో చర్మానికి సహజసిద్ధమైన మెరుపుదనం చేకూరుతుంది. ముఖానికి మేకప్ అవసరం రాదు.
- వాతావరణ కాలుష్యం, ఎండ, దుమ్ము, ధూళి వల్ల ముఖం మీద మొటిమలు, మచ్చలు, దద్దులు, ట్యానింగ్ లాంటి సమస్యలు ఏర్పడుతుంటాయి. అలాంటప్పుడు బయటి నుంచి రాగానే ముఖాన్ని గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకుని కొద్దిగా పేరిన నెయ్యి రాసుకుంటే చాలు. మునుపటి నిగారింపు వచ్చేస్తుంది. నెయ్యిలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మాన్ని సంరక్షిస్తాయి.
- రోజూ రాత్రి పడుకునేముందు ముఖానికి నెయ్యి రాసుకుంటూ ఉంటే చర్మం తేమతో నిండుతుంది. ముఖం ఛాయగా మెరుస్తుంది కూడా.
- చిన్న గిన్నెలో ఒక చెంచా నెయ్యి, పావు చెంచా పసుపు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చూపుడు వేలితో కొద్ది కొద్దిగా తీసుకుంటూ ముఖానికి పట్టించాలి. పావుగంటసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకుంటే ముఖం ప్రకాశవంతంగా కనిపిస్తుంది.

87 ఏళ్ల వయసులో స్కూటర్ నడపడమే కాదు, షోలే సినిమాను తలపించేలా చెల్లిని వెంటేసుకుని మరీ రయ్యిన దూసుకుపోతున్నారు అహ్మదాబాద్‌కు చెందిన మందాకినీ షా. మహిళా మండళ్లు, పంచాయితీ సమావేశాలతో నిరంతరం బిజీ బిజీగా ఉండే మందాకిని, సమాజ సేవ గురించీ, స్కూటర్‌తో ఏర్పడిన అనుబంధం గురించి ఇలా వివరిస్తున్నారు...

బైకర్ బామ్మ..!



"నా పేరు మందాకినీ షా. నాకు 87 ఏళ్లు. చెల్లెలు ఉషతో కలిసి, స్కూటర్ మీద చక్కర్లు కొట్టడమంటే నాకు చాలా ఇష్టం. నేను అహ్మదాబాద్‌లోనే పుట్టి పెరిగాను. మేం ఐదుగురం అక్కాచెల్లెళ్లం. మాకొక తమ్ముడు కూడా ఉన్నాడు. అందర్లోకీ నేనే పెద్దదాన్ని కాబట్టి జీవితపాఠాలను ఎంతో ముందుగానే నేర్చేసుకున్నాను. స్వాతంత్రసమరయోధుడైన నాన్న, నా చిన్నతనంలో ఏదో ఒక వ్యాపారంలో స్థిరపడాలని పరితపించేవారు. కానీ అందుకు సరిపడా డబ్బు మా దగ్గర ఉండేది కాదు. దాంతో వ్యాపారం చేయలేకపోయారు. అమ్మ ఎంతో కష్టపడి మమ్మల్ని పెంచింది. ఆమె కష్టాన్ని చూస్తూ పెరిగానేమో, వీలైనంత త్వరగా నా కాళ్ల మీద నేను నిలబడాలని నిర్ణయించుకున్నాను. అందుకే కాలేజీ చదువు వద్దనుకుని, బడి చదువు పూర్తవగానే ఉద్యోగంలో చేరిపోయాను. అలా 16వ ఏట బాలమందిర్‌లో టీచర్‌గా పని చేయడం మొదలుపెట్టాను.

సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటూ..

నాకు ఇంగ్లీషు అంతగా రాదు. కానీ జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదల బలంగా ఉండేది. దాంతో సమాజ సంక్షేమ పథకాల్లో చేరిపోయాను. మహిళా మండళ్లను కలుస్తూ, పంచాయితీ సమావేశాల్లో పాల్గొంటూ మహిళా హక్కుల గురించి బోధించడం మొదలుపెట్టాను. అలా దుమ్ము లేచే రోడ్ల మీద వేర్వేరు చోట్లకు ప్రయాణాలు చేసే క్రమంలో, స్కూటర్, జీప్ నడపడం నేర్చేసుకున్నాను. ఆ తర్వాత ఒక సెకండ్ హ్యాండ్ స్కూటర్ కొనుక్కున్నాను. స్కూటర్ చేతిలో ఉంటే, ప్రయాణాలకు వెనకాడే పరిస్థితి ఉండదు. అయితే పెద్ద వయసులో ఒక మహిళ స్కూటర్ నడపడమన్నది ఆశ్చర్యకరమైన విషయమే! అందరూ వింతగా చూసేవారు. అక్కడితో ఆగితే ఫరవాలేదు. చాలా ఏళ్ల పాటు నన్నొక ప్రశ్నతో ఇబ్బంది పెట్టారు.

16 ఏళ్ల యువతిలా...

'మీకు పెళ్లి కాలేదా? మీరు విధవా?" అనే వాళ్ల ప్రశ్న నన్ను చాలా కాలం ఇబ్బంది పెట్టింది. వాళ్లకు.. ఒక ఒంటరి మహిళ, ముగియని కథ లాంటిది. కానీ నిజానికి నా కథ కాస్త ఆలస్యంగా మొదలైందనే విషయం వాళ్లకు తెలియదు. ఒకానొక సందర్భంలో నేను కూడా పెళ్లి చేసుకోవాలనుకున్నాను. కానీ మనం అనుకున్నట్టు సాగితే అది జీవితం ఎలా అవుతుంది? అందుకే జీవితంతో రాజీ పడిపోయాను. ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికీ... 'అమ్మా మీరు స్కూటర్ ఎందుకు నడుపుతున్నారు?' అని అడుగుతూ ఉంటారు. ఆ ప్రశ్నకు చిరునవ్వే నా సమాధానం. స్కూటర్ నడుపుతున్నప్పుడు ముఖాన్ని స్పృశించే గాలి, నన్ను 16 ఏళ్ల యువతిననే భావనకు లోను చేస్తుందని ఎంతమందికి చెప్పను? వయసు నాలో సత్తువను తగ్గిస్తూ ఉండవచ్చు. కానీ మనసులో పట్టుదలను సడలించలేకపోయింది. నేనిప్పటికీ చెల్లి ఉషను వెంటబెట్టుకుని వేర్వేరు ఊర్లు తిరుగుతూ ఉంటాను. ప్రతిరోజూ స్నేహితులను కలుసుకుంటూ ఉంటాను. ఆటపాటలతో కాలక్షేపం చేస్తూ ఉంటాను. 80ల్లో ఉన్నాను కాబట్టి ఇక్కడితో నా కథ కంచికే అనుకుంటే పొరపాటు, సమాజం ఊహించని జీవితం జీవించాను. నా కథ ముగియడానికి ఇంకా ఎంతో సమయం మిగిలిఉంది."

హెల్త్ వర్సిటీ ఘటనపై ప్రభుత్వం సీరియస్

- ఉన్నఫళంగా హైదరాబాద్ రావాలని వీసీకి పిలుపు
- సీఎస్‌కు వివరణ ఇచ్చుకున్న వీసీ.. ఇప్పటికే సర్కారుకు నివేదిక

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పీజీ వైద్య విద్య పరీక్షల్లో నిబంధనలకు విరుద్ధంగా జవాబు పత్రాలను దిద్ది, ఓ డాక్టర్‌ను పాస్ చేయించిన ఘటనపై సర్కారు సీరియస్‌గా ఉంది. ఈ ఘటనపై ఇప్పటికే ముగ్గురు సభ్యుల కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఆ కమిటీ తన నివేదికలో ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులు నిబంధనలు ఉల్లంఘించిన విషయాన్ని స్పష్టంగా పేర్కొంది. 'ఇంటూ' మార్క్ కొట్టిన పేపర్లను తిరిగి ఉన్నతాధికారులే స్వయంగా దిద్దించినట్లు నివేదికలో పొందుపరిచింది. ఆ నివేదికను ఆరోగ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్థుకు అందించింది. దాన్ని పరిశీలించిన తర్వాత ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ నందకుమార్ రెడ్డిని తక్షణమే సచివాలయానికి రావాలని ఆరోగ్య కార్యదర్శి ఆదేశించారు. వరంగల్‌లో ఉన్న ఆయన ఆగమేఘాలపై హైదరాబాద్‌కు బయలుదేరి వచ్చారు. సాయంత్రం సచివాలయంలో ఆరోగ్య కార్యదర్శిని కలిశారు. అనంతరం ఆమె వీసీని వెంటబెట్టుకుని చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు వద్దకు తీసుకెళ్లారు. విశ్వవిద్యాలయంలో వరుసగా చోటు చేసుకుంటున్న ఘటనలపై వీసీని సీఎస్ ఆరా తీసినట్లు సమాచారం. అలాగే తొలుత ఫెయిల్ అయి.. అనంతరం పాస్ అయిన వైద్యురాలి జవాబు పత్రం విషయంలో ఎందుకు జోక్యం చేసుకున్నారని సీఎస్ వీసీని ప్రశ్నించినట్లు సమాచారం. పరీక్షల్లో ఫెయిలైతే మరోమారు హాజరు అవుతారని, ఇలా చేయడమేంటని గట్టిగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. సీఎస్ ప్రశ్నలకు వీసీ వివరణ ఇచ్చుకున్నట్లు సమాచారం. సదరు వైద్యురాలు విశ్వవిద్యాలయానికి వచ్చి తాను పరీక్ష ఫెయిల్ అయ్యే అవకాశం లేదని, అన్ని జవాబులు రాశానని తనకు తెలిపిందని, తన జవాబు పత్రాలను పరిశీలించాలని కోరిందని వీసీ సీఎస్‌కు చెప్పినట్లు తెలుస్తోంది. పేపర్ 1, పేపర్ 3కి సంబంధించి 8, 9, 10 జవాబులు దిద్దకుండా వాటిపై 'ఇంటూ' మార్క్ పెట్టినట్లు గుర్తించామని, ఎవాల్యుయేటర్ల సమక్షంలో పేపర్లను తిరిగి దిద్దించి, ఆమెకు న్యాయం చేశామని వివరణ ఇచ్చారని వైద్యవర్గాలు పేర్కొన్నాయి.

గిరిజనుల సొమ్ము స్వాహాపై ప్రభుత్వం సీరియస్

- విచారణకు ఆదేశం... 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన సహకార కార్పొరేషన్(జీసీసీ)లో అక్రమాలు, అవినీతిపై ప్రభుత్వం సీరియస్ అయింది. గిరిజనుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో నిధుల దుర్వినియోగంపై.. 'గిరిజనుల సొమ్ము స్వాహా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. జీసీసీల్లో అసలు ఏం జరుగుతుందో తెలుసుకోవాలని విచారణకు ఆదేశించింది. ఈ మేరకు గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచిఘోష్ మంగళవారం విచారణ చేశారు. జీసీసీ జీఎం సీతారాం నాయక్‌ను పిలిపించుకుని వివరాలు సేకరించారు. కాగా, సిబ్బందికి అవగాహన లేకపోవడం వల్ల కొన్ని చోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయని, ఇందుకు సంబంధించి కొందరిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని జీఎం సీతారాం నాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దుర్వినియోగమైన సొమ్మును చాలా వరకు రికవరీ చేశామని, బంకులు మూతపడకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

గుడిహత్నూర్ పీహెచ్‌సీ ఘటనపై హెచ్చార్సీ సీరియస్

- సీఎస్‌ను వివరణ కోరిన కమిషన్

ఆదిలాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ పీహెచ్‌సీలో గత జూన్ 22న రెండు రోజుల వయస్సు గల శిశువుపై సీలింగ్ ఫ్యాన్ తెగిపడిన ఘటనను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్‌హెచ్చార్సీ) సీరియస్‌గా తీసుకుంది. రెండు నెలల్లో నివేదికను కమిషన్‌కు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. అలాగే, బాధిత కుటుంబానికి రూ.50వేల నష్ట పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'రెండు రోజుల శిశువుపై తెగిపడిన సీలింగ్ ఫ్యాన్' అనే కథనాన్ని కమిషన్ జస్టిస్ షమీమ్ తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటనకు బాధ్యులైన వైద్యుల నిర్లక్ష్యాన్ని తప్పుబడుతూ కమిషన్ సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేసింది.

విద్యుత్ స్టోరేజీకి ప్లాంట్లు

గ్లోబల్ టెండర్లు పిలిచిన జెన్‌కో.. 'బూ' విధానంలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్

- 750 మెగావాట్ల సామర్థ్యంతో 2 ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళిక
- మహేశ్వరం, చౌటుప్పల్‌లలో కొలువు దీరనున్న ప్లాంట్లు



హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు థర్మల్, జల, పవన విద్యుత్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తయ్యే కరంటును మాత్రమే మనం వాడుకున్నాం. ఇక నుంచి విద్యుత్‌ను స్టోరేజీ చేసుకుని అవసరమైనప్పుడు వినియోగించుకునే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. అదే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ (బీఈఎస్ఎస్). రాష్ట్రంలో 750 మెగావాట్ల సామర్థ్యం గల 2 బీఈఎస్ఎస్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు గ్లోబల్ టెండర్లను పిలుస్తూ తెలంగాణ జెన్‌కో మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. టెండర్లు గెలుచుకున్న సంస్థలు సొంతంగా నిర్మించి, నిర్వహించే (బూ) పద్ధతిలో ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తాయి. ఆసక్తి గల కంపెనీలు బిడ్లు దాఖలు చేయడానికి డిసెంబరు 27వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువునిచ్చింది. 750 మెగావాట్ల (ప్రతి గంటకు 187.5 మెగావాట్ల చొప్పున 4 గంటల పాటు విద్యుత్ ఇచ్చే) సామర్థ్యం గల ప్లాంటును సదరు సంస్థలు నిర్మిస్తాయి. మహేశ్వరం, చౌటుప్పల్‌లలోని 440/220 కేవీ సామర్థ్యం గల తెలంగాణ ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ల వద్ద వీటిని నిర్మిస్తారు. ఇప్పటికే హైదరాబాద్ శివారులోని శంకర్‌పల్లిలో 440/220 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్ సబ్‌స్టేషన్ వద్ద 250 మెగావాట్ల ఎనర్జీ స్టోరేజీ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి టెండర్ ప్రక్రియ పూర్తయింది. వందల ఎకరాల ట్రాన్స్‌కో భూముల్లో ఈ ప్లాంట్ ఏర్పాటు చేస్తారు. డిమాండ్ లేని వేళ ఓపెన్ యాక్సెస్ నుంచి కొనుగోలు చేసిన విద్యుత్‌ను బ్యాటరీల్లో నిల్వ చేసుకోవడమే 'బీఈఎస్ఎస్' ప్రధానోద్దేశం. డిమాండ్ సమయంలో నిల్వ చేసుకున్న కరెంట్‌ను విక్రయించడం దీని ఉద్దేశం. ఈ ప్లాంట్ నుంచి యూనిట్ రూ.2.90లకే కరెంట్ లభించనున్నదని భావిస్తున్నారు. దీంతో అధిక డిమాండ్ ఉన్నప్పుడు ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు ఖర్చు భారం తగ్గించుకోవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు.

వీజీఎఫ్ రూపంలో 40% కేంద్రం సాయం


2026 కల్లా దేశంలో 'బీఈఎస్ఎస్' ద్వారా ప్రతి గంటకు 4,000 మెగావాట్ల విద్యుత్ అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ప్రైవేటు సంస్థలు ఏర్పాటు చేసే బీఈఎస్ఎస్ ప్లాంట్లకు కేంద్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల శాఖ 40% వయబుల్టీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) సమకూరుస్తుంది. వీజీఎఫ్ కింద ప్రతి మెగావాట్‌కు రూ.18 లక్షల నిధులను కేంద్రం సమకూరుస్తుంది. టెండర్ గెలుచుకున్న ప్రైవేటు సంస్థకు రూ.270 కోట్ల మేరకు కేంద్రం సాయమందుతుంది. ఆయా ప్రైవేటు సంస్థలు విధిగా వీజీఎఫ్ నిధులను పరిగణనలోకి తీసుకునే టెండర్లు వేయాల్సి ఉంటుంది.

సింగరేణి మందమర్రి ప్లాంట్ ట్రయల్ రన్ సక్సెస్

హైదరాబాద్/ మంచిర్యాల నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా మందమర్రిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న 18 మెగావాట్ల సింగరేణి సోలార్ పవర్ ప్లాంట్‌కు అనుబంధంగా రూ.2.73 కోట్ల వ్యయంతో ఒక మెగావాట్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ ఏర్పాటు చేశారు. మంగళవారం దీని ట్రయల్ రన్ విజయవంతం కావడంతో 2,3 రోజుల్లో దీన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పగటి వేళల్లో ఉత్పత్తయ్యే సౌర విద్యుత్‌లో మిగులును ఉచితంగా సరఫరా చేయకుండా బ్యాటరీ స్టోరేజీ సిస్టమ్‌లో నిల్వ చేస్తారు. దీనివల్ల ఏటా సింగరేణి వినియోగించుకోని 9.1 లక్షల యూనిట్ల సౌర విద్యుత్ సద్వినియోగం ద్వారా రూ.70 లక్షలు ఆదా అయ్యే అవకాశం ఉంది. సింగరేణి గరిష్ట అవసరాల సమయంలో బ్యాటరీల్లో నిల్వ చేసిన విద్యుత్‌ను వినియోగిస్తారు. సింగరేణి సంస్థ తన ఆధీనంలోని ఏరియాల్లో 245.5 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను నిర్వహిస్తోంది.

రోగికి బయోసెన్సార్‌తో వైద్యుడికి అలర్ట్‌లు

- కిమ్స్‌లో ఏఐ ఆధారిత ముందస్తు హెచ్చరిక వ్యవస్థ
- కిమ్స్ సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు వెల్లడి



రోగికి అమర్చిన బయోసెన్సార్

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రి వార్డులో ఉన్న పేషెంట్ల ఆరోగ్య పరిస్థితిని వైద్యులు ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి వీలుగా బయోసెన్సార్ సాంకేతికతను కిమ్స్ ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. ఇప్పటికే ఐసీయూలో ఉన్న రోగికి సంబంధించిన సమాచారం ఈ విధానంలో నిరంతరం అందుతోందని, ఇక నుంచి వార్డుల్లో ఉండే రోగులకు కూడా ఈ సదుపాయం తీసుకొచ్చామని చెప్పారు. మంగళవారం కిమ్స్‌లో ఈ ఏఐ ఆధారిత ముందస్తు హెచ్చరిక వ్యవస్థను ఆయన ప్రారంభించారు. ఈ విధానంలో వార్డులో ఉన్న రోగికి బయోసెన్సార్‌ను అమరుస్తారని, ఇందుకు వైర్‌లెస్ వేరబుల్ పరికరాలను ఉపయోగిస్తారని తెలిపారు. దీని ద్వారా రోగి గుండె స్పందనలు, శ్వాస, టెంపరేచర్, పల్స్ రేట్, బీపీ వంటి కీలక పారామీటర్లను వైద్యులు నిరంతరం రిమోట్‌గా పర్యవేక్షించేందుకు వీలుంటుందని, వారి మొబైల్‌కు ఈ వివరాలు చేరతాయని చెప్పారు. రోగుల పరిస్థితిలో ఏమైనా మార్పులుంటే రియల్ టైంలో వైద్యులకు, క్లినికల్ బృందాలకు అలర్ట్ సమాచారం అందుతుందన్నారు. తద్వారా పూర్తి సమన్వయంతో తగిన చికిత్స అందిస్తారని చెప్పారు. అత్యాధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవడంలో సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి ముందంజలో ఉంటుందని, వీటిలో ఆగ్మెంట్ రియాలిటీ అసిస్టెడ్ న్యూరో సర్జరీ, అత్యాధునిక ఇమేజింగ్ సిస్టమ్‌లు, ఏఐ ఆధారిత డయాగ్నస్టిక్స్ ఉన్నాయన్నారు.

5 వైద్య కళాశాలల అధ్యాపకులకు ప్రోత్సాహకం!

- ప్రతిపాదనలు పంపాలని ప్రిన్సిపాళ్లకు డీఎంఈ ఆదేశం

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత వైద్య కళాశాలల్లో పని చేస్తున్న బోధనా సిబ్బందికి కనీస వేతనంలో 50 శాతం ఇన్సెంటివ్ ఇవ్వాలన్న ప్రతిపాదనపై ముందడుగు పడింది. ఈ మేరకు ఐటీడీఏల పరిధిలోని కొత్తగూడెం, కుమరంభీం, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి మెడికల్ కాలేజీల్లో పని చేస్తున్న అధ్యాపకుల వివరాలను తక్షణం పంపాలని ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లకు డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్ ఆదేశాలు జారీ చేశారు. అయితే కేవలం ఐదు కాలేజీల నుంచే ప్రతిపాదనలు కోరడంపై ప్రభుత్వ వైద్యుల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. షెడ్యూల్డ్ ఏరియాలోనే ఉన్న ఆదిలాబాద్, మంచిర్యాల, వరంగల్‌రూరల్, ఖమ్మం, నాగర్ కర్నూల్ కాలేజీల నుంచి కూడా ప్రతిపాదనలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నరహరి, లాలూ ప్రసాద్ డిమాండ్ చేశారు.

కిలోవాట్‌కు 1000 చొప్పున కడితే వ్యవసాయ కనెక్షన్

- అపార్ట్‌మెంట్, ఇళ్లు, వాణిజ్య భవనాలకు ఎస్టిమేట్ల దందా నుంచి విముక్తి
- లైన్‌చార్జీలపై ఈఆర్‌సీ ముసాయిదా
- డిసెంబరు 9దాకా అభిప్రాయ సేకరణ

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు కనెక్షన్ల పరంగా అన్నదాతలు, కొత్తగా ఇళ్లు కట్టుకున్న వారికి, వాణిజ్య సముదాయాల నిర్వాహకులకు ఊరట లభించనుంది. డిస్కమ్ ఉద్యోగుల వసూళ్ల దందాకు బ్రేక్ పడనుంది. ఈ మేరకు కొత్తగా వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ కోసం రైతులు కిలోవాట్‌కు రూ.1000లు చొప్పున చెల్లిస్తేచాలు. ఇలా ఎన్ని కిలోవాట్ల సామర్థ్యం కలిగిన కనెక్షన్ తీసుకోవాలంటే ఆ మేరకు చార్జీలు చెల్లిస్తే ఇతర చార్జీలతో సంబంధం లేకుండా విద్యుత్తు కనెక్షన్ ఇవ్వాల్సిందే! ప్రస్తుతం వ్యవసాయ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకుంటే వ్యవసాయ పంపుసెట్టు మూడు స్తంభాలలోపు ఉంటే కనెక్షన్ ఇస్తున్నారు. మూడు స్తంభాలను దాటి ఉంటే ఔట్‌రైట్ కంట్రిబ్యూషన్(ఓఆర్‌సీ) కింద రూ.45 వేల పైన కట్టాల్సి వస్తోంది. ఈ చార్జీలకు ముగింపు పలుకుతూ రెగ్యులేషన్ ముసాయిదాను ఈఆర్‌సీ విడుదల చేసింది. దీనిపై డిసెంబరు 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అభిప్రాయాలు/అభ్యంతరాలు స్వీకరిస్తారు. అనంతరం ఈఆర్‌సీ ఉత్తర్వులు ఇవ్వనుంది. అదే జరిగితే డిస్కమ్‌లలో విద్యుత్తు ఉద్యోగులు/అధికారులు చేసే ఎస్టిమేషన్‌ల దందాకు ముగింపు పడనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి 2024 అక్టోబరులో ఈ రెగ్యులేషన్ ముసాయిదాను తెచ్చారు. దీనిపై అభ్యంతరాలు రాగా... భారీ మార్పులు చేశారు. ఇక కొత్తగా అపార్ట్‌మెంట్‌లు, వాణిజ్య సముదాయాలు, బహుళ అంతస్థుల భవనాలు కట్టుకొని కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే... ఎస్టిమేషన్స్ పేరిట డిస్కమ్‌ల ఉద్యోగులు దందాలు చేసే వారు. ఇక ముందు లైన్ చార్జీలు సామర్థ్యం ఆధారంగా చెల్లిస్తే కనెక్షన్లు ఇవ్వాల్సిందే. 20 కిలోవాట్ల లోడు దాటితే ప్రతి కిలోవాట్‌కు రూ.10 వేలచొప్పున కడితే... 25 కిలోవాట్లకు రూ.2.50 లక్షలు కడితే... ఆ నిర్మాణానికి అవసరమైన లైన్లు వేయడం, చివరికి ట్రాన్స్‌ఫార్మర్ కూడా బిగించడం డిస్కమ్‌దే బాధ్యత కానుంది. 2020 డిసెంబరు 31వ తేదీన ఎలక్ట్రిసిటీ (రైట్స్ ఆఫ్ కన్స్యూమర్) రూల్స్ ప్రకారం వినియోగదారులకు విద్యుత్తును అందించడానికి వీలుగా 150 కిలోవాట్లలోపు లేదా ఆ పైన లోడు కోసం కొత్తగా సరఫరా వ్యవస్థకు వెచ్చించిన వ్యయాన్ని తిరిగి రాబట్టుకోవాలని కేంద్ర విద్యుత్తు మంత్రిత్వశాఖ డిస్కమ్‌లకు ఆదేశాలు ఇచ్చిన విషయం విదితమే. దాంతో కేంద్రప్రభుత్వ వెసులుబాటుతో రెగ్యులేషన్‌ను సవరించాలని డిస్కమ్‌లు ఏడాది కిందట ఈఆర్‌సీని కోరాయి. దాంతో ఈ ముసాయిదా రెగ్యులేషన్ సవరణపై అభిప్రాయాలు/అభ్యంతరాలు స్వీకరించి మళ్లీ సవరించారు. ప్రతిపాదించినచార్జీలు వసూలు చేసిన తర్వాత పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లను విధిగా డిస్కమ్‌లు సమకూర్చాల్సి ఉంటుంది. దీనికి ఎట్టి పరిస్థితుల్లోనూ అదనంగా చార్జీలు వసూలు చేయడానికి వీల్లేదు. ఇక ఈ రెగ్యులేషన్స్ అమల్లోకి వస్తే... ఎస్టిమేషన్స్ పేరిట డిస్కమ్‌లలో జరుగుతున్న అవినీతి సగానికి పైగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

డిసెంబర్‌లో విడుదల



సూపర్ నేచురల్ హారర్ జానర్‌లో తెరకెక్కిన చిత్రం 'మిస్టీరియస్'. మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో జయ్ వల్లందాస్ నిర్మించారు. రోహిత్, మేఘన జంటగా నటించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'నూతన నటీనటులతో సస్పెన్స్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన చిత్రమిది. ప్రేక్షకుడిని ఆద్యంతం కొత్త అనుభూతికి లోను చేస్తుంది' అని చెప్పారు. 'ఇప్పటివరకూ తెలుగులో రాని విభిన్న కథ, కథనాలతో సినిమా రూపొందుతోంది. అందమైన ప్రేమకథ, మిస్టరీ ఎలిమెంట్స్ లాంటి ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది' అని తెలిపారు. సంగీతం: ఎంఎల్ రాజా, సినిమాటోగ్రఫీ: దేవా.

గృహహింస కేసు పెట్టిన సెలీనా జైట్లీ



బాలీవుడ్ నటి సెలీనా జైట్లీ తన భర్త పీటర్ హాగ్‌పై గృహహింస కేసు పెట్టారు. ఆమె దాఖలు చేసిన పిటిషన్ ముంబైలోని ఓ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందుకు మంగళవారం వచ్చినట్లు బాలీవుడ్ మీడియాలో కథనాలు వచ్చాయి. ఆస్ట్రియాలో పీటర్ కస్టడీలో ఉన్న తన పిల్లలను కలిసేందుకు కూడా తనకు అవకాశం ఇవ్వడం లేదని సెలీనా ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. పీటర్ నుంచి నెలకు రూ.10 లక్షల భరణంతోపాటు రూ.50 కోట్లు పరిహారం ఇప్పించాలని కోరారు. ఈ పిటిషన్‌పై డిసెంబరు 12న తుది విచారణ జరగనుంది. కాగా, సెలీనా జైట్లీ, పీటర్ హాగ్‌లు 2011లో ఆస్ట్రియాలో వివాహం చేసుకున్నారు. సెలీనా జైట్లీ 2004లో విడుదలైన 'సూర్యం' సినిమాలో మంచు విష్ణుతో కలసి నటించారు.

అంచనాలను మించేలా..



రిచర్డ్ రిషి, రక్షణ ఇందుచూడన్ జంటగా తెరకెక్కుతోన్న చిత్రం 'ద్రౌపది 2'. మోహన్.జి దర్శకత్వంలో సోల చక్రవర్తి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో టైటిల్ రోల్ పోషిస్తున్న రక్షణ ఇందుచూడన్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఎంతో గాంభీర్యంగా ఉన్న ఆమె లుక్ ప్రస్తుతం అందర్నీ మెప్పిస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకుల అంచనాలను మించి ఉంటుంది, సరికొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ సాగుతోంది. త్వరలోనే విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎడిటర్: దేవరాజ్ ఎస్, కెమెరామెన్: ఫిలిప్ ఆర్ సుందర్, సంగీతం: జిబ్రాన్.

చిరంజీవి గారి సినిమాని డైరెక్ట్ చేయాలి

ఉపేంద్ర



'నేను సినిమాల్లోకి రాకముందు చిరంజీవి గారి సినిమాలను ఫస్ట్ డే ఫస్ట్ షో చూసేవాణ్ని. ఆ అనుభూతి చాలా గొప్పది. చిరంజీవి గారి సినిమాని డైరెక్ట్ చేయాలనేది నా కల. త్వరలో ఆ కల తీరుతుందనే నమ్మకం ఉంది' అని కన్నడ హీరో ఉపేంద్ర అన్నారు'. రామ్ కథానాయకుడిగా నటించిన 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రంలో ఉపేంద్ర కీలకపాత్ర పోషించారు. పి. మహేశ్‌బాబు దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ గురువారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఉపేంద్ర మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు.

- 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రంలో భాగమైనందుకు చాలా ఆనందంగా ఉంది. అద్భుతమైన ఎమోషన్స్ ఉన్న సినిమా ఇది. ఒక స్టార్ హీరోకూ, అతన్ని ఆరాధించే అభిమానికి మధ్య జరిగే కథ ఇది. నేనొక ప్రేక్షకుడిగా కథ విన్నాను. హీరోకూ, అభిమానికి మధ్య ఉండే ఎమోషన్ చాలా గొప్పది. దాన్ని ఈ సినిమాలో దర్శకుడు మహేశ్‌బాబు చాలా అద్భుతంగా, కొత్తగా చూపించారు. ఈ సినిమా ప్రేక్షకులను అలరించడం ఖాయం.
- రామ్ గొప్ప నటుడు. ఆయన నటన ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ. ఒక స్టార్ అయి ఉండికూడా ఒక సామాన్య అభిమానిలో ఉండే అమాయకత్వాన్ని ఆయన అభినయించిన తీరు అద్భుతం. భాగ్యశ్రీ బోర్సే, రామ్ మధ్య వచ్చే రెట్రో లవ్ స్టోరీ హృదయాలకు హత్తుకుంటుంది. మంచి నిర్మాణ విలువలతో మైత్రీ మూవీస్ నిర్మించింది. ఇంత మంచి ఎమోషనల్ చిత్రాన్ని నిర్మించినందుకు వారికి నా అభినందనలు.

ఆస్కార్ రేస్‌లో మహావతార్ నరసింహ



ఇటీవలె విడుదలై సంచలన విజయం సాధించిన యానియేషన్ చిత్రం 'మహావతార్ నరసింహ'.. ఆస్కార్ 2026కు షార్ట్‌లిస్ట్ అయ్యింది. ఉత్తమ యానిమేషన్ విభాగంలో అవార్డు కోసం 35 సినిమాలతో పోటీపడుతోంది. 'డెమోన్ స్లేయర్', 'జూటోపియా 2' తదితర చిత్రాలు ఈ షార్ట్‌లిస్ట్‌లో ఉన్నాయి. అశ్విన్ కుమార్ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ నిర్మించిన 'మహావతార్ నరసింహ' చిత్రం బాక్సాఫీస్ దగ్గర దాదాపు రూ.300 కోట్ల కలెక్షన్స్ సాధించింది. భారతీయ యానిమేషన్ చిత్రాల్లో సరికొత్త రికార్డులు నెలకొల్పింది. కాగా, జాన్వీ కపూర్, ఇషాన్ కట్టర్ ప్రధాన పాత్రల్లో 'మసాన్' ఫేమ్ నీరజ్ ఘైవాన్ తెరకెక్కించిన బాలీవుడ్ చిత్రం 'హోమ్‌బౌండ్' ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో భారత్ తరఫున అధికారికంగా ఆస్కార్ నామినేషన్ సాధించిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది మార్చి 15న 98వ ఆస్కార్ అవార్డుల వేడుక జరగనుంది.

బిజినెస్

వరంగల్ ● బుధవారం 26 నవంబరు 2025

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,27,040 ▲	1,16,450 ▲	1,74,000 ▲
విజయవాడ	1,29,000 ▲	1,21,000 ▲	1,60,000 ▲
విశాఖపట్నం	1,29,090 ▲	1,14,700 ▼	1,74,000 ▲
రాజమండ్రి	1,27,040 ▲	1,16,450 ▲	1,57,000 ▲
ప్రొద్దుటూరు	1,25,900 ▼	1,15,830 ▼	1,61,600 ▼
ముంబై	1,25,120 ▲	1,14,610 ▲	1,56,320 ▲

మలబార్ గోల్డ్ బ్రైడ్స్ ఆఫ్ ఇండియా ప్రచారం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆభరణాల రిటైలింగ్‌లోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ లిమిటెడ్ 15వ బ్రైడ్స్ ఆఫ్ ఇండియా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. కంపెనీ మార్కెట్లోకి తెచ్చిన బ్రైడల్ రేంజి నగలు వైవిధ్యభరితమైన వివాహ సాంప్రదాయానికి అద్దం పడతాయి. ఈ ఏడాది కార్యక్రమం 10 మంది సెలబ్రిటీలు, 22 మంది వధువులను ఒకే వేదిక పైకి తెస్తుందని కంపెనీ చైర్మన్ ఎంపీ అహ్మద్ చెప్పారు. ఈ ఎడిషన్‌లో దేశానికి చెందిన భిన్న ప్రాంతాల వివాహ సాంప్రదాయాలకు అనుగుణమైన డిజైన్లున్నట్టు ఆయన చెప్పారు. అన్ని డిజైన్లు అన్ని ప్రాంతాల్లోనూ అందుబాటులో ఉండడం కూడా ప్రత్యేకత అని, దీని వల్ల చెన్నైలో ఉన్న వధువు రాజస్తాన్ సాంప్రదాయానికి చెందిన పోల్కీ సెట్, ఢిల్లీకి చెందిన వధువు దక్షిణాదిలోని ఆలయ సాంప్రదాయానికి చెందిన డిజైన్లు ఎంపిక చేసుకోగలుగుతారని పేర్కొన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ			
హైదరాబాద్	650	విజయవాడ	660
వరంగల్	652	గోదావరి	645
చిత్తూరు	673	విశాఖపట్నం	635
		డజను గుడ్లు రూ. 90	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	100	విజయవాడ	103
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	95
కర్నూలు	100	నెల్లూరు	100
విశాఖపట్నం	100	అనంతపురం	100
గోదావరి	103		

బంగారం రుణాలకు భారీ డిమాండ్



రూ.14.5 లక్షల కోట్లకు చేరిన మార్కెట్

కొత్తగా 3,000 ఎన్‌బీఎఫ్‌సీల బ్రాంచ్‌లు

న్యూఢిల్లీ: చేతిలో చిల్లి గవ్వ లేకపోయినా, చిన్నమెత్తు బంగారం ఉంటే చాలు. ఏదో ఒక బ్యాంకు లేదా ఎన్‌బీఎఫ్‌సీ దగ్గర కుదువ పెట్టి నాలుగు రాళ్లు అప్పుగా తీసుకుని సమస్య నుంచి బయటపడవచ్చు. బంగారం ధరల పెరుగుదలతో గత ఏడాది కాలంగా దేశంలోని గోల్డ్ లోన్ కంపెనీల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయల్లా పెరిగిపోతోంది. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి దేశంలోని గోల్డ్ లోన్ ఎన్‌బీఎఫ్‌సీలు బంగారం ఆభరణాలు, బంగారాన్ని హామీగా పెట్టుకుని ఇచ్చిన రుణాల విలువ రూ.14.5 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 36% ఎక్కువ. వచ్చే ఏడాది మార్చి నాటికి పసిడి రుణాల మార్కెట్ రూ.15 లక్షల కోట్లకు చేరుకుంటుందని ప్రముఖ పరపతి రేటింగ్ సంస్థ ఇక్రా అంచనా.

మరింత డిమాండ్: మన దేశంలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు పసిడి ధర 60% పెరిగింది. ఇదే సమయంలో సూక్ష్మ రుణ సంస్థలు హామీ లేని రుణాలు ఇచ్చేందుకు పెద్దగా ఇష్టపడడం లేదు. దీంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మధ్య తరగతి ప్రజలు, రైతులు, చిరు వ్యాపారులు గోల్డ్ లోన్ కంపెనీల వైపు చూస్తున్నారు. బంగారం ధర కూడా పెరగడంతో కొన్ని ఎన్‌బీఎఫ్‌సీలు బంగారం లేదా ఆభరణాల విలువలో 70 నుంచి 80% వరకు రుణాలుగా ఇస్తున్నాయి. వచ్చే ఏడాదీ ఇదే ట్రెండ్ కొనసాగుతుందని మార్కెట్ వర్గాల అంచనా. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం గోల్డ్ లోన్ మార్కెట్ ఎంత లేదన్నా 30 నుంచి 35% వరకు పెరుగుతుందని ఇక్రా అంచనా.

కొత్త శాఖలకు కసరత్తు

పసిడి రుణాలకు గిరాకీ పెరగడంతో ఎన్‌బీఎఫ్‌సీలు, గోల్డ్ లోన్ కంపెనీలు వచ్చే ఏడాది దాదాపుగా 3,000 వరకు కొత్త బ్రాంచ్‌లు ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో 1,800 బ్రాంచ్‌లను ముత్తూట్ ఫైనాన్స్, ముత్తూట్ ఫిన్‌కార్ప్, బజాజ్ ఫైనాన్స్, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ వంటి అగ్రశ్రేణి ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీలే ఏర్పాటు చేయనున్నాయి. పెరుగుతున్న మార్కెట్ అవకాశాలను దొరకపుచ్చుకునేందుకు ఇపుడు ఎల్ అండ్ టీ ఫైనాన్స్, పూనావాలా ఫిన్‌కార్ప్ వంటి ఎన్‌బీఎఫ్‌సీలూ సిద్ధమవుతున్నాయి. జియో ఫైనాన్స్ కూడా త్వరలో గోల్డ్ లోన్స్ మార్కెట్‌లో పాదం మోపుతుందని భావిస్తున్నారు. మొత్తం మీద బులియన్ మార్కెట్ ర్యాలీ గోల్డ్ లోన్ కంపెనీల వ్యాపార విస్తరణకూ తోడ్పడుతోంది.



ధర రూ.11.49 లక్షలు

టాటా సియారా మళ్లీ వచ్చెన్..

ముంబై: సుమారుగా రెండు దశాబ్దాల తర్వాత టాటా సియారా కారు మళ్లీ రోడ్లపైకి రాబోతోంది. ఈ ప్రముఖ బ్రాండ్‌ను టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ (టీఎంపీవీ) సరికొత్త అవతారంలో అందుబాటులోకి తెచ్చింది. తద్వారా సంస్థ వేగంగా వృద్ధి చెందుతున్న మిడ్‌సైజ్ స్పోర్ట్ యుటిలిటీ వెహికిల్ (ఎస్‌యూవీ) విభాగంలోకి ప్రవేశించింది. మూడు ఇంజిన్ (రెండు పెట్రోల్, ఒకటి డీజిల్) ఆప్షన్లలో లభించనున్న ఈ కారు పరిచయ ధర రూ.11.49 లక్షలు. సియారా బుకింగ్స్‌ను డిసెంబరు 16 నుంచి ప్రారంభించనున్నట్టు, వచ్చే ఏడాది జనవరి 15 నుంచి కస్టమర్లకు వాహనాలను అందించనున్నట్టు కంపెనీ వెల్లడించింది. సియారా ఎలక్ట్రిక్ వెర్షన్‌ను వచ్చే ఆర్థిక సంవత్సరంలో విడుదల చేయనున్నట్టు సంస్థ తెలిపింది. ప్రీమియం లుక్‌తో కూడిన ఈ కారులోని మూడు స్క్రీన్లతో కూడిన ఇన్ఫోటెయిన్‌మెంట్ సిస్టమ్, 5జీ కనెక్టివిటీ, 2+ అడాస్ వంటి డిజిటల్ ఫీచర్లు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని టీఎంపీవీ పేర్కొంది. హ్యుండయ్ క్రెటా, కియా సెల్టోస్, మారుతి సుజుకీ గ్రాండ్ విటారాకు పోటీగా టాటా కంపెనీ సియారాను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది.



30 డాలర్లకు ముడిచమురు?

- డిమాండ్‌ను మించిపోనున్న సరఫరా
- జేపీ మోర్గాన్ తాజా నివేదిక

న్యూఢిల్లీ: రాబోయే సంవత్సరాల్లో ముడిచమురు దిగుమతుల భారం నుంచి భారత్‌కు, ఇంధన ధరల పోటు నుంచి వాహనాదారులకు భారీ ఊరట లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో 60 డాలర్ల ఎగువన కదలాడుతున్న బ్యారెల్ ముడిచమురు ధర.. క్రమంగా తగ్గుముఖం పట్టనుందని, 2027 ఆర్థిక సంవత్సరం చివరినాటికి 30 డాలర్ల స్థాయికి దిగిరావచ్చని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ దిగ్గజం జేపీ మోర్గాన్ తాజా నివేదిక అంచనా వేసింది. వచ్చే రెండేళ్లలో ప్రపంచ మార్కెట్లోకి ముడిచమురు సరఫరా గణనీయంగా పెరగనుందని, మార్కెట్ డిమాండ్‌ను మించిపోనుందని పేర్కొంది. ముఖ్యంగా అమెరికా, బ్రెజిల్, గుయానా వంటి ఒపెక్ (పెట్రోలియం ఎగుమతి దేశాల సమాఖ్య) ప్లస్ యేతర దేశాలు చమురు ఉత్పత్తిని భారీగా పెంచవచ్చని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో ఒపెక్ ప్లస్ దేశాలు ఉత్పత్తిని యథాతథంగా కొనసాగిస్తే, రెండేళ్లలో ఇంధన సరఫరా మిగులు రోజుకు 30 లక్షల బ్యారెళ్లకు చేరుకోవచ్చని జేపీ మోర్గాన్ అంచనా వేసింది. దాంతో ధరలు ప్రస్తుత స్థాయితో పోలిస్తే, దాదాపు సగానికి తగ్గేందుకు అవకాశాలున్నాయని అంటోంది.

మనకు అన్ని విధాలా ప్రయోజనకరమే : ప్రపంచంలో అతిపెద్ద ఇంధన వినియోగదారుల్లో అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. పైగా, దేశీయ ఇంధన అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతున్నాం. కాబట్టి, ముడిచమురు ధరలు తగ్గుదల భారత్‌కు అన్ని విధాలా ప్రయోజనకరమే. దేశ దిగుమతుల వ్యయంతో పాటు కరెంట్ ఖాతా లోటు తగ్గుదలకు ఇది దోహదపడుతుంది. వాహనదారులపై పెట్రోల్, డీజిల్ కొనుగోలు భారం తగ్గుతుంది. సరుకు రవాణా వ్యయం కూడా తగ్గి ధరలు మరింత దిగివచ్చేందుకు తోడ్పడుతుంది. ఎయిర్‌లైన్స్, కెమికల్స్, ట్రాన్స్‌పోర్ట్ రంగ వ్యాపార నిర్వహణ వ్యయమూ గణనీయంగా తగ్గుతుంది.

వచ్చే ఏడాది చివరికి వెండి 6 లక్షలు!

- స్టాక్ మార్కెట్లలో మహాపతనానికి బీజాలు
- బులియన్, క్రిప్టోలతోనే పెట్టుబడులు సేఫ్
- రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత అంచనా

న్యూఢిల్లీ: ప్రపంచ స్టాక్ మార్కెట్ చరిత్రలో కనీవిని ఎరుగని మహా పతనం ఇప్పటికే ప్రారంభమైందని ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడైన పుస్తకాల్లో ఒకటైన 'రిచ్ డాడ్ పూర్ డాడ్' రచయిత, అమెరికన్ బిజినెస్‌మెన్ రాబర్ట్ కియోసాకి ఇన్వెస్టర్లను హెచ్చరించారు. అమెరికా మార్కెట్లో మొదలైన ఈ పతనం క్రమంగా యూరప్, ఆసియా మార్కెట్లకు వ్యాపించనుందని అన్నారు. పెట్టుబడులను రక్షించుకునేందుకు ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోను సర్దుబాటు చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన సూచించారు. ఈ కష్టకాలంలో బంగారం, వెండితోపాటు బిట్‌కాయిన్, ఎథిరియం వంటి క్రిప్టోకరెన్సీలే పెట్టుబడుల విలువను పెంచగలవని ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు.

రియల్టీ మార్కెట్టూ క్రాష్.. : కృత్రిమ మేధ (ఏఐ) కంపెనీల షేర్లలో ఏర్పడిన భారీ బుడగ ఎప్పుడైనా పేలవచ్చన్న ఆందోళనలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు ఇప్పటికే ఒత్తిడికి లోనవుతున్నాయని కియోసాకి పేర్కొన్నారు. ఇందుకు తోడు ఏఐ టెక్నాలజీ దెబ్బకు ఉద్యోగాల ఊచకోత కూడా ఇప్పటికే మొదలైందని, రాబోయే సంవత్సరాల్లో ఇది తారాస్థాయికి చేరుకోనుందని ఇప్పటికే పలువురు విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. లక్షల్లో ఉద్యోగాలు హరించుకుపోతే.. రియల్ ఎస్టేట్ మార్కెట్ కూడా కుప్పకూలుతుందని అభిప్రాయపడ్డారు.

అంతర్జాతీయ మార్కెట్లో 200 డాలర్లకు వెండి..: ఆర్థిక సంక్షోభ సమయాల్లో భద్రమైన పెట్టుబడి సాధనాలుగా పేరున్న బంగారం, వెండి ధరలు మున్ముందు భారీగా పెరగనున్నాయని కియోసాకి అంటున్నారు. ప్రస్తుతం 50 డాలర్ల స్థాయిలో ఉన్న ఔన్స్ సిల్వర్.. త్వరలోనే 70 డాలర్లకు ఎగబాకవచ్చని.. వచ్చే ఏడాది చివరినాటికి 200 డాలర్లకు చేరుకోవచ్చని కియోసాకి అంచనా వేశారు. ప్రస్తుతం ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి రూ.1.55 లక్షలు పలుకుతోంది. కియోసాకి అంచనాల ప్రకారం.. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ వెండి 200 డాలర్లకు పెరిగితే.. దేశీయంగా కిలో వెండి రూ.6.2 లక్షలకు చేరుకునే అవకాశం ఉంది.

మూడో రోజూ నష్టాల్లోనే మార్కెట్

ముంబై: స్టాక్ మార్కెట్ వరుసగా మూడో రోజూ నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్ 313.70 పాయింట్లు కోల్పోయి 84,587.01 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 74.70 పాయింట్లు తగ్గి 25,884.80 వద్ద స్థిరపడింది. ఐటీ, ఆటో రంగ షేర్లలో అమ్మకాలతోపాటు విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ ఇందుకు కారణం.

వచ్చేనెల 1 నుంచి పీసీ డయాగ్నోస్టిక్స్ ఐపీఓ

పీసీ డయాగ్నోస్టిక్స్ పేరుతో ముంబై కేంద్రంగా కార్యకలపాలు సాగిస్తున్న ఇన్విక్టా డయాగ్నోస్టిక్స్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చే నెల 1న ప్రారంభమై 3న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.80-85గా నిర్ణయించింది.

భారీగా పెరిగి బంగారం, వెండి : అంతర్జాతీయ మార్కెట్లో ట్రెండ్‌కు అనుగుణంగా దేశీయంగానూ పసిడి, వెండి ధరలు భారీగా పెరిగాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత బంగారం 10 గ్రాములు రూ.3,500 ఎగబాకి రూ.1,28,900కు చేరింది. 99.5% స్వచ్ఛత లోహం కూడా అదే స్థాయిలో పెరిగి రూ.1,28,300 పలికింది. కిలో వెండి సైతం ఒక్కరోజే రూ.5,800 పెరుగుదలతో రూ.1,60,800 స్థాయికి చేరుకుంది.

స్పోర్ట్స్

స్మృతి పెళ్లి వాయిదాపై నెట్‌లో ఊహాగానాలు



న్యూఢిల్లీ: భారత క్రికెటర్ స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ పెళ్లి నిరవధికంగా వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఆమె తండ్రి అనారోగ్యానికి గురికావడంతో ఆదివారం జరగాల్సిన వీరి వివాహం ఆగిపోయింది. అయితే, పెళ్లి వేడుకలు, ప్రపోజల్ వీడియోలు, ఫొటోలను స్మృతి తన సోషల్ మీడియా ఖాతానుంచి తొలగించడం ఏదో జరిగిందన్న అనుమానాలకు తావిచ్చింది. స్మృతి స్నేహితులు జెమీమా, శ్రేయాంక కూడా పెళ్లి వీడియోలను తమ ఖాతాల నుంచి తీసేయడం ఈ పుకార్లకు మరింత బలాన్ని చేకూర్చింది. ఇదే అదనుగా కొందరు అనేక ఊహాగానాలకు తెరదీశారు. పలాష్ మోసం బయటపడడం వల్లే పెళ్లి రద్దయిందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. అందుకు ఆధారంగా మేరీ డికోస్టా అనే మహిళతో జరిగిన వాట్సప్ చాట్ స్క్రీన్ షాట్లను పోస్టు చేశారు. దీనిపై స్మృతి లేదా ముచ్చల్ టీమ్ నుంచి ఎటువంటి స్పందనా రాలేదు.

బెల్జియం చేతిలో భారత్ ఓటమి

ఇపో(మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా కప్ హాకీ టోర్నమెంట్‌లో తొలి మ్యాచ్‌లో కొరియాను ఓడించిన భారత జట్టు.. రెండో మ్యాచ్‌లో నిరాశపరిచింది. మంగళవారం జరిగిన పోరులో భారత్ 2-3తో బెల్జియం చేతిలో చిత్తయింది. భారత్ తరఫున అభిషేక్ (33వ), శిలానంద్ (57వ) చెరో గోల్ కొట్టగా.. బెల్జియం నుంచి డువెకోట్ (17వ, 57వ) రెండు, నికోలస్ (45వ) ఓ గోల్ చేశారు. భారత్ తర్వాతి మ్యాచ్‌ను మలేసియాతో నేడు ఆడనుంది.

ఆర్నెల్ల తర్వాత స్వదేశానికి విరాట్



న్యూఢిల్లీ: లండన్‌లో నివాసముంటున్న స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఆరు నెలల సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌లో అడుగుపెట్టాడు. టీ20, టెస్టులకు వీడ్కోలు పలికిన విరాట్ కేవలం వన్డేల్లో మాత్రమే ఆడుతున్న విషయం తెలిసిందే. దీంతో ఈనెల 30 నుంచి దక్షిణాఫ్రికాతో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్ కోసం జట్టుతో పాటు చేరనున్నాడు. ఈ ఏడాది మేలో ఐపీఎల్‌లో ఆర్‌సీబీ విజేతగా నిలిచాక లండన్ వెళ్లిపోయిన విరాట్.. అక్కడి నుంచే ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లి వన్డే సిరీస్ ఆడాడు.

టైబ్రేక్‌కు ఫిడే వరల్డ్‌కప్ ఫైనల్

పనాజీ: ఫిడే వరల్డ్‌కప్ ఫైనల్ టైబ్రేక్‌కు దారితీసింది. వీ యి (చైనా), ఉజ్బెకిస్థాన్ జావోఖిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్)ల మధ్య మంగళవారం జరిగిన రెండో క్లాసికల్ గేమ్ 30 ఎత్తుల తర్వాత డ్రాగా ముగిసింది. దీంతో ఇద్దరూ చెరో పాయింట్‌తో సమంగా ఉన్నారు. బుధవారం జరిగే ర్యాపిడ్ టైబ్రేకర్‌లో విజేతను నిర్ణయిస్తారు.



డ్రానందమైనా.. దక్కాలి!

రోజంతా నిలుస్తారా?

రెండో టెస్టు

రెండో టెస్టులో భారత్ విజయం ఇక అసాధ్యమే. 549 పరుగుల భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన పంత్ సేన 30 రన్స్ అయినా చేయకముందే ఓపెనర్లను కోల్పోయింది. ఇక బుధవారం ఆఖరి రోజున 8 వికెట్ల సహాయంతో చేయాల్సిన పరుగులు 522. ప్రస్తుతం ఆతిథ్య జట్టు ఆటతీరు చూస్తుంటే ఈ కొండంత లక్ష్యాన్ని ఛేదించడం కాదు కదా.. కనీసం రోజంతా నిలిచి డ్రా చేసుకున్నా గొప్పే అనేలా ఉంది పరిస్థితి. మరోవైపు పాతికేళ్ల తర్వాత భారత గడ్డపై క్లీన్‌స్వీప్ కోసం సఫారీలు ఉవ్విళ్లూరుతున్నారు.

- భారత్ లక్ష్యం 549 ● ప్రస్తుతం 27/2
- దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 260/5 డిక్లేర్

స్టబ్స్ సెంచరీ మిస్

గువాహటి: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియాకు భారీ ఓటమి తప్పేలా లేదు. ఇక జట్టు పోరాటమంతా డ్రా కోసమే. భారత బ్యాటర్లు బేలగా మారిన పిచ్‌పై నాలుగో రోజున దక్షిణాఫ్రికా మాత్రం అదరగొట్టింది. ప్రత్యర్థిని ఫాలోఆన్ ఆడించకుండా బరిలోకి దిగిన సఫారీలు తమ రెండో ఇన్నింగ్స్‌ను 260/5 స్కోరు వద్ద డిక్లేర్ చేశారు. దీంతో ఆ జట్టుకు 548 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. స్టబ్స్ (94) త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. డి జోర్జి (49), రికెల్టన్ (35), ముల్డర్ (35 నాటౌట్) మార్క్‌క్రమ్ (29) రాణించారు. స్పిన్నర్ జడేజాకు నాలుగు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత 549 పరుగుల ఛేదనలో భారత్ మంగళవారం ఆట ముగిసే సమయానికి 15.5 ఓవర్లలో 27/2 స్కోరుతో నిలిచింది. జైస్వాల్ (13), రాహుల్ (6) నిరాశపర్చారు. క్రీజులో ఉన్న కుల్దీప్ (4 బ్యాటింగ్), సుదర్శన్ (2 బ్యాటింగ్) పరుగులు తీసేందుకు చెమటోడ్చుతున్నారు. విజయం కోసం భారత్ మరో 522 పరుగు లు చేయాల్సి ఉండగా, ఆఖరి రోజును అజేయంగా ముగించి డ్రా చేసుకోగలుగుతారా? అనేది వేచిచూడాల్సిందే.

1 స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టుల్లో ఎక్కువ వికెట్లు (46) తీసిన బౌలర్‌గా అశ్విన్‌తో సమంగా నిలిచిన జడేజా. ఓవరాల్‌గా ఈ టీమ్‌పై 50+ వికెట్లు తీసిన ఐదో భారత బౌలర్.

2 స్వదేశంలో భారత్‌కు 500+ పరుగుల లక్ష్యం ఎదురుకావడం ఇది రెండోసారి. 2004లో ఆసీస్ 543 పరుగుల టార్గెట్ విధించగా.. భారత్ 342 రన్స్ తేడాతో ఓడింది.



స్టబ్స్ (94)

తొలి సెషన్‌లో మూడు వికెట్లు

26/0 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నిం గ్స్ ఆరంభించిన సఫారీలను భారత బౌలర్లు ఏ మాత్రం ఇబ్బంది పెట్టలేకపోయారు. తొలి సెషన్‌లో మూడు వికెట్లు కోల్పోయినా 107 పరుగులు రాబట్టి తమ ఆధిక్యాన్ని 395 పరుగులకు చేర్చారు. ఓపెనర్లు రికెల్టన్, మార్క్‌క్రమ్ తొలి వికెట్‌కు 59 పరుగులు జోడించారు. ఈ ఇద్దరినీ జడేజా పెవిలియన్‌కు చేర్చాడు. కాసేపటికే కెప్టెన్ బవుమా (3)ను మరో స్పిన్నర్ సుందర్ అవుట్ చేశాడు. కానీ స్టబ్స్, డి జోర్జి మాత్రం రిస్కీ షాట్లకు వెళ్లకుండా సెషన్‌ను ముగించారు.

స్టబ్స్-డిజోర్జి శతక భాగస్వామ్యం: ఇక విరామం తర్వాత భారత బౌలర్ల కష్టాలు రెట్టింపయ్యాయి. స్టబ్స్-డి జోర్జి జోడీ స్పిన్నర్లను అలవోకగా ఎదుర్కొంటూ స్వీప్, రివర్స్ స్వీప్ షాట్లతో ఆకట్టుకున్నారు. స్టబ్స్‌కు జోర్జి తోడు కావడంతో మూడో వికెట్‌కు 101 పరుగుల భారీ భాగస్వామ్యం లభించింది. అయితే జోర్జిని 59వ ఓవర్‌లో జడేజా ఎల్బీ చేశాడు. ఈ సెషన్‌లో లభించిన ఏకైక వికెట్ ఇదే. కాసేపటికే స్టబ్స్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. ఆధిక్యం కూడా 500కు చేరింది. మరోవైపు అప్పటికే అలిసిపోయినట్టు కనిపించిన భారత ఫీల్డర్లు.. ప్రత్యర్థి డిక్లేర్ చేస్తుందేమోనని ఎదురు చూశారు. కానీ కెప్టెన్ బవుమా నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆటగాళ్లంతా లంచ్ బ్రేక్‌కు వెళ్లారు.

శతకానికి ఆరు పరుగుల దూరంలో..: 508 పరుగుల ఆధిక్యం ఉన్నప్పటికీ దక్షిణాఫ్రికా డిక్లేర్ చేయకుండా ఆఖరి సెషన్‌ను ఆరంభించడం ఆశ్చర్యపరిచింది. మరోవైపు వేగంగా ఆడే క్రమంలో నితీశ్, జడేజా ఓవర్లను లక్ష్యంగా చేసుకుని స్టబ్స్ బౌండరీలు సాధించాడు. ఇంకో ఎండ్‌లో ముల్డర్ సైతం బౌలర్లను విసిగించాడు. అయితే 79వ ఓవర్‌లో సిక్సర్‌తో 90 రన్స్ దాటిన స్టబ్స్‌ను జడేజా బౌల్డ్ చేయడంతో శతకానికి 6 పరుగుల దూరంలో వెనుదిరిగాడు. ఆ వెంటనే సఫారీల ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశారు.

ఒకే గ్రూప్‌లో భారత్, పాక్



ఫిబ్రవరి 15న హైవోల్టేజ్ మ్యాచ్ | టీ20 వరల్డ్‌కప్ షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ: ఇటీవలి కాలంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పెద్ద టోర్నీల్లో ఇరుజట్లనూ వేర్వేరు గ్రూపుల్లో ఆడిస్తారని భావించారు. కానీ, ఐసీసీ మాత్రం మరోసారి కాసులపైనే దృష్టిపెట్టింది. టీ20 వరల్డ్‌కప్‌లో చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్‌లు మరోసారి ఒకే గ్రూప్‌లో తలపడనున్నాయి. గ్రూప్-ఎలో ఫిబ్రవరి 15న కొలంబోలో ఇండో-పాక్ సమరం జరగనుంది. వచ్చే ఏడాది జరిగే పొట్టికప్ షెడ్యూల్‌ను ఐసీసీ చైర్మన్ జై షా మంగళవారం విడుదల చేశారు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న పొట్టికప్ ఫిబ్రవరి ఏడున ఆరంభం కానుండగా.. మార్చి 8న ఫైనల్ జరగనుంది. 20 జట్లు పాల్గొంటున్న టోర్నీలో మొత్తం 55 మ్యాచ్‌లకు ఢిల్లీ, కోల్‌కతా, అహ్మదాబాద్, చెన్నై, ముంబైతో పాటు శ్రీలంకలోని కొలంబో, క్యాండీలను వేదికలుగా ఖరారు చేశారు. పాక్ ఫైనల్ చేరకపోతే తుది పోరుకు అహ్మదాబాద్ ఆతిథ్యమిస్తుంది. అలాగే, పాక్ సెమీస్‌కు రాకుంటే.. ముంబై, కోల్‌కతాల్లో సెమీస్ మ్యాచ్‌లు నిర్వహించే చాన్సుంది. ఫిబ్రవరి 7న కొలంబోలో జరిగే టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో పాక్ ఆడనుంది. అదేరోజు ముంబైలో అమెరికాతో భారత్ తలపడనుంది. ఫిబ్రవరి 12న ఢిల్లీలో నమీబియాతో, 18న అహ్మదాబాద్‌లో నెదర్లాండ్స్‌తో టీమిండియా ఆడనుంది.

ఫార్మాట్ ఇలా..

టోర్నీలో పాల్గొంటున్న 20 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-ఎలో భారత్, అమెరికా, నమీబియా, నెదర్లాండ్స్, పాకిస్థాన్.. గ్రూప్-బిలో ఆస్ట్రేలియా, శ్రీలంక, జింబాబ్వే, ఐర్లాండ్, ఒమన్, గ్రూప్-సిలో ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, ఇటలీ, నేపాల్.. గ్రూప్-డిలో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, అఫ్ఘానిస్థాన్, కెనడా, యూఏఈ జట్లున్నాయి. ప్రతి గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన జట్లు సూపర్-8కు అర్హత సాధిస్తాయి. ముందుగా నిర్దేశించిన సీడింగ్‌ల ప్రకారం సూపర్-8 టీమ్‌లను రెండు గ్రూప్‌లుగా విభజిస్తారు. ఆ రెండు గ్రూపులలో టాప్-2లో నిలిచే జట్లు సెమీస్‌లో అమీతుమీ తేల్చుకొంటాయి. శ్రీలంక ఉన్న గ్రూప్-బితో పాటు పాక్ ఆడే మ్యాచ్‌లన్నీ (నాకౌట్ సహా) తటస్థ వేదికైన లంకలోనే జరగనున్నాయి.

టోర్నీ అంబాసిడర్‌గా రోహిత్



టోర్నీ ప్రచారకర్తగా భారత జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ వ్యవహరించనున్నాడు. 2024లో యూఎస్‌లో జరిగిన టోర్నీలో రోహిత్ సారథ్యంలో భారత్ వరల్డ్ చాంపియన్‌గా నిలిచింది. ఈ విజయ సంబరాల్లోనే రోహిత్ పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 489; భారత్ తొలి ఇన్నింగ్స్: 201;

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: రికెల్టన్ (సి) సిరాజ్ (బి) జడేజా 35, మార్క్‌క్రమ్ (బి) జడేజా 29, స్టబ్స్ (బి) జడేజా 94, బవుమా (సి) నితీశ్ (బి) సుందర్ 3, డి జోర్జి (ఎల్బీ) జడేజా 49, ముల్డర్ (నాటౌట్) 35; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 78.3 ఓవర్లలో 260/5 డిక్లేర్; వికెట్ల పతనం:** 1-59, 2-74, 3-77, 4-178, 5-260; **బౌలింగ్:** బుమ్రా 6-0-22-0, సిరాజ్ 5-1-19-0, జడేజా 28.3-3-62-4, కుల్దీప్ 12-0-48-0, సుందర్ 22-2-67-1, జైస్వాల్ 1-0-9-0, నితీశ్ 4-0-24-0.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 13, రాహుల్ (బి) హార్మర్ 6, సాయి సుదర్శన్ (బ్యాటింగ్) 2, కుల్దీప్ (బ్యాటింగ్) 4, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 15.5 ఓవర్లలో 27/2. వికెట్ల పతనం:** 1-17, 2-21; **బౌలింగ్:** యాన్సెన్ 5-2-14-1, ముల్డర్ 4-1-6-0, హార్మర్ 3.5-2-1-1, కేశవ్ 3-1-5-0.

డిక్లరేషన్ ఎందుకంత ఆలస్యం?

దక్షిణాఫ్రికా ముందే డిక్లేర్ చేస్తుందని అంతా భావించారు. కానీ భారత ఫీల్డర్లను వీలైనంతవరకూ మైదానంలోనే ఉంచి వారు అలసిపోయేలా చేయాలన్న వ్యూహంతోనే సఫారీలు ఆలస్యంగా డిక్లేర్ చేశారట. భారత ఓపెనర్లిద్దరూ అవుట వడం చూస్తే బవుమా చేసింది కరెక్టేనని ఒప్పుకోవాలి. పైగా పిచ్ ఇంకా బ్యాటింగ్‌కు పూర్తిగా సహకరిస్తుండడం కూడా ఆలస్యానికి ఓ కారణం. ఎలాగూ దక్షిణాఫ్రికా తొలి టెస్టులో గెలిచింది కాబట్టి, వారికి రెండో టెస్టును డ్రా చేసుకున్నా చాలు.

సమర్థంగా రైతువేదికల వినియోగం

» విత్తన చట్టం ముసాయిదాపై వివరించాం: తుమ్మల

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించి, నిరుపయోగంగా వదిలేసింది. ప్రజా ప్రభుత్వం ఆ రైతు వేదికల్లో దృశ్య, శ్రవణ మాధ్యమాలను ఏర్పాటుచేసి సమర్థంగా వినియోగిస్తోంది. రైతులను భాగస్వాములను చేస్తోంది' అని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం సచివాలయం నుంచి రైతునేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 30 వేల మంది రైతులు రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారని, ప్రభుత్వ పథకాలు, విత్తన చట్టం ముసాయిదాపై వివరించినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నదని ఆరోపించారు. ఈ సందర్భంగా జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం ద్వారా వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. 16 జిల్లాల్లోని రైతులకు 50% సబ్సిడీపై 5,500 క్వింటాళ్ల వరి విత్తనాలను అందించారు. కాగా, రాష్ట్రంలో ప్రారంభంకాని జిన్నింగ్ మిల్లులను వెంటనే ప్రారంభించాలని, పత్తి కొనుగోళ్లు ఎప్పటికప్పుడు చేపట్టాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, జిన్నింగ్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డితో ఆయన వ్యాట్సాప్ ద్వారా. జిన్నింగ్ మిల్లర్లు సమ్మె విరమించి కొనుగోళ్లు ప్రారంభిస్తామని చెప్పినప్పటికీ.. పూర్తిస్థాయిలో మిల్లులు తెరవలేదని అన్నారు. పత్తి రైతులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని తుమ్మల ఆదేశించారు.


వరి విత్తనాల పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

5 మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలు

రాష్ట్రంలో ఐదు మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలు నియమించినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. సిద్దిపేట జిల్లా తొగుట, దౌల్తాబాద్, మిరుదొడ్డి, దుబ్బాక, చేగుంట మార్కెట్లకు ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లతో పాటు సభ్యులను నియమించినట్లు వెల్లడించారు.

ఈశాన్య రాష్ట్రాల పురోగతిలో భాగస్వామ్యం

» కీలకరంగాల్లో కలిసి పనిచేసేలా రోడ్‌మ్యాప్: శ్రీధర్‌బాబు

» తెలంగాణ-ఈశాన్య రాష్ట్రాల రెండో దశ ఉత్సవం ప్రారంభం



హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆశాజనక వృద్ధి కేంద్రాలుగా మారుతున్న ఈశాన్య రాష్ట్రాల పురోగతిలో భాగస్వామ్యం అయ్యేందుకు తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. డిజిటల్ కనెక్టివిటీ, స్కిల్ డెవలప్‌మెంట్, లైఫ్ సైన్సెస్, బయో ఇన్నోవేషన్, రూరల్ గ్రోత్ తదితర రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యానికి సమగ్ర రోడ్ మ్యాప్ రూపొందిస్తామని చెప్పారు. మంగళవారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన తెలంగాణ-ఈశాన్య రాష్ట్రాల కనెక్ట్(రెండో దశ) ప్రారంభోత్సవానికి శ్రీధర్‌బాబు విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ ఉత్సవాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రాంతం, రాష్ట్రంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ అక్కున చేర్చుకునే గొప్ప మనస్సు తెలంగాణ ప్రజలదని పేర్కొన్నారు. ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ యూనివర్సిటీ తెలంగాణను గ్లోబల్ హబ్‌గా మార్చుతాయన్నారు. లైఫ్ సైన్సెస్‌లో స్టార్టప్‌లను ప్రోత్సాహించేందుకు టీహబ్ తరహాలో వన్‌బయో పేరిట ప్రత్యేక ఇంక్యుబేషన్ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. రాబోయే రోజుల్లో నార్త్‌ఈస్ట్ తెలంగాణ టెక్ కారిడార్, జాయింట్ ఇన్నోవేషన్ ల్యాబ్స్, బయో ఇంక్యుబరేటర్లు, క్రియేటివ్ టెక్ స్టూడియోలు, గ్రీన్ ఎనర్జీ కొలాబరేషన్‌లకు సంబంధించి ఈశాన్య రాష్ట్రాలతో కలిసి పనిచేస్తామని ఆయన చెప్పారు.

నిరంజన్‌రెడ్డి జైలుకెళ్లడం ఖాయం

» వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి త్వరలోనే జైలుకు వెళ్లడం ఖాయమని వనపర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత పదేళ్లలో బీఆర్ఎస్ నాయకులు చేసిన అవినీతితో పాటు ఇక్కడ అవినీతికి పాల్పడిన నాయకుడిపై తాము ముఖ్యమంత్రికి, ఏసీబీ, విజిలెన్స్, సీబీఐలకు ఫిర్యాదు చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా తిరుగుతున్న కల్వకుంట్ల కవిత.. వారి కుటుంబ సభ్యులైన కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, సంతోష్‌లతో ఉన్న ఆస్తి పంపకాల గొడవలతోనే కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారన్నారు. కవిత చేసిన ఆరోపణలు నిజంకావని నిరంజన్‌రెడ్డి వనపర్తి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రమాణం చేయగలరా అని ఆయన ప్రశ్నించారు.

అర్చక, ఉద్యోగులే దేవాదాయ శాఖకు వెన్నెముక

» వన్యప్రాణుల సంరక్షణ.. దేశంలోనే భేష్: మంత్రి సురేఖ

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అర్చకులు, ఉద్యోగులే దేవాదాయ శాఖకు వెన్నెముక అని మంత్రి కొండా సురేఖ అన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పదవీ విరమణ చేసిన అర్చక, ఉద్యోగులు, విధి నిర్వహణలో మృతి చెందిన వారి కుటుంబాలకు సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ఆర్థిక సహాయం అందించారు. 36 మంది అర్చక, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు రూ. 96.21 లక్షల చెక్కులు అందించారు. కాగా, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వన్యప్రాణులను సంరక్షించడంలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. దేశంలోనే మొట్టమొదటి టైగర్ ప్రొటెక్షన్ సెల్‌ను మంగళవారం సచివాలయంలోని తన చాంబర్ నుంచి మంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణుల రక్షణకు కొత్తగా హైటెక్ టైగర్ మానిటరింగ్ సెల్, కమాండ్ హబ్ ఏర్పాటయిందని వివరించారు. దీంతో పులుల సంచారం, టైగర్ రిజర్వులను పర్యవేక్షించవచ్చని తెలిపారు.

ఎన్నికల కోసమే చీరలు, రుణాల పంపిణీ

» మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వరా?: హరీశ్‌రావు



సిద్దిపేట/జమ్మికుంట రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల స్టంట్‌లో భాగంగానే మహిళా సంఘాల సభ్యులకు చీరలు, వడ్డీలేని రుణాలు పంపిణీ చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మంగళవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో సిద్దిపేట నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘం సభ్యులకు వడ్డీలేని రుణాల చెక్కులను జిల్లా కలెక్టర్ కె.హైమావతితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రతి బతుకమ్మ పండుగకి 18 ఏళ్లు నిండిన కోటి 30 వేల మంది మహిళలకు చీరలను అందించారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లో ఉన్న సుమారు 46 లక్షల మందికి మాత్రమే చీరలను అందిస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి ఇస్తామన్న నెలకు రూ. 2,500 సంగతి ఏమైందని, రెండేళ్ల నుంచి మహిళలకు బకాయి పడ్డ రూ. 60 వేలు ఇచ్చి సారె పెట్టాలని డిమాండ్ చేశారు. రెండు చీరలు ఇస్తామని చెప్పి ఒకటే చీర ఇస్తున్నారని, కాంగ్రెస్‌కు మహిళలు ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు ఉగ్రవాదుల కంటే ప్రమాదకరంగా మారారని హరీశ్ రావు విమర్శించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం తనుగుల గ్రామంలో ఇటీవల కూలిపోయిన చెక్‌డ్యామ్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఉగ్రవాదులు కూడా సాగునీటి ప్రాజెక్టులను ముట్టుకోరన్నారు. గతంలో లక్ష క్యూసెక్కుల నీరు వచ్చినా చెక్కు చెదరని చెక్‌డ్యామ్ ఇప్పుడు ఎందుకు కూలిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

ముందు మీ చెల్లెకి సమాధానమివ్వు కేటీఆర్

» మీరు అవినీతిపై మాట్లాడడం హాస్యాస్పదం: మల్లు రవి

న్యూఢిల్లీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల అవినీతి బాగోతం గురించి మాజీ సీఎం కేసీఆర్ కూతురు కవిత నేరుగా చెబుతున్నారని, ముందు తన సొంత చెల్లెలు ఆరోపణలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఎద్దేవా చేశారు. రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని కేటీఆర్ ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని మంగళవారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాకు చెప్పారు. అవినీతికి కేరాఫ్ బీఆర్ఎస్ పార్టీ అని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలు నిర్మాణాత్మక విమర్శలు చేయాలని హితబోధ చేసిన మల్లు రవి.. మీడియాలో ప్రచారం కోసం నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు సహించరని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని భావించామని, కానీ.. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో జాప్యంజరిగితే రాష్ట్ర ఖజానాకు రూ.3,500 కోట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. అందుకే పార్టీ పరంగానే 42% బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

పరిశ్రమల భూములతో కాంగ్రెస్ రియల్ దందా!

» బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమలు నడిపేందుకు ఇచ్చిన భూములతో సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ దందా చేయాలనుకుంటున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు ఆరోపించారు. ఖైరతాబాద్ జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితతోపాటు పలువురు కార్పొరేటర్లు పారిశ్రామిక వాడల భూములను అమ్మేలా రూపొందించిన పాలసీని రద్దు చేయాలంటూ ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ.. రూ. 5 లక్షల కోట్ల విలువైన 9,292 ఎకరాల భూములను అమ్మేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అతి పెద్ద స్కామ్‌కు తెర లేపిందని ఆరోపించారు.

భవిష్యత్తుకు బ్రాండింగ్

అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేలా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు ప్రచారం ఉండాలి

» తెలంగాణ గతం, వర్తమానం, భవిష్యత్‌లను ప్రతిబింబించాలి

» మన కళలు, ప్రముఖులను ప్రచారంలో వినియోగించాలి

» ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం


అధికారులతో సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్ నిలిచేలా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు'లో బ్రాండింగ్ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో విభాగాల వారీగా చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతి అంశం కూడా ప్రచారంలో ప్రముఖంగా ఉండేలా చూడాలని సూచించారు. పెట్టుబడిదారులకు రాష్ట్రం కల్పించే సదుపాయాలను సమగ్రంగా వివరించాలని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా.. భారత్ ఫ్యూచర్ సిటీలో వచ్చే నెల 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సును నిర్వహించనున్న విషయం తెలిసిందే. దేశ, విదేశీ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇతర రంగాల ప్రముఖులు పాల్గొననున్న నేపథ్యంలో.. సదస్సుకు బ్రాండింగ్ చేయడంపై సీఎం మంగళవారం రాత్రి సమీక్ష నిర్వహించారు. వివిధ సంస్థలు రూపొందించిన ప్రచార చిత్రాలు, వీడియోలను వీక్షించి పలు మార్పులు, చేర్పులు సూచించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. భారత్ ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి పనులు, సదుపాయాలను పెట్టుబడిదారులకు సమగ్రంగా వివరించాలని సూచించారు. హైదరాబాద్‌కు అనుకూల అంశాలైన ఇన్నర్ రింగు రోడ్డు, ఔటర్ రింగు రోడ్డు, రానున్న రీజనల్ రింగు రోడ్డు, బందరు పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ హైవే, రైలు మార్గం, డ్రైపోర్ట్‌తోపాటు తెలంగాణలోని కళా, సాంస్కృతిక, భాష, వాతావరణ అనుకూలతలను వివరించాలని నిర్దేశించారు. రాష్ట్రంలో 1999 నుంచి ఇప్పటి వరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా విధానపరమైన నిర్ణయాల్లో ఎటువంటి మార్పులేని అంశాన్ని, పెట్టుబడుల విషయంలో మద్దతుగా నిలుస్తున్న విషయాన్ని ప్రత్యేకంగా వివరించాలని సూచించారు.

మన ప్రత్యేకతలను వివరించాలి

తెలంగాణ బ్రాండింగ్‌కు సంబంధించి మన రాష్ట్రానికే పరిమితమైన, వైవిధ్యమైన ప్రత్యేకతలను చేర్చాలని సమీక్షలో సీఎం సూచించారు. రామప్ప నంది, సమ్మక్క సారక్క జాతర, నల్లమల పులులు, మహబూబ్‌నగర్ జిల్లాకే ప్రత్యేకమైన ఎద్దులు, తెలంగాణ నుంచి జాతీయ రాజకీయాలను శాసించిన పీవీ వంటి ప్రముఖులు, కళాకారులు, క్రీడాకారులు, అంతర్జాతీయ కంపెనీలకు నాయకత్వం వహిస్తున్న ప్రముఖులు ఇలా ప్రతి అంశానికి బ్రాండింగ్‌లో చోటు కల్పించాలని చెప్పారు. పత్రికలు, చానళ్లు, డిజిటల్ వేదికలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. సమీక్షలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వివిధ అంశాలపై వరుసగా సమీక్షలు..

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు ఏర్పాట్లు, నిర్వహణ, ఇతర అంశాలపై సీఎం ప్రతిరోజూ సమీక్ష నిర్వహించనున్నారు. బుధవారం రవాణా ఏర్పాట్లపై మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష ఉంటుంది. 27న సదస్సు కోసం కల్పించే మౌలిక వసతులపై మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, సీతక్క, అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. 28న సాయంత్రం 4 గంటలకు విద్య, యువజన సంక్షేమంపై మంత్రులు వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, అధికారులతో.. సాయంత్రం 6 గంటలకు పర్యాటకం, టెంపుల్ టూరిజంపై మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖలతో సమీక్షిస్తారు. 29న సాయంత్రం 4 గంటలకు వ్యవసాయం, సంక్షేమ విభాగాలపై మంత్రులు తుమ్మల, ఉత్తమ్, వాకిటి శ్రీహరి, సంబంధిత అధికారులతో.. సాయంత్రం 6 గంటలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, అజారుద్దీన్‌లతో సమావేశాలు నిర్వహిస్తారు. 30న ఆరోగ్య రంగంపై మంత్రి రాజనర్సింహ, అధికారులతో సమీక్షిస్తారు.

ఏపీలో 3 కొత్త జిల్లాలు

రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా

» మిగతా రెండూ.. మార్కాపురం, మదనపల్లె

» కొత్తగా ఐదు రెవెన్యూ డివిజన్లు కూడా!

» ఏపీ మంత్రివర్గ ఉపసంఘం సిపారసు

» సవరించిన నివేదికకు చంద్రబాబు ఓకే

» ఫైలుకు నేడు ఆన్‌లైన్‌లో మంత్రుల ఆమోదం

అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మూడు కొత్త జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. పోలవరం ముంపు మండలాలవాసులకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినట్లుగా.. రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను కొత్తగా ఏర్పాటు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు చేసింది. ఏపీ రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలోని ఈ సబ్‌కమిటీ కొత్త జిల్లాల పునర్వ్యవస్థీకరణను కొలిక్కితెచ్చింది. మంగళవారం చంద్రబాబును కలిసి.. సవరించిన అధ్యయన నివేదికను సమర్పించింది. అందులో మూడు కొత్త జిల్లాలు.. మార్కాపురం, మదనపల్లె, పోలవరంతో పాటు ఐదు రెవెన్యూ డివిజన్లు..(నక్కపల్లి, అద్దంకి, పీలేరు, మడకశిర, బనగానపల్లె), కొత్తగా పెద్ద హరివాణం మండలంఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. ఆ నివేదికపై చంద్రబాబు ఉపసంఘం సభ్యులతో సుదీర్ఘంగా చర్చించారు. ఆ తర్వాత కూడా అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. సుదీర్ఘ చర్చల అనంతరం నివేదికను బాబు ఆమోదించారు. మార్పులు, చేర్పులకు సంబంధించిన ఫైలును రెవెన్యూ శాఖ సిద్ధం చేస్తోంది. బుధవారం దానిని ఏపీ మంత్రులకు సర్క్యులేట్ చేసి ఆన్‌లైన్‌లోనే ఆమోదం తీసుకుంటారు. ఆ వెంటనే రెవెన్యూ శాఖ ప్రాథమిక గెజిట్ నోటిఫికేషన్లు జారీచేస్తుంది. అభ్యంతరాలకు నెల రోజులు గడువిస్తారు. ఆ తర్వాత తుది నోటిఫికేషన్ ఇస్తారు.

కష్టకాలంలోనూ కాంగ్రెస్‌లో ఉన్నోళ్లే అభ్యర్థులు

సంగారెడ్డిలోని 84 గ్రామాల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి.. సీఎం రేవంత్‌తో మాట్లాడి గ్రామాలకు నిధులు ఇప్పిస్తా

» ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఆర్థికంగా సహకరించాలి

» కాంగ్రెస్ ఇస్తున్న పథకాల గురించి చెప్పి ఓట్లు అడగాలి

» పార్టీకి వ్యతిరేకంగా పని చేసే వారెవరైనా క్షమించబోను

» సంగారెడ్డి, పటాన్‌చెరులో పరిశ్రమల స్థాపనకు ఏర్పాట్లు

» ముఖ్య కార్యకర్తల సమావేశంలో జగ్గారెడ్డి వ్యాఖ్యలు

సంగారెడ్డి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలో లేనప్పుడు సైతం పార్టీ కండువా కప్పుకొని పని చేసిన వారినే సర్పంచ్ అభ్యర్థులుగా ఎంపిక చేయాలని, వారి వద్ద డబ్బులున్నా.. లేకున్నా.. సర్పంచ్‌లుగా గెలిపించుకురావాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి సూచించారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలోని 84 గ్రామాల్లో కాంగ్రెస్ తరఫున సర్పంచ్‌లను గెలిపించి తీసుకొస్తే, సీఎం రేవంత్‌రెడ్డి దగ్గరకు తీసుకెళ్లి నిధులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. సోనియా, రాహుల్, ఖర్గే నాయకత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, రూ.2లక్షల రుణమాఫీ, వరికి బోనస్, రైతు భరోసా గురించి చెప్పి ఓట్లు అడగాలన్నారు. రిజర్వేషన్‌పై పోటీ చేసే ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు ఇతర నేతలు ఆర్థికంగా సహకరించాలని సూచించారు. సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే.. ఎంతటి వారైనా క్షమించనని జగ్గారెడ్డి హెచ్చరించారు. గత సీఎంలు వైఎస్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి సహకారంతో సంగారెడ్డి జిల్లాలో ఐఐటీ, సంగారెడ్డి- పటాన్‌చెరు ఫోర్ లేన్ రోడ్డు, అకోలా-నాందేడ్ రోడ్డు, సంగారెడ్డికి మంజీరా నీళ్లు, వ్యవసాయ వర్సిటీతోపాటు పలు మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో ఓడిపోయినా.. సీఎం రేవంత్‌రెడ్డితో తరచూ మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గానికి అత్యధికంగా నిధులు తీసుకొస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో సంగారెడ్డి, పటాన్‌చెరు ప్రాంతాలకు అనేక పరిశ్రమలు తీసుకురానున్నామని, ఆ దిశగా ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో సంగారెడ్డిలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తన భార్య నిర్మల పోటీ చేస్తుందని వెల్లడించారు. ఈ విషయమై రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ చెప్పినా తాను పోటీ చేయబోనని స్పష్టం చేశారు.


సంగారెడ్డి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి, పక్కన టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మల

డీసీసీ అధ్యక్షుడిగా కైలాష్ సరికాదు

అతడిని తప్పించండి.. సమర్థులకు అవకాశమివ్వండి.. తనను, తన కుటుంబ సభ్యులను దుర్భాషలాడారు

» ఆ వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు

» సీఎం, పీసీసీ చీఫ్, ఏఐసీసీ నేతలకు మంత్రి కోమటిరెడ్డి ఫిర్యాదు.. మంత్రివర్గ సమావేశంలోనూ ప్రస్తావన



నల్లగొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ డీసీసీ అధ్యక్షుడిగా వున్న కైలాష్ నేత సరికాదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. డీసీసీ బాధ్యతల నుంచి కైలాష్‌ను తప్పించి, సమర్థులకు అవకాశం ఇవ్వాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడిగా తాజాగా నియమితులైన కైలాష్ తనను, తన కుటుంబ సభ్యులను అవమానించే రీతిలో అకారణంగా దుర్భాషలాడిన వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని వెంకటరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు లేఖలు రాశారు. ఆ వీడియోలను, వాటి సమాచారాన్ని సైతం పెన్‌డ్రైవ్‌ల ద్వారా అందజేశారు. కైలాష్ గతంలో తనను ఇలాగే దూషించినా తాను ఏమీ అనలేదని, ఇప్పుడు బాధ్యత కలిగిన పదవిలోకి వచ్చిన తర్వాత కూడా అసభ్యకర పదజాలంతో ఉన్న వీడియోలను వైరల్ చేయించడం తనకు ఆవేదన కలిగించిందని వెంకటరెడ్డి పేర్కొన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు. కైలాష్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, అతడిని డీసీసీ అధ్యక్ష పదవి నుంచి తప్పించి, సమర్థులకు అవకాశం ఇవ్వాలని సీఎంకు రాసిన లేఖలో కోరారు. తన రాజకీయ జీవితంలో ఏనాడూ ఎవరిపైనా వ్యక్తిగతంగా కక్ష సాధింపు ధోరణికి పాల్పడలేదని, అయిదుసార్లు ఎమ్మెల్యేగా, ఒక పర్యాయం ఎంపీగా గెలిచానని, తెలంగాణ కోసం నాడు మంత్రి పదవిని త్యజించానని పేర్కొన్నారు. మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలోనూ వెంకటరెడ్డి ఈ అంశాన్ని ప్రస్తావించి ఆవేదన వ్యక్తం చేయగా సీఎం, ఇతర మంత్రులు సముదాయించినట్లు తెలిసింది. కాగా, మంత్రి ఫిర్యాదును సీఎం, పీసీసీ చీఫ్ సీరియస్‌గా తీసుకున్నట్లు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. డీసీసీ బాధ్యతల విషయంలో ఏం చేయాలనే అంశంపై జిల్లా ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని స్థానికంగా చర్చ సాగుతోంది. పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన సందర్భంలో డీసీసీ అధ్యక్ష వ్యవహారంపై రాజకీయ రచ్చ రేగడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మంత్రి వెంకటరెడ్డి స్వయంగా ఫిర్యాదు చేయడంతో ఈ విషయంపై మాట్లాడేందుకు, ప్రస్తావించేందుకు ఇతర నేతలెవరూ సుముఖత చూపలేదు. సీఎం, పార్టీ అధిష్ఠానమే నిర్ణయం తీసుకుంటుందని పేర్కొంటున్నారు. ఈ విషయమై కైలాష్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా తాను మంగళవారం ఉదయం మంత్రి వెంకటరెడ్డిని కలిసి క్షమాపణ కోరానని తెలిపారు. పెద్ద మనసుతో తనను క్షమించాలని, నల్లగొండ జిల్లాలో ఆయన సూచనలు, సలహాల మేరకు పనిచేస్తానని తెలిపానని చెప్పారు.

'అండమాన్'లో వాయుగుండం.. బంగాళాఖాతంలో అల్పపీడనం

» 28 నుంచి పెరగనున్న వర్షాలు: ఐఎండీ

» పంటలు కాపాడుకోవాలని సూచన

విశాఖపట్నం/అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మలక్కా జలసంధి, మలేషియా, దానికి ఆనుకుని దక్షిణ అండమాన్ సముద్రం పరిసరాల్లో ఉన్న తీవ్ర అల్పపీడనం మంగళవారం నాటికి బలపడి వాయుగుండంగా మారింది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమంగా, ఆ తర్వాత 24 గంటలు పశ్చిమ వాయవ్యంగా పయనించే క్రమంలో మరింత బలపడనుంది. ఆ తర్వాత మధ్య బంగాళాఖాతం వైపు పయనిస్తూ క్రమేపీ బలహీనపడుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీనిపై బుధ, గురువారాల్లో మరింత స్పష్టత వస్తుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. మరోవైపు నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక పరిసరాల్లో మంగళవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది ఉత్తర వాయవ్యంగా పయనించి బుధవారానికి తీవ్ర అల్పపీడనంగా, ఆ తర్వాత 24 గంటల్లో వాయుగుండంగా మారుతుంది. ఆ తర్వాత మూడు రోజుల్లో వాయవ్యంగా పయనించి ఉత్తర తమిళనాడు తీరం దిశగా రానున్నది. ఆ తర్వాత కూడా ఉత్తరం/వాయవ్యంగా పయనించి కోస్తాంధ్ర వైపు పయనించి దక్షిణ కోస్తాంధ్రలో తీరం దాటుతూ బలహీనపడుతుందని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో ఈనెల 28వ తేదీ నుంచి వర్షాలు పెరుగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 29న రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో అనేకచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరుగా, అక్కడక్కడ భారీగా, ఉత్తరకోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయి. ఈనెల 30, డిసెంబరు ఒకటి తేదీల్లో ఏపీ, తెలంగాణలోని అనేక జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కోస్తా, రాయలసీమల్లో వరి, పత్తి రైతులు ఈనెల 28వ తేదీ నుంచి అప్రమత్తంగా ఉండాలని వాతావరణ నిపుణుడొకరు పేర్కొన్నారు.

మూడు కార్పొరేషన్లుగా జీహెచ్ఎంసీ!

- పాలనా సౌలభ్యం కోసమేనంటున్న అధికార వర్గాలు
- మార్చిలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)' త్వరలో మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా మారబోతోందా? ప్రస్తుతమున్న హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల తరహాలో, వాటికి సమాంతరంగా ఈ మూడు కార్పొరేషన్లను ఏర్పాటు చేయనున్నారా? ఈ ప్రశ్నలకు రాష్ట్ర పురపాలక శాఖ వర్గాలు అవుననే సమాధానం చెబుతున్నాయి. 27 మున్సిపాలిటీలు/కార్పొరేషన్ల విలీనంతో అతి భారీగా నగరంగా మారుతుండటంతో.. పాలనా సౌలభ్యం కోసం కోర్ అర్బన్ ప్రాంతాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని అంటున్నాయి. ప్రస్తుత జీహెచ్ఎంసీ పరిధితో హైదరాబాద్ కార్పొరేషన్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లకు సమాంతరంగా మిగతా రెండు కార్పొరేషన్లు ఉండే అవకాశం ఉందని.. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని అధికారులు తెలిపారు. ఆయా కార్పొరేషన్ల పరిధిలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా డివిజన్ల ఏర్పాటు, సరిహద్దులను నిర్ధారించడంపై కసరత్తు జరుగుతోందని వెల్లడించారు.


పకడ్బందీ పర్యవేక్షణకు వీలుగా..

ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధి 650 చ.కి.మీ వరకు ఉంది. 20 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్ల విలీనంతో జీహెచ్ఎంసీ (కోర్ అర్బన్ రీజియన్)లోకి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా నుంచి సుమారు 1,085 చ.కి.మీ., రంగారెడ్డి జిల్లా నుంచి 700 చ.కి.మీ., సంగారెడ్డి నుంచి 300 చ.కి.మీ ప్రాంతం చేరే అవకాశం ఉందని పురపాలక శాఖ అంచనా వేసింది. మొత్తం విస్తీర్ణం 2,700 చదరపు కిలోమీటర్లకుపైగా, జనాభా 2 కోట్లకు పైగా ఉండనుంది. దీనితో పాలనాపరమైన నిర్ణయాల అమలు, పర్యవేక్షణ పెద్ద సవాలుగా మారుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలోనే అన్ని ప్రాంతాలను కమిషనర్ పర్యవేక్షణ చేయలేని పరిస్థితి ఉందని గుర్తు చేస్తున్నారు. ఈ క్రమంలోనే కోర్ అర్బన్ ప్రాంతంలో మూడు కార్పొరేషన్ల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోందని.. దీనికి సంబంధించిన పాలనాపరమైన ప్రక్రియ అంతా మార్చి నాటికి ముగిసే అవకాశం ఉందని అంటున్నారు. ప్రస్తుత జీహెచ్ఎంసీ పాలక వర్గం గడువు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ముగుస్తుంది. తర్వాత ప్రత్యేకాధికారుల పాలనలో కోర్ అర్బన్‌పై విధివిధానాలను ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ చట్టం, పురపాలక చట్టాలను సవరించే బదులు 'ఒకే చట్టం.. ఒకే రాష్ట్రం' ప్రాతిపదికన కోర్ అర్బన్ పరిధిలో పురపాలక చట్టాన్ని అమలు చేస్తే గందరగోళానికి తావు ఉండదని, సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ప్రతిపాదన కూడా ఉన్నట్టు తెలిసింది.

దేశంలో హైదరాబాదే బాద్‌షా!

శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల విలీనంతో హైదరాబాద్ దేశంలోని మెట్రో నగరాలకే 'బాద్‌షా'గా అవతరించనుంది. దేశ రాజధాని న్యూఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబై, ఐటీ క్యాపిటల్ బెంగళూరుతోపాటు చెన్నై, కోల్‌కతా తదితర మెట్రో నగరాలను వెనక్కి నెట్టి అగ్రభాగంలో నిలవనుంది. దేశంలోనే కాదు అంతర్జాతీయంగానూ ప్రాచుర్యం పొందనుంది. నిజానికి కొన్నేళ్లుగా హైదరాబాద్ నగరం నలుదిక్కులా శరవేగంతో విస్తరించింది. ఇతర మెట్రో నగరాలతో పోల్చితే జీవన వ్యయం తక్కువగా ఉండటం, భాషా సమస్య లేకపోవడంతో విద్య, ఉద్యోగావకాశాలు, వ్యాపారం కోసం రెండు తెలుగు రాష్ట్రాల నుంచేకాకుండా దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల వారు హైదరాబాద్‌లో స్థిరపడుతున్నారు. దానితో నగరం ఇప్పటికే ఔటర్ రింగు రోడ్డు దాటిపోయింది. ఇప్పటికే ఫార్మా రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న హైదరాబాద్.. ఐటీలోనూ బెంగళూరును మించి దూసుకుపోతోంది. బయోటెక్నాలజీ, ఇతర వ్యాపార, వాణిజ్య రంగాల వృద్ధి వేగంగా సాగుతోంది. మొత్తంగా ఓవైపు చారిత్రాత్మక నేపథ్యం, మరోవైపు అత్యాధునిక హైటెక్ నగరంగా విలసిల్లుతోంది.

మెగా హైదరాబాద్



(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. విలీనం కానున్న మునిసిపాలిటీల్లో కొన్నింటి పరిధి ఓఆర్ఆర్ అవతల కూడా విస్తరించి ఉంది. ప్రస్తుతం 150 మునిసిపల్ డివిజన్లతో ఉన్న జీహెచ్ఎంసీ పరిధి కొత్తవాటి విలీనంతో మూడింతలు పెరగనుంది. నగర పరిధి దాదాపు 2,735 చదరపు కిలోమీటర్లు ఉండనుంది. జనాభా దాదాపు రెండు కోట్లు ఉంటుంది. తాజాగా విలీన కానున్న 27 మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల పాలక మండళ్ల గడువు ముగిసి చాలా కాలమైంది. అక్కడ ఎన్నికలు నిర్వహించకపోవటంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ప్రస్తుత జీహెచ్ఎంసీ పాలకమండలి గడువు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ముగుస్తుంది.

విలీన ప్రతిపాదనపై అధ్యయనానికి బల్దియా ఓకే..!

జీహెచ్ఎంసీలో 27 మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల విలీన ప్రతిపాదనపై అధ్యయనం చేసి నివేదికతో కూడిన అభిప్రాయం చెప్పేందుకు బల్దియా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మంత్రివర్గం నిర్ణయం నేపథ్యంలో విలీన ప్రతిపాదనను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ మంగళవారం కౌన్సిల్ ముందు ఉంచారు. జీహెచ్ఎంసీ చట్టం 1955 ప్రకారం విలీన ప్రతిపాదనపై అవసరమైన అధ్యయనం చేసి అభిప్రాయం తెలపాలని ఈ నెల 21న సర్కారు బల్దియాకు మెమో పంపింది. దీంతో టేబుల్ ఎజెండాగా ఈ అంశాన్ని కౌన్సిల్‌లో ప్రస్తావించగా మెజార్టీ సభ్యులు ఆమోదించారు. విలీన ప్రతిపాదనపై ఎంఐఎం అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే, సర్కారు నిర్ణయంపై అభ్యంతరం తెలపడం సబబు కాదంటూ.. అభిప్రాయం చెప్పాలన్న ప్రతిపాదనను ఆమోదిస్తున్నట్టు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రకటించారు. జీహెచ్ఎంసీ పాలక మండలి గడువు ముగిసిన తర్వాతే విలీనం జరుగుతుందని ఓ అధికారి తెలిపారు. విలీనం అనంతరం మొత్తం ప్రాంతాన్ని విభజించే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు. సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. డివిజన్ల పునర్విభజన, కార్పొరేషన్ల విభజన ఒకటి రెండు నెలల్లో పూర్తవుతుందని చెప్పారు.

సమగ్రాభివృద్ధి కోసమే..

జీహెచ్ఎంసీలో విలీనం కానున్న మునిసిపాలిటీల్లో శంషాబాద్, నార్సింగి, మేడ్చల్ పరిధి ఓఆర్ఆర్‌కు బయట 2-3 కి.మీ దూరం వరకు విస్తరించి ఉంది. ఇవి ఓఆర్ఆర్ గ్రోత్ కారిడార్‌లో ఉండడంతో అక్కడ పట్టణీకరణ శరవేగంగా జరుగుతోంది. మిగతా ప్రాంతాల్లో ఇంత వేగంగా పట్టణీకరణ లేదు. పైగా ఈ మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో అభివృద్ధి, పట్టణ ప్రణాళికలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పెరుగుతున్న పట్టణీకరణ ఒత్తిడిని, వనరుల పంపిణీలో అసమానతల వల్ల మౌలిక వసతుల కల్పనలో ప్రాంతాల మధ్య సమతుల్యత లోపించటాన్ని ప్రభుత్వం గుర్తించింది. మెట్రోపాలిటన్ ప్రాంతంలో ఒకేతరహా అభివృద్ధి ప్రణాళికను అమలు చేసేదిశగా విలీన నిర్ణయం తీసుకుంది. అన్ని ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడం, అస్తవ్యవస్త కాలనీల ఏర్పాటును నిలువరించడం, జనాభా ఒత్తిడిని అధిగమించడం, విపత్తుల నిర్వహణను సులభతరం చేయడం, అన్ని ప్రాంతాలకు పెట్టుబడులు వచ్చేలా ప్రణాళికలు తయారు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఓఆర్ఆర్ వరకు మెట్రోపాలిటన్ ప్రణాళికలను అమలుచేసే దిశగా విలీన ప్రక్రియను చేపట్టినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఈ నెల 21న జారీచేసిన మెమోలో తెలిపారు.

అందరికీ ఒకే రకం వేతనాలు

జీహెచ్ఎంసీ విస్తరణతో ఓఆర్ఆర్ అవతలి ప్రాంతాలకు కూడా హైదరాబాద్ ప్రధాన కేంద్రంలో ఉన్న సౌకర్యాలు లభించనున్నాయి. తాగునీటి నిర్వహణలో వాటర్‌బోర్డు ప్రస్తుతం ఔటర్ లోపలి ప్రాంతాల్లో ముఖ్య భూమిక పోషిస్తోంది. ఇకపై ఓఆర్ఆర్ అవతల ఉన్న కొన్ని ప్రాంతాలకు కూడా ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ ప్రాంతాల్లో పారిశుధ్యం, ఇతర పనులను జీహెచ్ఎంసీ చూసుకోనుంది. విలీనం కానున్న 27 మునిసిపాలిటీ ఉద్యోగులు జీహెచ్ఎంసీ పరిధిలోకి రానుండటంతో వారి జీతభత్యాలు కూడా జీహెచ్ఎంసీనే చెల్లిస్తుంది. ప్రస్తుతం జీహెచ్ఎంసీలోని పారిశుధ్య సిబ్బందికి ఇస్తున్నట్లుగానే విలీన ప్రాంతాల సిబ్బందికి కూడా వేతనాలు ఇస్తారు. మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల కార్యాలయాలన్నీ జీహెచ్ఎంసీలో సర్కిల్, జోనల్ కార్యాలయాలుగా మారుతాయి. అక్కడ పన్నుల విధానం కూడా జీహెచ్ఎంసీలో ఉన్నట్లుగానే మారుతుంది.

విలీనం కానున్న మునిసిపాలిటీలు

1.పెద్ద అంబర్‌పేట, 2.జల్‌పల్లి, 3.శంషాబాద్, 4.తుర్కయాంజాల్, 5.మణికొండ, 6.నార్సింగి, 7.ఆదిభట్ల, 8.తుక్కుగూడ, 9.మేడ్చల్, 10.దమ్మాయిగూడ, 11.నాగారం, 12.పోచారం, 13.ఘట్‌కేసర్, 14. గుండ్లపోచంపల్లి, 15.తూంకుంట, 16.కొంపల్లి, 17.దుండిగల్, 18.బొల్లారం, 19. తెల్లాపూర్, 20. అమీన్‌పూర్.

విలీనం కానున్న 7 మునిసిపల్ కార్పొరేషన్లు

1.బడంగ్‌పేట, 2.బండ్లగూడ జాగీర్, 3.మీర్‌పేట, 4.బోడుప్పల్, 5.పీర్జాదిగూడ, 6.జవహర్‌నగర్, 7.నిజాంపేట.

జీహెచ్ఎంసీ.. మినీ తెలంగాణ

విస్తరణ నేపథ్యంలో జీహెచ్ఎంసీ మినీ తెలంగాణగా మారనుంది. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం కోటికి పైగా జనాభా ఉంది. విస్తరణ తర్వాత 2 కోట్లకు పెరగనుంది. అంటే రాష్ట్ర మొత్తం జనాభాలో దాదాపు సగం జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉంటుంది. జీహెచ్ఎంసీ పరిధి ప్రస్తుతం 650 చదరపు కిలోమీటర్లు. విస్తరణ తర్వాత దాదాపు 2,735 చదరపు కిలోమీటర్ల వరకు ఉండనుంది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ వార్షిక బడ్జెట్ 8 వేల కోట్లు దాటగా.. విస్తరణ తర్వాత రూ.15 వేల కోట్లు దాటే అవకాశాలున్నాయి.

హెచ్ఎండీఏ ఆదాయానికి గండి

జీహెచ్ఎంసీ విస్తరణతో హైదరాబాద్ మహా నగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ఆదాయం పడిపోనుంది. ప్రస్తుతం హెచ్ఎండీఏకు వస్తున్న ఆదాయంలో 60 శాతానికి పైగా ఓఆర్ఆర్ వెంట ఉన్న గ్రోత్ కారిడార్ నుంచే వస్తోంది. భూములు, ప్లాట్ల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంతో పాటు ప్లానింగ్ విభాగం ద్వారా హెచ్ఎండీఏ భారీగా నిధులు సమకూర్చుకుంటోంది. పెద్దఎత్తున స్థలాలు అందుబాటులో ఉండడంతో నిర్మాణ సంస్థలు ఇక్కడ భారీ ప్రాజెక్టులు చేపడుతున్నాయి. దక్షిణ భారతదేశంలోనే ఎత్తయిన భవనాలు హెచ్ఎండీఏ పరిధిలో నిర్మాణమవుతున్నాయి. కోకాపేట, పుప్పాలగూడ, నార్సింగి, మణికొండ తదితర ప్రాంతాల్లో 50 అంతస్తులకు పైగా భవనాలు వస్తున్నాయి. వివిధ రకాల అనుమతుల ఫీజుల ద్వారానే ఏటా 2 వేల కోట్ల వరకు ఆదాయం వస్తోంది. హెచ్ఎండీఏ పరిధి 7 వేల చదరపు కిలోమీటర్ల నుంచి 10 వేల చదరపు కిలోమీటర్ల వరకు పెరగడంతో భారీగా ఆదాయం వస్తుందని భావించారు. ఇప్పుడు అధిక ఆదాయమిచ్చే కీలకమైన ఔటర్ అవతలి వరకు గల 2 వేల చదరపు కిలోమీటర్ల ప్రాంతం జీహెచ్ఎంసీ పరిధిలోకి రావడం, 750 చదరపు కిలోమీటర్ల వరకు ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ)కి వెళ్లటంతో హెచ్ఎండీఏ ఆదాయం భారీగా పడిపోయే అవకాశాలున్నాయి.



60 శాతం సీట్లు బీసీలకే ఇద్దాం!

- పంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో ఆ వర్గాలకే ప్రాధాన్యం
- హైకోర్టు తీర్పు వచ్చాకే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు
- రామగుండం, పాల్వంచ థర్మల్ ప్రాజెక్టులు ఎన్టీపీసీకి
- మంత్రివర్గ సమావేశంలో చర్చ

హైదరాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు పెద్ద పీట వెయ్యాలని, 60% దాకా సీట్లను బీసీలకే కేటాయించాలనే సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించినట్టు తెలిసింది. పంచాయతీ ఎన్నికలు పార్టీరహితంగా జరిగేవే అయినప్పటికీ.. ఎన్నికల్లో పోటీ చేయనున్న బీసీ వర్గాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, మద్దతుదారులకు ప్రాధాన్యం ఇవ్వాలని సహచర మంత్రులకు ఆయన సూచించినట్టు సమాచారం. ఈ మేరకు సచివాలయంలో మంగళవారం నిర్వహించిన మంత్రివర్గ భేటీలో బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చ జరిగినట్టు తెలిసింది. బీసీలకు 42% రిజర్వేషన్లు అధికారికంగా ఇవ్వాలని అనుకున్నప్పటికీ ఆ విషయం న్యాయపరిధిలోనే ఉండిపోయిందని మంత్రులు పేర్కొన్నారు. అందువల్ల పార్టీపరంగా బీసీలకు అత్యధిక స్థానాలు ఇవ్వాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్టు తెలిసింది. ఎన్నికలకు మరికొన్ని రోజుల వ్యవధి ఉంటే బాగుండేదని ఒకరిద్దరు మంత్రులు ఈ సందర్భంగా అభిప్రాయపడినట్టు సమాచారం. అయితే, న్యాయపరమైన చిక్కులు, కేంద్రం నుంచి నిధుల కోత వంటి సమస్యల వల్ల ఎన్నికలు ఇప్పుడే నిర్వహించడం సరైనదని ఇతర మంత్రులు వారికి వివరించినట్టు తెలిసింది. మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు (ఎంపీటీసీ), జిల్లాపరిషత్ ప్రాదేశిక సభ్యుల (జడ్పీటీసీ) ఎన్నికలను మాత్రం హైకోర్టు తీర్పు వచ్చిన తర్వాతే నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఇక, రామగుండం, పాల్వంచలోని జెన్‌కోకు చెందిన మూతబడిన ప్లాంట్ పునరుద్ధరణ బాధ్యతలను జెన్‌కో, ఎన్టీపీసీల్లో ఎవరికి అప్పగించాలన్న అంశంపైనా మంత్రివర్గంలో చర్చ జరిగినట్టు తెలిసింది. తక్కువ ఖర్చుతో ప్లాంట్ నిర్మించి, తక్కువ ధరకు విద్యుత్తు సరఫరా చేసే సంస్థకు బాధ్యతలు అప్పగించాలని సమావేశంలో నిర్ణయించారు. అయితే, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎన్టీపీసీకి ప్రాధాన్యం ఇవ్వాలన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రామగుండంతోపాటు పాల్వంచలోని థర్మల్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎన్టీపీసీకి ఇవ్వాలని మంత్రి తుమ్మల కోరారు. ఈ అంశాన్ని కూడా మంత్రివర్గం పరిగణనలోకి తీసుకున్నట్టు తెలిసింది.

భూ మార్పిడిపై విచారణ

- గత ప్రభుత్వ నిర్ణయాలన్నీ బయటపెడతాం
- మంత్రివర్గ ఉపసంఘం సభ్యుల ప్రకటన
- క్యాబినెట్ నిర్ణయాలు రహస్యంగా ఉండాలి
- లీక్ చేసిన వారిపై చర్యలు: మంత్రి శ్రీధర్‌బాబు
- బీఆర్ఎస్ హయాంలో కావాల్సిన వారికే భూ మార్పిడి
- ఈ ప్రభుత్వంలో అలాంటివి జరగవు: భట్టి విక్రమార్క
- భూ మార్పిడిపై కేటీఆర్, హరీశ్‌రావు దుష్ప్రచారం
- ఇది ఉపసంఘం సమష్టి నిర్ణయం: ఉత్తమ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ మార్పిడి వ్యవహారంపై విచారణ జరిపిస్తామని రాష్ట్ర మంత్రులు అన్నారు. నాడు ప్రభుత్వ పెద్దలు తమకు నచ్చిన వారికే భూ మార్పిడి చేశారని ఆరోపించారు. మంగళవారం మంత్రివర్గ సమావేశం అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా పరిశ్రమలను రాజధాని నగరం బయటకు తరలించడం, భూ మార్పిడి వ్యవహారంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలపై వారు స్పందించారు. భూ మార్పిడికి సంబంధించి మంత్రివర్గ నిర్ణయాలు రహస్యంగా ఉండాలని, మంత్రివర్గం ఆమోదించక ముందే వివరాలు బయటపెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. ప్రపంచంలోనే హైదరాబాద్ మహానగరంగా ఎదగాలన్నదే తమ ఉద్దేశమన్నారు. ఏ కార్యక్రమం చేపట్టినా పది మందికి మేలు చేసే విధంగానే ఉంటుందన్నారు. పన్నులు, రాబడుల గురించి కాకుండా.. నిర్మాణాత్మక పాలనా వ్యవస్థను తీసుకురావడంలో భాగంగానే ఔటర్ రింగు రోడ్డు బయటికి పరిశ్రమలను తరలించాలనే నిర్ణయించామని తెలిపారు. ఈ నిర్ణయం ఈ రోజు తీసుకున్నది కాదని, ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగానే దీనిపై చర్చలు జరిగాయని పేర్కొన్నారు. అనంతరం బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 2022 ఆగస్టు 10న మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని గుర్తు చేశారు. "మీరు మంత్రివర్గ ఉపసంఘంలో నిర్ణయిస్తే పుణ్య కార్యక్రమం, రాష్ట్ర ప్రగతికి మేము పారదర్శకంగా చేస్తే తప్పుడు కార్యక్రమమా? మీరు రూ.40 వేల కోట్ల వనరులు సమీకరించుకోవాలని నిర్ణయం తీసుకున్నది వాస్తవం కాదా?" అని శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. రెడ్, ఆరెంజ్ పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటికి తరలించాలన్న సుప్రీంకోర్టు తీర్పు మేరకే తాము నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి నిధులు రావొద్దని, వస్తే అడ్డుకోవాలన్నది బీఆర్ఎస్ ఉద్దేశమన్నారు. నిధులు అందుబాటులోకి వస్తే ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడానికి అవకాశం ఉంటుందని, అందుకే అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

మంత్రివర్గ ఉపసంఘం సమష్టి నిర్ణయం..

నిధుల సమీకరణలో భాగంగా పరిశ్రమలను ఔటర్ బయటికి తరలించడానికి వీలుగా, గ్రేటర్‌లో ఉన్న పారిశ్రామిక భూముల మార్పిడి చేయాలన్నది మంత్రివర్గ ఉపసంఘం తీసుకున్న సమష్టి నిర్ణయమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కేటీఆర్, హరీశ్‌రావు పూర్తిగా అసత్యాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కోర్ హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా చేయాలని అన్ని ప్రభుత్వాలు ఆలోచన చేశాయని, బీఆర్ఎస్ కూడా కొంత మేర ప్రయత్నాలు చేసిందని తెలిపారు. పారిశ్రామికవేత్తలతో, అధికారులతో చర్చించాకే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. భూ మార్పిడి అనంతరం పారిశ్రామిక జోన్‌లోని భూములను మల్టీ యూజ్ జోన్‌గా చేయాలని మంత్రివర్గమే నిర్ణయించిందని ఉత్తమ్ వెల్లడించారు. ప్రస్తుతం కొన్ని పరిశ్రమలు నడుస్తుండగా, కొన్ని దివాలా తీశాయని అన్నారు. దీంతో 100 శాతం చార్జీలకు ఎవరూ ఆసక్తి చూపలేదని, పరిశ్రమలు వెళ్లిపోవాలంటే రాయితీ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ పాలసీ ముమ్మాటికీ హైదరాబాద్ నగరానికి పూర్తిగా న్యాయం చేయాలని తీసుకున్నదేనని చెప్పారు.

గత నిర్ణయాలన్నింటినీ బయటపెడతాం..

గత ప్రభుత్వంలో ఎవరెవరు ఎన్ని భూ మార్పిడి ఉత్తర్వులు ఇచ్చారో త్వరలోనే లెక్కలతో సహా అన్నింటినీ బయటపెడతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. నాచారం, మల్లాపూర్, మౌలాలి, ఉప్పల్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, రామచంద్రాపురం ప్రాంతాల్లోని పరిశ్రమలన్నీ 50 ఏళ్ల కిందట హైదరాబాద్ నగర శివారులో ఉండేవని గుర్తు చేశారు. అయితే హైదరాబాద్ పెద్దఎత్తున విస్తరించడంతో ఇవన్నీ నగరం లోపలికి వచ్చాయని, పారిశ్రామికవాడల చుట్టూ నివాస ప్రాంతాలు ఏర్పాటయ్యాయని అన్నారు. ఢిల్లీలో కాలుష్యం పెరిగి, కొన్ని రోజులపాటు స్కూళ్లు, కార్యాలయాలు మూసేసే పరిస్థితి ఉందని, భవిష్యత్‌లో హైదరాబాద్‌కు ఈ పరిస్థితి రాకూడదనే పరిశ్రమలను తరలించాలనే నిర్ణయం తీసుకున్నామని వివరించారు. కావాల్సిన వారి భూములను కన్వర్ట్ చేయడం, వ్యక్తిగత పరిచయాలతో సహాయం చేయడం వంటి విధానం ఉండకూడదన్నదే తమ ప్రభుత్వ విధానమన్నారు. తరతమ భేదం లేకుండా నిర్ణయాలు అమల్లోకి రావాలన్నది తమ అభిమతమని చెప్పారు. బీఆర్ఎస్‌లాగా తప్పుడు పనులు చేయబోమని అన్నారు. మౌలిక సదుపాయాలు, నీటి పారుదల ప్రాజెక్టులు, పేదల సంక్షేమం కోసం ఆదాయ వనరులు సమకూర్చుకోవాలని, ఇందు కోసం ప్రజలపై పన్నుల భారం మోపకుండా నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసం నీచానికి దిగజారుతున్నారు: జూపల్లి

బీఆర్ఎస్ నేతలు రాజకీయ లబ్ధి కోసం నీచానికి దిగజారుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బట్టకాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారని, అడ్డగోలుగా సంపాదించిన సొమ్ముతో గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రూ.5 లక్షల కోట్ల స్కామ్ అని, ఏకపక్ష నిర్ణయమని, దక్షిణాది జిల్లాల మంత్రులకు ఈ నిర్ణయం ఇష్టం లేదని కేటీఆర్, హరీశ్‌రావు రకరకాల రాతలు వండి వార్చి రాశారని విమర్శించారు. గతంలో కేటీఆర్ వ్యక్తిగతంగా 42 ఎకరాల పారిశ్రామిక భూమిని రెసిడెన్షియలల్‌గా మారుస్తూ అనుమతులు ఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను మాత్రమే తాము కొనసాగిస్తున్నామని చెప్పారు. భూమార్పిడికి అనుమతినిచ్చిన భూములన్నీ ప్రభుత్వ భూములు కావని, 50-60 ఏళ్ల కిందట పారిశ్రామికవేత్తలు కొన్న భూములని పేర్కొన్నారు. ప్రజల మనసుల్లో విషబీజాలు నాటే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రివర్గ ఉపసంఘంలో సమష్టిగా తీసుకున్న నిర్ణయంపై దుర్మార్గంగా ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

ప్రభుత్వ పథకాలకు ఓ డిస్కమ్!

కొత్త డిస్కమ్ ఏర్పాటుకు మంత్రివర్గం నిర్ణయం

- వ్యవసాయ పంపుసెట్లు, ఎత్తిపోతల పథకాలు, నీటిపారుదల ప్రాజెక్టుల కనెక్షన్లన్నీ దీని పరిధిలోకే
- 10వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజీలో పెట్టుబడులకు ఆహ్వానం
- క్యాబినెట్ భేటీలో నిర్ణయాలు వెల్లడించిన మంత్రి శ్రీధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో జూపల్లి, అడ్లూరి

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా మరో విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కమ్) ఏర్పాటు కానుంది. ఉచిత కరెంటు అందించే వ్యవసాయ కనెక్షన్లతోపాటు వివిధ ప్రభుత్వ పథకాలకు చెందిన కనెక్షన్లకు విద్యుత్తు సరఫరా బాధ్యతను చూసేందుకుగాను ప్రత్యేకంగా డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. వ్యవసాయ పంపుసెట్లు, ఎత్తిపోతల పథకాలు, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ సీవరేజీ బోర్డు, మిషన్ భగీరథ, గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థ కనెక్షన్లను ఈ డిస్కమ్ పర్యవేక్షించనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న టీజీఎస్పీడీసీఎల్ (దక్షిణ డిస్కమ్-హైదరాబాద్), టీజీఎన్పీడీసీఎల్(ఉత్తర డిస్కమ్-వరంగల్)కు అదనంగా మూడో డిస్కమ్ రానుంది. మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో మూడో డిస్కమ్‌పై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఆ వివరాలను పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి వెల్లడించారు. 28,89,921 వ్యవసాయ పంపుసెట్లు, 429 దాకా ఉన్న ఎత్తిపోతల పథకాల కనెక్షన్లు, వాటర్ బోర్డుకు చెందిన 60 కనెక్షన్లు, మిషన్ భగీరథ/గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థకు చెందిన 276 కనెక్షన్లు కలుపుకొని 28,90,686 కనెక్షన్లతో ఈ డిస్కమ్ ఏర్పాటు కానుందన్నారు. రానున్న పదేళ్లలో విద్యుత్ డిమాండ్, ఉత్పత్తిపై ఇంధన శాఖ అధికారులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను మంత్రివర్గం పరిశీలించిందని శ్రీధర్‌బాబు చెప్పారు. ఆపై.. వచ్చే ఐదేళ్ల కోసం 3వేల మెగావాట్ల సౌరవిద్యుత్, 2వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జలవిద్యుత్ అందించే సంస్థల నుంచి విద్యుత్ సరఫరా కోసం టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో మరో 10వేల మెగావాట్ల పంప్డ్‌స్టోరేజీ జలవిద్యుత్ కేంద్రం ఏర్పాటుకు అనుకూలత ఉండటంతో ఆ రంగంలో పెట్టుబడులను ఆహ్వానించాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన భూమిని.. ఆ కేంద్రం నుంచి డిస్కమ్‌లకు కరెంట్ సరఫరా చేయాలనే షరతుతో ఇవ్వాలని నిర్ణయించామన్నారు.

పెట్టుబడులకు ఆహ్వానం..

రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలుగా కొత్త పరిశ్రమలు పెట్టేవారికి సౌరవిద్యుత్‌లో క్యాప్టివ్ ప్లాంట్లు పెట్టుకోవడానికి అనుమతినివ్వాలని మంత్రివర్గం సమావేశం నిర్ణయించినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. పరిశ్రమలు తమ విద్యుత్ అవసరాలను క్యాప్టివ్ ప్లాంట్లతో తీర్చుకోవడానికి అవకాశం ఇస్తామన్నారు. ఈ ప్లాంట్లతో విద్యుత్ ఉత్పత్తిపై ఎలాంటి గరిష్ఠ పరిమితి ఉండదన్నారు. రామగుండంలోని జెన్‌కోకు చెందిన థర్మల్ ప్లాంట్ స్థలంలో కొత్తగా 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతినివ్వాలని నిర్ణయించామన్నారు. ఎన్టీపీసీ, తెలంగాణ జెన్‌కోల్లో తక్కువ ధరకు కరెంట్ అందించే/తక్కువ వ్యయంతో నిర్మాణం చేసేవారికే ఈ ప్లాంట్ నిర్మించే అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇక భద్రాద్రి కొత్తగూడెంలోని పాల్వంచతో పాటు నారాయణపేట జిల్లాలోని మక్తల్‌లో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి అవకాశాలను పరిశీలించాలని ఇంధన శాఖను మంత్రివర్గం ఆదేశించిందన్నారు. రామగుండంలో ఎన్టీపీసీ నిర్మించదలిచిన 4వేల మెగావాట్లలో 2400 మెగావాట్ల కరెంట్ వద్దని తాము లేఖ రాయలేదని మంత్రి చెప్పారు. ఆ లేఖ రాసిన వారినే అడగాలని ఓ ప్రశ్నకు సమాధానంగా బదులిచ్చారు. రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా అందించడానికే ఈ నిర్ణయాలు తీసుకున్నామన్నారు. మొత్తం విద్యుత్‌లో 40% వాటా థర్మల్ ఉండేలా చూస్తున్నామన్నారు. దీనికోసం సంప్రదాయేతర ఇంధన వనరులకు ప్రాధాన్యం ఇస్తున్నామని, పవన, జలవిద్యుత్ కేంద్రాలు పెడతామని అన్నారు. రామగుండంలో ప్రస్తుతం సబ్ క్రిటికల్ ప్లాంట్ ఉండగా.. దాని స్థానంలో సూపర్ క్రిటికల్ ప్లాంట్లు పెట్టాలనే నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఇక ఇప్పటిదాకా కరెంట్ చార్జీలు పెంచలేదని, అలాంటి చర్చ ఏదీ క్యాబినెట్‌లో రాలేదని ఆయన తెలిపారు.

బెంగళూరు తరహాలో భూగర్భ కేబుల్ వ్యవస్థ..

బెంగళూరు తరహాలో హైదరాబాద్‌లోనూ భూగర్భ కేబుల్ వ్యవస్థ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. నగరంలోని విద్యుత్ సరఫరా వ్యవస్థకు చెందిన సర్కిళ్లను మూడు భాగాలుగా విభజించి.. విద్యుత్ కేబుళ్లతోపాటు ఇంటర్నెట్ కేబుళ్లను కలిపి వ్యవస్థ ఉండేలా వర్కింగ్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని అధికారులను మంత్రివర్గం ఆదేశించిందన్నారు. దీనికి రూ.14,725 కోట్లు అవుతాయని లెక్కగట్టినట్లు తెలిపారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దుమ్ముగూడెం మండలంలోని పెద్ద నల్లబెల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు 20.28 ఎకరాల భూమిని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ప్రకటించారు. ములుగు జిల్లా ములుగు మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో 40 ఎకరాల విస్తీర్ణంలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకూ ప్రభుత్వ భూమిని కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)లుగా మార్చాలని నిర్ణయించామన్నారు. మరిన్ని ఏటీసీలను మంజూరు చేస్తామని, కొత్తగా జూబ్లీహిల్స్‌లో ఏటీసీని ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు.

పునరావాస సహాయం పెంపు

- ఉద్దండాపూర్ నిర్వాసితులకు రూ.18 లక్షలు,
- నారాయణపేటలో 20 లక్షలు చెల్లింపు.. మంత్రివర్గ సమావేశం ఆమోదం

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూసేకరణతో నిర్వాసితులవుతున్న కుటుంబాలకు పునరావాసం, పునర్‌నిర్మాణం కింద సహాయం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నిర్మిస్తున్న ఉద్దండాపూర్ రిజర్వాయర్ భూసేకరణలో ఇప్పటిదాకా రూ.16 లక్షల సహాయం అందించాలని నిర్ణయించగా.. దానిని రూ.18 లక్షలకు పెంచారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో నిర్వాసితులవుతున్న కుటుంబాలకు రూ.14 లక్షల సహాయాన్ని రూ.20 లక్షలకు పెంచనున్నారు. ఈ మేరకు మంగళవారం మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. 65 ఏళ్లు దాటిన ఒంటరి వాళ్లను కుటుంబంగా పరిగణనలోకి తీసుకొని సహాయం చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పునూ అమలు చేయనున్నారు. ఇక నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పేరును 'మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం'గా మారుస్తూ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా మంగళవారం జీవో జారీ చేశారు.

మద్యం దుకాణాల సంఖ్య ఇలాగే పెరిగితే.. రాష్ట్రానికి కొత్త పేరు పెట్టాల్సి వస్తుంది!

» హైకోర్టు వ్యాఖ్య

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్ల సంఖ్య వేగంగా పెరిగిపోతుండటంపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇదే వేగంతో మద్యం దుకాణాలు బార్ల సంఖ్య పెరిగితే తెలంగాణ రాష్ట్రానికి కొత్త పేరు పెట్టాల్సి వస్తుందని వ్యాఖ్యానించింది. అయితే మద్యం వినియోగం, దుకాణాల సంఖ్య విషయంలో హైకోర్టు పాత్ర పరిమితమేనని అభిప్రాయపడింది. మద్యం దుకాణాల ప్రకటనల బోర్డులు కనీసం ప్రధాన రహదారి నుంచి కనిపించని విధంగా ఉండాలని తెలిపింది. దీనిపై ప్రభుత్వం ఒక విధానపర నిర్ణయం తీసుకునే వరకు తాము మార్గదర్శకాలు జారీచేయాల్సి ఉందని పేర్కొంది. నాగారం మున్సిపాల్టీ పరిధిలోని శ్రీ సత్యనారాయణ కాలనీలోని నివాస గృహాల మధ్యలో లిక్కర్ షాప్ పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ కాలనీ సంక్షేమ సంఘం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. వివరణ ఇవ్వాలని ఎక్సైజ్ శాఖ, మున్సిపల్ అధికారులకు, దుకాణదారులకు నోటీసులు జారీచేస్తూ విచారణను వాయిదా వేసింది.

ట్రిపుల్ రైడింగ్‌కు అంత చలాన్ ఎలా వేశారు?

» చలాన్ విధించాక..డిస్కౌంట్ సరికాదు: హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బైక్‌పై ముగ్గురు వ్యక్తులు వెళ్లినందుకు మోటార్ వెహికిల్ (ఎంవీ యాక్ట్) చట్టంలోని ఏ నిబంధన కింద పెద్ద మొత్తంలో చలాన్ వేశారో చెప్పాలని హైకోర్టు ట్రాఫిక్ పోలీసులను ప్రశ్నించింది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఫైన్లు విధించడం, ఆ తర్వాత డిస్కౌంట్లు ఇవ్వడం సరికాదని తెలిపింది. ట్రిపుల్ రైడింగ్‌కు రూ.1,235 చలానా విధించడం చెల్లదని పేర్కొంటూ తార్నాకకు చెందిన రాఘవేంద్రచారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం విచారణను డిసెంబర్ 9కి వాయిదా వేసింది.

5వేల కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.5000 కోట్ల అప్పు తీసుకుంది. మంగళవారం నాడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఈ రుణాన్ని సేకరించింది. 7.34 శాతం వార్షిక వడ్డీ, 13 ఏళ్ల కాల పరిమితితో రూ.500 కోట్లు, 7.46 శాతం వార్షిక వడ్డీ, 17 ఏళ్ల కాల పరిమితితో రూ.2000 కోట్లు, 7.45 శాతం వార్షిక వడ్డీ, 23 ఏళ్ల కాల పరిమితితో రూ.1500 కోట్లు, 7.45 శాతం వార్షిక వడ్డీ, 28 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్ల చొప్పున మొత్తం రూ.5000 కోట్ల అప్పు సేకరించింది. తెలంగాణతో పాటు దేశంలోని 14 రాష్ట్రాలు రూ.25,067 కోట్ల రుణాలు తీసుకున్నాయి.

పాత పింఛను పునరుద్ధరించాలి

» ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ఎన్‌ఎంవోపీఎస్ నిరసన

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాత పింఛను పథకాన్ని (వోపీఎస్) తిరిగి అమలు చేయాలని కోరుతూ నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌ఎంవోపీఎస్) సంఘం ప్రతినిధులు మంగళవారం నాడు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలిపారు. సంఘం జాతీయ అధ్యక్షుడు వికె.బంధు, ప్రధాన కార్యదర్శి స్థితప్రజ్ఞ నాయకత్వంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)ను రద్దు చేయాలని, వోపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తమ సంవత్సరాల పోరాటం ఫలితంగానే రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో పాత పథకాన్ని అమలు చేశారని స్థిత ప్రజ్ఞ గుర్తు చేశారు.

దాడులు కట్టడి చేయకపోతే విధుల బహిష్కరణ

» ఆర్టీసీ కార్మిక సంఘం

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందిపై దాడుల కట్టడికి యాజమాన్యం, ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఆర్టీసీ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. దాడుల కట్టడికి చర్యలు తీసుకోకపోతేవిధుల బహిష్కరణకు పిలుపు ఇస్తామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న హెచ్చరించారు. ఇటీవల సిరిసిల్ల డ్రైవర్‌పై జరిగిన దాడి ఘటన మరువకముందే, సోమవారం హైదరాబాద్ హకీంపేట డిపో సిబ్బందిపై, అడ్డువచ్చిన ప్రయాణికులపై అమానుషంగా దాడి చేశారని వెల్లడించారు.

సీనియర్లకు 'టెట్' మినహాయింపు ఇవ్వాలి

» ప్రధాని కార్యాలయానికి టీఎస్‌యూటీఎఫ్ లేఖలు

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో తప్పనిసరిగా రెండేళ్లలో ఉత్తీర్ణులు కావాలన్న నిబంధన నుంచి.. 2010 సంవత్సరానికి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) ఓ ప్రకటనలో కోరింది. ఈ విషయంపై రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) కార్యాలయం నుంచి ప్రధానమంత్రికి లేఖలు రాశామని, గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా మెమోరాండం సమర్పించామని ఫెడరేషన్ సభ్యులు చావ రవి, వెంకట్ మంగళవారం తెలిపారు.

నేవీ గూఢచర్యం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మన దేశ రహస్యాలను పాకిస్థాన్‌కు చేరవేశారన్న కేసులో నేరం రుజువు కావడంతో మరో ఇద్దరు నిందితులకు శిక్షలు విధిస్తూ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. రాజస్థాన్‌కు చెందిన అశోక్‌కుమార్, వికాస్ కుమార్‌కు ఐదేళ్ల 11 నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించలేకపోతే మరో ఏడాది పాటు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విశాఖపట్నంలోని నేవీ స్థావరాలకు చెందిన రహస్యాలను పాకిస్థాన్ ద్వారా హనీట్రాప్ సేకరిస్తోందని ఏపీ ఇంటెలిజెన్స్ పోలీసులు 2019లో గుర్తించారు. ఈ కేసును విచారించిన ఎన్ఐఏ కోర్టు ఇప్పటికే ఆరుగురికి శిక్షలు విధించింది. తాజా తీర్పుతో 8 మందికి శిక్ష పడినట్లయింది.

జెరీనియం వ్యర్థాల్లో అధిక కర్బనం

» ఈ బయోచార్‌తో ఎసిడిక్ నేలలు సారవంతం

» హెచ్‌సీయూ ఆచార్యుల పరిశోధన.. జర్నల్‌లో ప్రచురితం

హైదరాబాద్ సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఔషధ నూనెల తయారీకి వినియోగించే జెరీనియం ఆకుల వ్యర్థాలతో కర్బనం, ఇతర పోషకాలు అధికంగా ఉండే బయోచార్‌ను తయారుచేసుకోవచ్చని హెచ్‌సీయూ ఆచార్యులు తమ పరిశోధనలో కనుగొన్నారు. ఈ బయోచార్ నేలను సారవంతం చేయడంతో పాటు మొక్కల అధిక ఎదుగుదలకు ఉపయోగపడుతుందని గుర్తించారు. హెచ్‌సీయూ ప్లాంట్ సైన్సెస్, ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆచార్యులు సంయుక్తంగా చేసిన ఈ పరిశోధన ఫలితాలను ప్రఖ్యాత జర్నల్ 'బయోమాస్ అండ్ బయోఎనర్జీ' ప్రత్యేక సంచికలో ప్రచురితమైంది. సాధారణంగా నూనె తీసిన తర్వాత జెరీనియం ఆకులను వృథాగా పారేస్తుంటారు. అయితే వాటితో చేసిన బయోచార్ వినియోగం వల్ల నిర్వీర్యమైన (ఎసిడిక్) నేలలు సైతం సారవంతమైనట్లు పరిశోధనలో గుర్తించారు. హెచ్‌సీయూ ల్యాబొరేటరీలో కొన్ని రోజ్‌మెరీ మొక్కల పెంపకంలో ఈ బయోచార్‌ను వినియోగించడంతో వాటి వేళ్ల పొడవు 130 శాతం, మొక్క పొడవు 72 శాతం, బరువు 160 శాతం, క్లోరోఫిల్ 85 శాతం, నత్రజని పరిమాణం 13 శాతం మెరుగైనట్లు పరిశోధనలో రుజువైంది. జెరీనియం ఆకుల వ్యర్థాలను భూమిలో కప్పేయకుండా పునర్వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలని పరిశోధకుల బృందం సూచించింది. ప్లాంట్ సైన్సెస్ విభాగం ప్రొఫెసర్ పాదిలి అప్పారావు నేతృత్వంలో కొనసాగిన ఈ పరిశోధనలో స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆచార్యులు వీవీఎస్ఎస్ శ్రీకాంత్, పోస్ట్ డాక్టోరల్ పరిశోధకులు దంతేశ్వరి, పీవీఎస్ఆర్ఎన్ శర్మ, రీసెర్చ్ స్కాలర్లు అక్షయ్‌రావు, ధరణీకుమార్ కీలకంగా వ్యవహరించారు.

మోగిన నగారా

(మొదటిపేజీ తరువాయి)

మొదలవుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశామని.. ఎక్కడా అడ్డంకులు లేకుండా గ్రామ పంచాయతీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించేలా.. అన్ని జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటామని ఎస్ఈసీ రాణి కుముదిని వెల్లడించారు.



మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

ఏయే విడతలో ఎన్నంటే..

రాష్ట్రవ్యాప్తంగా 12,728 సర్పంచు స్థానాలు, 1,12,288 వార్డులకుగాను.. తొలివిడతలో భాగంగా డిసెంబర్ 11న 4,236 సర్పంచ్, 37,440 వార్డుసభ్యుల స్థానాలకు.. రెండోవిడతలో భాగంగా డిసెంబరు 14న 4,333 సర్పంచ్, 33,350 వార్డుసభ్యుల స్థానాలకు.. మూడోవిడతలో భాగంగా 4,159 సర్పంచ్, 36,452 వార్డుసభ్యుల స్థానాలకు డిసెంబర్ 17న పోలింగ్ జరగనుంది. సర్పంచ్ ఎన్నికలకుగాను 15,522.. వార్డుసభ్యుల ఎన్నికకు సంబంధించి 1,12,474 పోలింగ్ స్టేషన్లను ఎన్నికల విభాగాలు ఎంపిక చేశాయి. ఈ ఎన్నికలను పార్టీరహితంగా చేపడతారన్న సంగతి తెలిసిందే. ఇందుకు అనుగుణంగానే రాష్ట్ర ఎన్నికల సంఘం.. ఎన్నికల సామగ్రిని ఇప్పటికే సిద్ధం చేసింది. గ్రామ పంచాయతీల పరిధిలో పోటీచేసే అభ్యర్థులకు కేటాయించాల్సిన గుర్తులను, బ్యాలెట్ పత్రాలను ఇప్పటికే ముద్రించింది. స్థానికంగా వచ్చే నామినేషన్ల ఆధారంగా ఆయా గుర్తులను అభ్యర్థులకు కేటాయించనున్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలోని 1,66,55,186 మంది గ్రామీణ ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషుల కన్నా మహిళలే ఎక్కువగా ఉన్నారు. మొత్తం ఓటర్లలో పురుషులు 81,52,231 మంది ఉండగా.. మహిళలు 85,12,455 మంది, ఇతరులు 500 మంది ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) సిద్ధం చేసిన ఓటర్ల తుదిజాబితా ఆధారంగా.. గ్రామపంచాయతీ, వార్డులవారీగా డీపీవోలు, ఎంపీడీవోల ద్వారా పరిశీలన జరిపి.. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా ఓటరు జాబితాను సిద్ధంచేసింది.

32 పంచాయతీలకు ఎన్నికల్లేవు

పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో అన్ని గ్రామాల్లో సందడి నెలకొంది. అయితే.. కొన్ని న్యాయపరమైన వివాదాల కారణంగా 32 పంచాయతీలకు ఈసారి ఎన్నికలను నిర్వహించడం లేదని ఎస్ఈసీ తెలిపింది. ములుగుజిల్లా మంగపేట మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు, కరీంనగర్ జిల్లా వి.సైదాపూర్ మండలంలోని 2 గ్రామ పంచాయతీలకు, ఖమ్మంజిల్లా ఏన్కూరు మండలంలో 4 పంచాయతీలకు, అదే జిల్లాలోని పెనుబల్లి మండలంలో ఒక గ్రామ పంచాయతీకి ఎన్నికలు జరగడం లేదని ఎస్ఈసీ పేర్కొంది.

ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లలున్నా..

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు ఇద్దరికంటే ఎక్కువమంది పిల్లలు ఉంటే అనర్హులు అనే విధానం చాలాకాలంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అయితే రాష్ట్రప్రభుత్వం జారీచేసిన జీవో ప్రకారం ఈసారి స్థానికసంస్థల ఎన్నికల్లో, ప్రస్తుతం చేపట్టే పంచాయతీ ఎన్నికల్లోనూ ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్నవారు సైతం పోటీచేసేందుకు అర్హులే. గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా ప్రభుత్వం ఖరారుచేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లపై భిన్నాభిప్రాయం వ్యక్తమవుతోంది. రిజర్వేషన్ల ప్రక్రియపై ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా సర్పంచ్ స్థానాలకు సంబంధించి ఆర్డీవో, డీపీవోలు.. వార్డుసభ్యులకు సంబంధించి ఎంపీడీవోలు రిజర్వేషన్లను ఖరారుచేశారు. ఆయా జిల్లాల్లో జనాభాకు అనుగుణంగా.. బీసీ వర్గాలకు ఒక్కోచోట ఒక్కో విధంగా రిజర్వేషన్లు కల్పించినప్పటికీ.. బీసీలకు మొత్తంగా 17శాతం రిజర్వేషన్లు మాత్రమే దక్కాయని రాజకీయ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. కొన్ని జిల్లాల్లో.. 25శాతం, మరికొన్ని చోట్ల 23శాతం బీసీ రిజర్వేషన్లను కల్పించినట్లు బీసీవర్గాలు చెబుతున్నాయి.

ఇదీ షెడ్యూలు..

గ్రామపంచాయతీ ఎన్నికలు	తొలివిడత	రెండో విడత	మూడో విడత
నామినేషన్ల స్వీకరణ	నవంబరు 27	నవంబరు 30	డిసెంబరు 3
నామినేషన్ల దాఖలుకు చివరితేదీ	నవంబరు 29	డిసెంబరు 2	డిసెంబరు 5
నామినేషన్ల పరిశీలన	నవంబరు 30	డిసెంబరు 3	డిసెంబరు 6
అభ్యంతరాల స్వీకరణ/పరిష్కారం	డిసెంబరు 1, 2	డిసెంబరు 4,5	డిసెంబరు 7,8
నామినేషన్ల ఉపసంహరణ గడువు	డిసెంబరు 3	డిసెంబరు 6	డిసెంబరు 9
ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీ	డిసెంబరు 11	డిసెంబరు 14	డిసెంబరు 17

జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌లో 'వందేమాతరం' వివాదం

» బీజేపీ, ఎంఐఎం సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం

» వందేమాతర గీతం ఆలపిస్తుండగా ఎంఐఎం సభ్యులు నిలబడలేదని బీజేపీ ఆరోపణ

» తమని అవమానించరంటూ మజ్లిస్ సభ్యుల అభ్యంతరం

» కుర్చీలు ఎక్కి ఇరువర్గాల పోటాపోటీ నినాదాలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో గందరగోళం నెలకొంది. ముఖ్యంగా వందేమాతరం గీతం విషయంలో బీజేపీ, ఎంఐఎం సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. సమావేశ మందిరం పోటాపోటీ నినాదాలతో హోరెత్తింది. అసలేం జరిగిందంటే.. బీజేపీ సభ్యులు పట్టుబట్టడంతో కౌన్సిల్ సమావేశంలో జయజయహే తెలంగాణ గీతంతో పాటు వందేమాతరం గీతాన్ని కూడా ఆలపించాలని మేయర్ విజయలక్ష్మి నిర్ణయించారు. అయితే, వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్నప్పుడు ఎంఐఎంకు చెందిన కొందరు సభ్యులు లేచి నిలబడకుండా తమ కుర్చీల్లోనే కూర్చున్నారంటూ బీజేపీ సభ్యులు ఆరోపించారు. వందేమాతరం ఆలపిస్తున్నప్పుడు కనీస గౌరవం లేకుండా కూర్చున్న వారికి సభలో ఉండే అర్హత లేదని బీజేపీ కార్పొరేటర్ ఒకరు వ్యాఖ్యానించారు. దీనిపై ఎదురుదాడికి దిగిన ఎంఐఎం సభ్యులు.. బీజేపీ సభ్యులు తమను అవమానించారని, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కుర్చీల మీదకు ఎక్కి బీజేపీ తీరుపై నిరసన తెలియజేశారు. స్పందించిన బీజేపీ సభ్యులు కూడా కుర్చీల పైకి ఎక్కి ఎంఐఎంకు వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. దీంతో ఇరుపార్టీల సభ్యుల తీరుపై మేయర్ విజయలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుర్చీలు ఎక్కిన వారిని బయటకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఎంపీ రఘునందన్‌రావు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పందించారు. సభ్యుడు మైకులో మాట్లాడని వ్యాఖ్యలు రికార్డుల పరిధిలోకి రావని, వ్యక్తిగత వ్యాఖ్యలపై వివాదం చేయడం సరికాదన్నారు.

సెల్‌ఫోన్ల రికవరీలో తెలంగాణ టాప్

న్యూఢిల్లీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ల రికవరీలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. పోగొట్టుకున్న, చోరీ అయిన సెల్‌ఫోన్ల రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. పోగొట్టుకున్న లేదా చోరీ అయిన సెల్‌ఫోన్ల రికవరీకి సంబంధించి దేశంలో అన్ని రాష్ట్రాల వివరాలను కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. ఈ జాబితాలో తెలంగాణ, కర్ణాటక లక్ష చొప్పున ఫోన్లను రికవరీ చేసి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచాయి. 80 వేలకు పైగా రికవరీలతో మహారాష్ట్ర రెండో స్థానం దక్కించుకుంది. 'సంచార్ సాథీ' యాప్ సహకారంతో పోలీసులు, టెలికమ్యూనికేషన్ శాఖల మధ్య సమన్వయంతో దేశ వ్యాప్తంగా ఫోన్ల రికవరీలో గణనీయమైన ప్రగతిని సాధించినట్లు కేంద్రం వెల్లడించింది. ఈ ఏడాది జూన్ నుంచి అక్టోబరు వరకు ఫోన్ల రికవరీలో 47 శాతం వృద్ధి రేటును కనబరిచినట్లు ప్రకటించింది. డిజిటల్ ఆస్తుల పరిరక్షణకు సంచార్ సాథీ యాప్‌ను ప్రతి పౌరుడు డౌన్‌లోడ్ చేసుకోవాలని కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ సూచించింది.

ప్రిన్సిపాల్ వద్దంటూ రోడ్డుపై పడుకొని విద్యార్థుల ధర్నా

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ జ్యోతిబాపూలె పాఠశాల విద్యార్థుల నిరసన

ఇచ్చోడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై ప్రశ్నిస్తే ప్రిన్సిపాల్ తిడుతున్నారని, వేధిస్తున్నారని ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మహాత్మా జ్యోతిబాపూలె పాఠశాల విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. రోడ్డుపై అడ్డంగా పడుకొని తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ నారాయణ తమను వేధిస్తున్నాడని రెండు రోజుల క్రితం వారు 'ఈ ప్రిన్సిపాల్ మాకు వద్దు' అంటూ లేఖ రాసి నారాయణకే అందించారు. దీంతో, ఆగ్రహానికి గురైన ప్రిన్సిపాల్.. నేను పాఠశాల నుంచి వెళ్లిపోవాల్సి వస్తే మిమ్మల్ని చంపి వెళ్లిపోతానని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీంతో కొందరు విద్యార్థులు మంగళవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పడుకొని ఆందోళనకు దిగారు. ప్రిన్సిపాల్ మారితే గాని పాఠశాలకు వెళ్లబోమన్నారు. పోలీసులు పిల్లలకు నచ్చజెప్పి పాఠశాలకు పంపించారు. ఈ ఘటనపై ప్రిన్సిపాల్ నారాయణను వివరణ కోరగా.. విద్యార్థులు సీక్రెట్‌గా ఫోన్‌లు వాడుతున్నారని, ఆ ఫోన్‌లు తీసుకున్నందుకు విద్యార్థులు అలా చేశారని చెప్పారు.



రోడ్డుపై ధర్నా చేస్తున్న పాఠశాల విద్యార్థులు

మాల వేసుకోవాలంటే సెలవు తీసుకోండి

(మొదటిపేజీ తరువాయి)

పోలీసు సిబ్బంది విధులకు హాజరయ్యేందుకు అనుమతి లేదని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్ పోలీసుస్టేషన్ ఎస్సై ఎస్.కృష్ణకాంత్ అయ్యప్ప దీక్ష తీసుకున్నారు. దీక్ష నియమాలను పాటిస్తూ విధులకు హాజరయ్యేందుకు అనుమతి కోరుతూ ఆయన ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆ విజ్ఞప్తిని తిరస్కరించిన ఉన్నతాధికారులు.. నిబంధనలపై పోలీసు సిబ్బంది అందరికీ స్పష్టతనిచ్చేలా ఓ మెమోను ఇటీవల జారీ చేశారు. అయ్యప్ప మాల సహా మరే ఆధ్యాత్మిక దీక్షలు తీసుకునే పోలీసులు విధి నిర్వహణలో ఉన్నప్పుడు కూడా ఆ దీక్ష నియమాలను పాటించాలి అనుకుంటే విధులకు సెలవు తీసుకోవాలని స్పష్టం చేశారు. అయితే, పోలీసు శాఖ నుంచి వచ్చిన ఈ ప్రకటనపై గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అయ్యప్ప మాల దీక్ష సమయంలోనే ఇలా చేస్తున్నారని, రంజాన్ సమయంలో ఈ నిబంధనలు ఎందుకు గుర్తు రావు? అని ప్రశ్నిస్తూ ఓ వీడియో విడుదల చేశారు. ఒక వర్గానికి మాత్రమే నిబంధనలు విధించి, మరో వర్గం విషయంలో సానుకూలంగా ఉండడం ఎంత వరకు సబబు? అని నిలదీశారు. నిబంధనలఅమలు అంశంలో హిందు, ముస్లింలను రెండు కళ్లుగా భావించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

'కాలుష్య పరిశ్రమల'పై కొరడా

» రాష్ట్రంలోని కార్ఖానాల్లో పీసీబీ తనిఖీలు

హైదరాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమలపై తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు (టీజీపీసీబీ) అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. నిబంధనలు పాటించని పరిశ్రమలను మూసివేయడంతో పాటు పద్ధతి మార్చుకోవాలని పలు కార్ఖానాలకు నోటీసులు జారీ చేస్తున్నారు. కొత్త పరిశ్రమలకు అనుమతులివ్వడంతో పాటు ఇప్పటికే ఉన్న పరిశ్రమలు.. చట్టాలు, నిబంధనలను పాటిస్తున్నాయా..? లేదా..? అనే అంశాలతో పాటు కాలుష్య నియంత్రణపై పీసీబీ ప్రత్యేక దృష్టి సారించింది. గత ఏడాది జనవరి నుంచి ఈ అక్టోబరు వరకు 2,620 పరిశ్రమల స్థాపనకు పీసీబీ అనుమతులు జారీ చేసింది. కాగా, రాష్ట్రంలో నీటి కాలుష్య కారక పరిశ్రమలు 2,193, వాయు కాలుష్య కారక పరిశ్రమలు 3,164 ఉన్నట్లు పీసీబీ గుర్తించింది. వీటిని అధికారులు క్రమంతప్పకుండా పర్యవేక్షిస్తున్నారు. కాగా, నిబంధనలు పాటించని, కాలుష్య కారక పరిశ్రమలను పీసీబీ మూసివేయిస్తోంది. గత ఏడాది జనవరి నుంచి ఈ అక్టోబరు వరకు రాష్ట్రంలో 305 కంపెనీలకు మూసివేయాలని/ఉత్పత్తిని నిలిపివేయాలని పీసీబీ ఉత్తర్వులు జారీచేసింది. 2,069 పరిశ్రమలకు సంబంధించిన కాలుష్య కారకాలను అధికారులు సమీక్షించారు. వీటిలో 1,234 పరిశ్రమలకు నోటీసులు జారీచేశారు. పీసీబీ నిబంధనలు పాటిస్తున్నారని నిర్ధారించుకున్న తర్వాత 697 పరిశ్రమలకు మూసివేత రద్దు ఉత్తర్వులు జారీ చేసినట్టు పీసీబీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

పైరసీ చేయడు.. సినిమాలు కొంటాడు

మువీరూల్జ్, తమిళ్ ఎంవీ వంటి సైట్ల నుంచి కొనుగోలు.. క్రిప్టోలో చెల్లింపులు.. ఆ సినిమాలకు హెచ్‌డీ హంగులు

» సైట్లో యాడ్స్‌తోనే డబ్బు

» మాజీ భార్యకేమీ తెలియదు.. రవిని అతి విశ్వాసమే పట్టించింది

» క్రైమ్స్ అడిషనల్ సీపీ శ్రీనివాస్

హైదరాబాద్ సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సినిమా పైరసీ, కాపీరైట్ ఉల్లంఘన, బెట్టింగ్, గేమింగ్ యాప్స్ ప్రమోషన్, మనీలాండరింగ్ కేసుల్లో అరెస్టయిన ఐ బొమ్మ రవి నుంచి విచారణ సందర్భంగా విస్తుపోయే విషయాలు తెలిశాయని హైదరాబాద్ క్రైమ్స్ అండ్ సిట్ అడిషనల్ సీపీ శ్రీనివాస్ తెలిపారు. ఐ బొమ్మ ప్రారంభం నుంచి రవి ఖాతాలో డబ్బులు జమ అయ్యేంత వరకు జరిగే ప్రాసెస్‌ను మంగళవారం ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. రవి తన వివరాలు, ఈ మెయిల్ ఐడీతో ఎన్‌జిలా కంపెనీ ద్వారా డొమైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఐపీ వాల్యూమ్ హోస్టింగ్ తీసుకున్నాడు. తర్వాత కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా పైరసీ సినిమాలు కొంటాడు. వాటిని హెచ్‌డీ క్వాలిటీ వచ్చేలా ఎన్‌హ్యాన్స్ చేస్తున్నాడు. బొమ్మ పోస్టర్‌ను రవి స్నేహితుడు నిఖిల్ డిజైన్ చేస్తాడు. బొమ్మ సైట్లో పోస్టర్ పడగానే దాన్ని చూడాలనుకుంటున్నవారు, డౌన్‌లోడ్ చేసుకోవాలనుకునేవారు 'టర్మ్స్ అండ్ కండిషన్స్'ను అంగీకరించాల్సి ఉంటుంది. అంగీకరించగానే వినియోగదారునికి తొలుత బెట్టింగ్, గేమింగ్ యాప్స్ లింకులు ఓపెన్ అవుతాయి. యాడ్స్ అయిపోయేదాకా వినియోగదారులు చూడాల్సిందే. అలా ఎన్ని లక్షల మంది చూస్తే అంత ఎక్కువ మొత్తంలో రవికి డబ్బులొస్తాయి. విలాసవంతంగా గడిపేందుకు రవి.. తాను ఆర్జించిన రూ.20 కోట్లలో రూ.17 కోట్లు వెచ్చించి విదేశాల్లో తిరిగారని అడిషనల్ సీపీ తెలిపారు. ఆయన ఖాతాలోని మిగిలిన రూ.3 కోట్లను ఫ్రీజ్ చేశామని.. హైదరాబాద్‌లో ఓ ప్లాట్‌ను, వైజాగ్‌లోని ఆస్తులను సీజ్ చేశామని వెల్లడించారు. ఇమ్మడి రవి సినిమాను నేరుగా పైరసీ చేయడు. టెలిగ్రామ్‌లో, మువీరూల్జ్, తమిళ్ ఎంవీ వంటి పైరసీ సైట్ల నుంచి కొంటాడు. ప్రతిగా వారికి క్రిప్టో కరెన్సీ రూపంలో ఆన్‌లైన్‌లో చెల్లిస్తాడు. ఆ పైరసీ సినిమాకు హెచ్‌డీ హంగులు అద్దుతుండటంతో ఐబొమ్మ, బప్పం విపరీతంగా ప్రజాదరణ పొందాయి. ఈ సైట్లను అడ్డంపెట్టుకొని లక్షల మంది డేటాను తన వద్ద స్టోర్ చేసుకోవడంతో పాటు.. బెట్టింగ్, గేమింగ్ యాప్స్ ప్రమోట్ చేయడం ద్వారా రవి రూ. కోట్లు సంపాదించినట్లు గుర్తించారు. త్వరలో వెబ్-3 టెక్నాలజీ రానుందని, ఆ టెక్నాలజీతో పైరసీ చేస్తే పట్టుకోవడం కష్టమని అడిషనల్ సీపీ వెల్లడించారు.

మాజీ భార్య సమాచారం ఇవ్వలేదు


ఐ బొమ్మలో సినిమా పైరసీ జరుగుతుందని ఇండస్ట్రీ నుంచి ఫిర్యాదు వచ్చాక సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగి సాంకేతిక ఆధారాల ద్వారా విచారణ చేస్తున్న క్రమంలో.. వారికి డొమైన్ రిజిస్ట్రేషన్ వివరాలు లభ్యమయ్యాయి. అందులో ఇచ్చిన ఫోన్ నంబర్ ఆధారంగా వాటికి సంబంధించి విదేశాల్లో ఉన్న డొమైన్ కంపెనీ నోడల్ ఆఫీసర్‌ను ఈ మెయిల్ ద్వారా సంప్రదించారు. అయితే పోలీసులు చేసిన మెయిల్ నేరుగా రవికి చేరింది. ఈ డొమైన్ ఎవరు వినియోగిస్తున్నారు? సినిమా పైరసీ చేసి ఐబొమ్మలో ఎవరు అప్‌లోడ్ చేస్తున్నారు? వివరాలు కావాలని పోలీసులు అడిగారు. తనకోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారని తెలుసుకున్న రవి.. "సినిమాలు పైరసీ చేస్తున్నట్లు మీ వద్ద ఏం ఆధారాలున్నాయి?" అంటూ ఉల్టా వారినే ప్రశ్నించాడు. దాంతో అతని మెయిల్స్, వ్యవహారశైలిపై పోలీసులు అనుమానించారు. అక్కడితో అతడిని ప్రశ్నించడం ఆపేశారు. అతడి ఐపీ అడ్రస్, డొమైన్ రిజిస్ట్రేషన్‌లో ఇచ్చిన నంబర్ల ఆధారంగా రివర్స్ ఇంజనీరింగ్ విచారణ చేసి, సీడీఆర్ పెట్టి నిఘా పెట్టారు. కొద్దిరోజుల వరకు పోలీసుల నుంచి ఎలాంటి మెసేజ్ లేకపోవడంతో తనను పట్టుకోలేరనే ఓవర్ కాన్ఫిడెన్స్‌తో రవి ఉండిపోయాడు. అందులో భాగంగానే విదేశాలు తిరుగుతూ.. విజిటింగ్‌లో భాగంగా హైదరాబాద్ చేరుకున్నాడు. ఆ వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులు మూసాపేటలోని రెయిన్‌బో విస్టాలో పట్టుకున్నారు. రవిని అతడి ఓవర్ కాన్ఫిడెన్సే పట్టించిందని అడిషనల్ సీపీ వెల్లడించారు. అతడి మాజీ భార్య ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, ఆమెకు ఈ విషయాలేవీ తెలియదని స్పష్టం చేశారు. కాగా రవి ఐదురోజుల కస్టడీ ముగిసింది. మరోవారం పాటు కస్టడీ ఇవ్వాల్సిందిగా సైబర్ క్రైమ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఇక.. కస్టడీ ముగిసిపోవడంతో రవికి బెయిల్ ఇవ్వాలని ఆయన తరఫున్యాయవాదులు వాదించారు. వాదనలు విన్న న్యాయస్థానం విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

నవంబరు 25.. బీసీలకు చీకటి రోజు

» 30న బీసీల యుద్ధభేరి నిర్వహిస్తాం

» డిసెంబరు 8,9 తేదీల్లో చలో ఢిల్లీ: జాజుల

పంజాగుట్ట/హైదరాబాద్ నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 42% బీసీ రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహిస్తామని అనేక సందర్భాల్లో హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, దానిని విస్మరించి బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నవంబరు 25ను బీసీలకు చీకటి రోజు, విద్రోహ దినంగా ప్రకటించారు. తెలంగాణలో బీసీలు సర్పంచులు కాకుండా కుట్రతో రిజర్వేషన్లు తగ్గించారని, రొటేషన్ పేరుతో బీసీల గొంతు కోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'బీసీలకు జరిగిన అన్యాయం- భవిష్యత్ కార్యాచరణ'పై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ తదితరులతో కలిసి జాజుల మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినా, బీసీ ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ నెల 30న హైదరాబాద్‌లో బీసీల యుద్ధభేరి నిర్వహిస్తామని, డిసెంబరు 8,9 తేదీల్లో చలో ఢిల్లీకి పిలుపునిస్తున్నామని, పార్లమెంటును ముట్టడిస్తామని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద పెద్ద ఎత్తున పోరాటం చేసి 42% రిజర్వేషన్లు సాధించుకుంటామని ఆయన అన్నారు.



అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, గుజ్జ కృష్ణ తదితరులు

బీసీల గొంతుకోసిన సర్కారు: ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జిల్లాను యూనిట్‌గా రిజర్వేషన్లు ఖరారు చేయడంతో బీసీలకు అన్యాయం జరిగిందని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్లను ఖరారు చేయాలన్నారు. ఇప్పుడు ప్రకటించిన రిజర్వేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ జేఏసీ కో-ఆర్డినేటర్ గుజ్జ సత్యం ఆధ్వర్యంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. రిజర్వేషన్లను 22శాతానికి తగ్గించి ప్రభుత్వం బీసీల గొంతు కోసిందని ధ్వజమెత్తారు. జీవో 46ను బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42% రిజర్వేషన్లను అమలు చేస్తూ ఎన్నికలు నిర్వహించాలన్నారు. జీవో 46ను రద్దు చేయాలన్న డిమాండ్‌తో బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరాహార దీక్షలు, ధర్నాలు నిర్వహిస్తామని కృష్ణయ్య తెలిపారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.